15-4Pg1exHMNWJQE.qxd:15-4Pg1exHMNWJQE.qxd 15/04/26 12:04 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
అనంతపురం
fb.com/vaartha Digital
Published from Anantapur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
15-4-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 74 పేజీలు: 08+4 వెల: 6.50

నోయిడా ఆందోళనల్లో పాక్ వాస్తం?

దక్షిణాదికి అన్యాయం జరిగితే సహించం: స్టాలిన్

విధాన రూపకల్పన, నిర్ణయాలు తీసుకోవడంలో మహిళలు చురుకైన భాగస్వాములు కావాలి.. అప్పుడు 2047 నాటికి వికసిత భారత్ దిశగా సాగే ప్రయాణం మరింత బలపడుతుంది.
-ప్రధాని మోడీ బహిరంగ లేఖ

లోక్ సభ సీట్లు @850!
పునర్విభజన బిల్లు రెడీ

ఎంపిలకు ముసాయిదా ప్రతులు పంపిణి
రేపటి నుంచి 3 రోజులు ప్రత్యేక పార్లమెంటు సభకు మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా
సీట్ల పెంపు విధానాన్ని వ్యతిరేకిస్తున్న విపక్షాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: భారత రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకోబోతుంది. దేశవ్యాప్తంగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను వేగవంతం చేస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. గురువారం రోజున పార్లమెంటులో డీలిమిటేషన్ బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు కేంద్రం తెలిపింది. పార్లమెంటుకు సంబంధించిన అధికారిక అజెండా వెలువడటంతో రాజకీయ వర్గాల్లో ఒక్కసారిగా వేడి పెరిగింది. ప్రభుత్వ సర్క్యులర్ ప్రకారం, లోక్‌సభ సభ్యుల సంఖ్యను 543 నుండి 850కి పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ 850 స్థానాలలో, 815 స్థానాలను రాష్ట్రాలకు, 35 స్థానాలను కేంద్ర పాలిత ప్రాంతాలకు కేటాయించినట్లు ఆ సర్క్యులర్ పేర్కొంది. ఈ మార్పులు 2029 లోక్‌సభ ఎన్నికల నుండి అమల్లోకి వస్తాయని కూడా అందులో తెలిపారు. ఈ బిల్లును ఇప్పటికే పార్లమెంటు సభ్యుల(ఎంపిలు)కు అందజేసింది. ఏప్రిల్ 16 నుండి ప్రారంభం కానున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో దీనిని ప్రవేశపెట్టే అవకాశం ఉందని వార్తలు సూచిస్తున్నాయి. 2027 జనాభా లెక్కల >>2

నేడు ఇండియా కూటమి భేటీ
డీలిమిటేషన్‌పై కేంద్రం కుట్ర: ఖర్గే



2

ప్రధాని మోడీకి ట్రంప్ ఫోన్

పశ్చిమాసియా తాజా పరిస్థితిపై చర్చలు
40నిమిషాలకు పైగా సమాలోచనలు
హార్మూజ్‌ను తెరచి సురక్షితంగా ఉంచాలని సూచించిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మంగళవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుండి ఫోన్ కాల్ వచ్చింది. ఇద్దరు నేతలు పశ్చిమ ఆసియాలోని ప్రస్తుత పరిస్థితితో పాటు ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై చర్చించారు. "నా మిత్రుడు, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుండి ఫోన్ కాల్ వచ్చింది. వివిధ రంగాలలో మన ద్వైపాక్షిక సహకారంలో సాధించిన గణనీయమైన పురోగతిని తాము సమీక్షించాము. అన్ని రంగాలలో మన సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి తాము కట్టుబడి ఉన్నాము" అని ఫోన్ కాల్ తర్వాత ప్రధాని మోడీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "తాము పశ్చిమ ఆసియాలోని పరిస్థితి గురించి కూడా చర్చించాము. హోర్మూజ్ జలసంధిని తెరిచి, సురక్షితంగా ఉంచడం ప్రాముఖ్యతను నొక్కి చెప్పాము" అని ఆయన రాసుకొచ్చారు. దాదాపు 40 నిముషాల పాటు చర్చలు సాగినట్లు ప్రధాని మోడీ తెలిపారు. కొనసాగుతున్న సంఘర్షణకు త్వరగా ముగింపు పలకడానికి ఉద్రిక్తతలను తగ్గించడం, చర్చలు, దౌత్యానికి నిరంతరం మద్దతు ఇస్తున్న భారతదేశం, అమెరికా -ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణను స్వాగతించింది. ఇది పశ్చిమాసియాలో శాశ్వత శాంతికి దారితీస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ సంఘర్షణ ఇప్పటికే ప్రజలకు అపారమైన బాధను కలిగించిందని, ప్రపంచ ఇంధన సరఫరా, వాణిజ్య నెట్‌వర్క్‌లకు అంతరాయం కలిగిం >>2

ఇక జెనీవాలో శాంతి చర్చలు!

కొనసాగుతున్న హార్మూజ్ దిగ్బంధం
అమెరికా, చైనా మధ్య ముదిరిన దౌత్య యుద్ధం

వాషింగ్టన్, ఏప్రిల్ 14: ఆరు వారాలుగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా, ఇరాన్ మధ్య మరోసారి చర్చలు జరగనున్నాయి. ఇరు దేశాల మధ్య కుదిరిన రెండు వారాల కాల్పుల విరమణ గడువు ఈ నెల 21తో ముగియనుండగా, ఆలోపే ఒక ఒప్పందానికి వచ్చేందుకు ఈ వారం చివరిలో మరోవిడత చర్చలకు రంగం సిద్ధమవుతోంది. ఈచర్చలు ఇస్లామాబాద్ >>2

ఎపిలో 'క్వాంటం' అద్భుతం

మంగళవారం క్వాంటం టెస్ట్ రిఫరెన్స్ ఫెసిలిటీ నప్రారంభ సభలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు

ఇది ఓ చారిత్రక సాంకేతిక విజయం
దేశంలో మొదటి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీని ప్రారంభించిన సిఎం చంద్రబాబు
పరిశోధనలు, విద్యార్థుల కోసం క్వాంటం టెస్ట్ బెడ్స్
హాజరైన నేషనల్ క్వాంటం నిపుణులు, ప్రొఫెసర్లు

విజయవాడ,ఏప్రిల్ 14,ప్రభాతవార్తప్రతినిధి: దేశంలోనే తొలి క్వాంటం ఫెసిలిటీ సెంటర్ ఆవిష్కరణ అమరావతిలో జరుగడం ఓ చారిత్రక అద్భుతమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని సందర్భంగా క్వాంటం నూతన అధ్యాయం ఏపీలో ఆవిష్కృతమైందని వ్యాఖ్యానించారు. దేశంలోనే తొలి క్వాంటం ఫెసిలిటీ సెంటర్‌ను అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు.మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ సీఎం చంద్రబాబుకు ఈ కార్యక్రమంలో సహకరించారు.క్వాంటం టెస్ట్ రిఫరెన్స్ ఫెసిలిటీ కలిగిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అవతరించిందని కొనియాడారు. అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, గన్నవరంలోని మేధాట వర్స్‌లో ఏర్పాటు చేసిన టెస్ట్ బెడ్స్‌ను సీఎం జాతికి అంకితం చేశారు. ఎస్ఆర్ఎం వర్సిటీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఎస్ఆర్ఎం నుంచి మేధాటవర్స్‌లోని టెస్ట్ బెడ్‌ను వర్చువల్ గా సీఎం ప్రారంభించారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, గన్నవరం మేధా టవర్స్ లో రెండు వేర్వేరు క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్స్ ఏర్పాటయ్యాయి. టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ సహా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, డీఆర్డీఓ లాంటి సంస్థలు సహకారంతో క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీల ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి నేషనల్ క్వాంటం మిషన్ సహా, ఐఐటీ ప్రొఫెసర్లు, క్వాంటం రంగంలోని పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలు, క్వాంటం ఇన్నోవేషన్ స్టార్టప్ ల ప్రతినిధులు, రీసెర్చ్ స్కాలర్లు, నిపుణులు హాజరయ్యారు. ఏపీలోని వివిధ యూనివర్సిటీలు, కాలేజీల నుంచి వర్చువల్ గా దాదాపు 1.5 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి నేషనల్ క్వాంటం మిషన్, డీఎస్టీ సహా వేర్వేరు క్వాంటం కంపెనీల ప్రతినిధులు, ఐఐటీ ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు హాజరయ్యారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలోని 1ఎస్ ఓపెన్ యాక్సెస్ క్వాంటం ఫెసిలిటీ సహా, మేధాటవర్స్‌లోని 1క్యూ క్వాంటం ఫెసిలిటీని ప్రారంభించామని పేర్కొన్నారు. ఈ రెండు క్వాంటం టెస్ట్ బెడ్స్ ద్వారా క్వాంటం కంప్యూటింగ్ ఉపకరణాలను పరీక్షించేలా సదుపాయాలు కల్పించామని తెలిపారు. ఈ రెండు కంప్యూటర్ల ఆవిష్కరణతో దేశంలోనే క్వాంటం టెస్ట్ రెఫరెన్స్ ఫెసిలిటీ కలిగిన తొలి రాష్ట్రం ఏపీ అని అభివర్ణించారు. వీటితో క్వాంటం కంప్యూటర్ హార్డ్‌వేర్‌ను పరీక్షించి సర్టిఫై చేసే సామర్థ్యాన్ని అమరావతి క్వాంటం వ్యాలీ సమకూర్చుకున్నదని చెప్పుకొచ్చారు. ఈ రెండు చోట్లా మైనస్ 273 సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలో పనిచేసే క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్‌లు ఏర్పాటు చేశామని వెల్లడించారు. క్వాంటం కంప్యూటర్ ఉపకరణాల తయారు చేసే కంపెనీలు, పరిశోధకులు, విద్యార్థులు, నిపుణులకు ఉపయోగపడేలా క్వాంటం టెస్ట్ బెడ్స్ ఉండనున్నాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇకపై విదేశాలపై ఆధారపడకుండా క్వాంటం విడిభాగాలు ఇక్కడే పరిక్షించవచ్చని తద్వారా దేశంలో క్వాంటం సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతుందని నిపుణులు చెబుతున్నారన్నారు. అమరావతిలోని ఉద్ధండరాయుని పాలెం వద్ద 50 ఎకరాల్లో ఏక్యూఏసీ కేంద్రం నిర్మితమవుతుంది. ఆరు టవర్లుగా నిర్మిస్తున్న ఈ భవనాల్లో అంతర్జాతీయ టెక్ దిగ్గజం ఐబీఎం భాగస్వామ్యంతో అత్యంత శక్తిమంతమైన 133 క్యూబిట్, 5కే గేట్ క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు కానుంది. ఐబీఎంతో పాటు టీసీఎస్, ఎల్ అండ్ టీ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు అమరావతి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం ఏర్పాటులో కీలక పాత్ర పోషిస్తున్నాయి. టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్, కేంద్ర ప్రభుత్వంలోని సీఐఎస్ఆర్ నేతృత్వంలోని నేషనల్ టెస్టింగ్ ల్యాబ్ లాంటి సంస్థలు కూడా దీనికి సహకారం అందిస్తున్నాయి. మరోవైపు ఎస్ఆర్ఎం యూనివర్సిటీలోని విద్యార్థులు సైతం క్వాంటం కంప్యూటర్ తయారీలో పాలు పంచుకున్నారు. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం నుంచి పరిశోధనలు, ఆవిష్కరణ కోసం ఇప్పటికే 80కిపైగా అంతర్జాతీయ స్థాయికంపెనీలు, >>2



పవర్‌ప్లాంట్‌లో పేలుడు

10 మంది మృతి, 40 మందికి గాయాలు
ఛత్తీస్‌గఢ్‌లో దుర్ఘటన

రాయ్‌పూర్, ఏప్రిల్ 14: ఛత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. ఒక పవర్ ప్లాంట్‌లోని బాయిలర్ పేలిన ఘటనలో 10 మంది మరణించగా,40 మంది గాయ ద్దారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్, >>2



తల్లిని బంధించి సజీవ దహనం

ఒంగోలులో ఓ దుర్మార్గుని కిరాతకం

ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలోని గద్దలగుంట ప్రాంతంలో మానవత్వాన్ని కుదిపేసే దారుణ ఘటన వెలుగుచూసింది. నవమాసాలు మోసి, కనిపెంచిన తల్లిని కాపాడాల్సిన కుమారుడే ఆమె ప్రాణాలను కిరాతకంగా తీసుకున్న ఈ ఘటన స్థానికంగా తీవ్రకలకలం రేపుతోంది. అచ్చకాల వెంకటరమణమ్మ అనే వృద్ధురాలు >>2

చేపల వేటపై 61 రోజులు నిషేధం

నేటి నుంచి అమలు

విజయవాడ,ఏప్రిల్ 14,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలోని తీరప్రాంతంలో చేపల వేటపై ఈ నెల 15 నుంచి నిషేధం అమల్లోకి రానుంది. దీంతో బాపట్ల జిల్లా చీరాల, వేటపాలెం, చినగంజాం,తో పాటు జిల్లాలోని సముద్రతీరంలో వేటను అధికారులు నిషేధించారు. చీరాల మండలం వాడరేవు సముద్ర తీరంలో బొట్లు, వలలను మత్స్యకారులు ఒడ్డుకు తీసుకువచ్చి భద్రపరుస్తున్నారు. సముద్ర జీవసంపద పెంపుదల, చేపల సంతానోత్పత్తిని దృష్టిలో ఉంచుకుని ప్రతిఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు మొత్తం 61 రోజుల పాటు ప్రభుత్వం వేట విరామాన్ని ప్రకటిస్తుంది. ఈ కాలంలో మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతినకుండా కడలి పుత్రులకు ప్రభుత్వం భారీ ఆర్థిక సాయాన్ని కూడా అందజేస్తోంది. ప్రతి ఏటా వేసవి కాలంలో చేపలు, ఇతర సముద్ర జీవులు సంతానోత్పత్తి చేస్తాయి. ఈ కీలక సమయంలో యాంత్రిక పడవలతో వేట సాగిస్తే మత్స్య సంపద అంతరించిపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో సముద్ర పర్యావరణాన్ని కాపాడటానికి రాష్ట్ర మత్స్యశాఖ ఈ 61 రోజుల విరామాన్ని తప్పనిసరి చేసింది. ఈ నిబంధనలు రాష్ట్రంలోని అన్ని రకాల మోటారు బోట్లకు వర్తిస్తాయి. కేవలం సంప్రదాయ పడవల ద్వారా తీరానికి సమీపంలో వేట సాగించే వారికి మాత్రమే మినహాయింపు ఉంటుంది. వేట విరామ సమయంలో నిబంధనలు అతిక్రమించి సముద్రంలోకి వెళ్లే వారిపై మత్స్యశాఖ కఠినంగా వ్యవహరించనుంది. నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ. 5,000 జరిమానా విధించడమే కాకుండా, వారి వలలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. అంతేకాకుండా, సదరు బోటు యొక్క లైసెన్స్, రిజిస్ట్రేషన్‌ను ఏడాది పాటు రద్దు చేస్తారు. తీరప్రాంతాల్లో నిఘా ఉంచేందుకు కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసుల సహకారం తీసుకోనున్నారు. వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం భరోసా కలిపిస్తుంది. వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రభుత్వం మత్స్యకార భరోసా పథకం కింద ప్రతిఅర్హత కలిగిన కుటుంబానికి రూ. 20,000ఆర్థిక సాయం అందజేస్తోంది.కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గత ఏడాది మత్స్యకార జీవన భృతి 20వేలు ఇచ్చారని, ఈ ఏడాది కూడా ఇదే నెలలో భృతి ఇవ్వాలని మత్స్యకారులు కోరుతున్నారు.

బీహార్ తొలి బిజెపి సిఎంగా 'సామ్రాట్'

నేడు ప్రమాణం
సిఎం పదవికి నితీశ్ రాజీనామా

పాట్నా, ఏప్రిల్ 14: బీహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ ఎంపికయ్యారు. దాదాపు రెండుదశాబ్దాలు పాటు బిహార్ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్న నితీష్ కుమార్ కాసేపటి క్రితమే రాజీనామా చేశారు. దీంతో బిహార్‌లో అత్యున్నత పదవిని అధిరోహించనున్న తొలి బీజేపీ నేతగా సమ్రాట్ చౌధరీ నిలిచారు. ఇప్పటివరకు బిహార్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న 57 ఏళ్ల సమ్రాట్ చౌదరి ఓబీసీ వర్గమైన కుష్వాహా కులానికి చెందిన వారు. బిహార్‌లోని ఓబీసీ కులాలలో యాదవుల తర్వాత >>2

పార్టీ బలోపేతమే కార్యకర్తల లక్ష్యం

ఉత్తరాంధ్రలో టిడిపి మహానాడు
17న స్థల ఎంపికపై స్పష్టత: మంత్రి లోకేష్

విజయవాడ,ఏప్రిల్ 14,ప్రభాతవార్తప్రతినిధి: తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ దిశానిర్దేశం చేశారు. ఎన్టీఆర్, చంద్రబాబుల ఆశయ సాధనే మన మార్గమని తెలిపారు. రెడ్ బుక్ సమాజ బాగు కోసమేనని ఉద్ఘాటించారు. రాజారెడ్డి రాజ్యాంగంతో ఏపీలో జగన్ విధ్వంసం సృష్టించారని ధ్వజమెత్తారు. టీడీపీ కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించి.. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మార్గనిర్దేశం చేశారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ నేతలతో లోకేశ్ సమావేశమయ్యారు. కాఫీ కబుర్లు కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలకు మంత్రి నారా లోకేశ్ పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు.సిద్ధాంతాలే నాయకత్వానికి బలమని ఉద్ఘాటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మాత్రమే కాకుండా, వాటి వెనుక ఉన్న పార్టీ సిద్ధాంతాలను కూడా ప్రజలకు వివరించడం అత్యంత కీలకమని వ్యాఖ్యానించారు. కార్యకర్తల మధ్య ఐక్యత, క్రమశిక్షణ ఉంటేనే పార్టీ మరింత బలపడుతుందని పేర్కొన్నారు. సిద్ధాంతాలపై ఆధారపడి ప్రజల్లో విశ్వాసం పెంచుకుంటేనే దీర్ఘకాలిక రాజకీయ విజయాలు సాధ్యమవుతాయని వివరించారు. సిద్ధాంతపరంగా ఎదిగిన నాయకత్వమే పార్టీ భవిష్యత్తును నిర్ణయిస్తుందని తెలిపారు. ఆరు ముఖ్య సిద్ధాంతాలు గ్రామస్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. ఎన్ని పనులున్నా సీఎం చంద్రబాబు, >>2

తిరుమలేశుని 'బ్రేక్'కు మూడురోజుల బ్రేక్?

వేసవిలో పెరిగిన రద్దీకి అనుగుణంగా చర్యలు
నిరీక్షణ లేని దర్శనాలపై అధ్యయనం
టైమ్‌స్లాట్ టోకెన్ల జారీలోనూ మార్పులు

తిరుమల,ఏప్రిల్ 14ప్రభాతవార్తప్రతినిధి: వేసవిసెలవుల్లో భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగే అవకాశం ఉందనే ముందుచూపుతో తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు రద్దీని తట్టుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందుకు అవసరమైన అన్ని రకాలుగా అధ్యయనం చేస్తూ గత రెండేళ్ళలో వేసవిసెలవుల సమయంలో ముఖ్యంగా మే,జూన్‌నెలల్లో భక్తుల తాకిడి,రద్దీని అంచనావేసి రాబోయే విపరీత సామాన్యభక్తులకు సాధ్యమైనంత వరకు క్యూలైన్లలో, కంపార్టుమెంట్లలో నిరీక్షణ తగ్గించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు.

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు నిర్దేశంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఇప్పటికే ఆలయ అధికారులు, విజిలెన్స్ అధికారులతో సమీక్షలు చేశారు. మంగళవారం సాయంత్రం దాదాపు రెండుగంటలపైగా సామాన్యభక్తుల వైపు నిలబడే మీడియాప్రతి నిధులతో తిరుమలలో కూలంకుషంగా చర్చించి అభిప్రాయ సేకరణ చేయడం ప్రత్యేకత. ప్రధానంగా తిరుమలలో ప్రస్తుతం అమలవుతున్న సాధారణ సర్వదర్శనం(ఎటువంటి టిక్కెట్లు, టోకెన్లులేని),టైమ్‌స్లాట్ సర్వదర్శనం(ఆఫ్‌లైన్), వివిఐ బ్రేక్ దర్శనాలు, ఆన్‌లైన్ ఆర్జితసేవల టిక్కెట్‌లు, సిఫార్సులేఖలపై వివిఐ బ్రేక్ దర్శనాలలో భక్తులను అనుమతిస్తున్నారు. ఇప్పటికే సరాసరి 70వేలమంది నుండి 75వేల మంది వరకు భక్తులకు మహాలఘు విధానంలోనే జయవిజయుల వరకే అనుమతించి దర్శనాలు చేయిస్తున్నారు. ఉదయం రెండు,రెండున్నరగంటలపైగా వివిఐ బ్రేక్ పేరుతో 3,500మంది వరకు భక్తులకు కులశేఖరపడి వరకు అనుమతించి దర్శనాలు చేయిస్తున్నారు. దీనివల్ల చాలావరకు సామాన్యభక్తులు దర్శనం కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన అవసరం ఉంది. దీన్ని వేసవిసెలవుల్లో వీలైనంతవరకు కుదించాలనేది అదనపు ఇఒ వెంకయ్యచౌదరి ఆలోచన. ఇందుకు సెలవుల్లో పూర్తిగా వారాంతం(శుక్ర,శని,ఆదివారాలు)లో వివిఐ బ్రేక్ దర్శనాలు >>2

ఎన్డీయే నేతలతో నేడు సిఎం భేటీ

విజయవాడ,ఏప్రిల్ 14,ప్రభాతవార్తప్రతినిధి:ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో కీలకఘట్టం ఆవిష్కృతంకానుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉండవల్లిలోని నివాసంలో ఎన్డీఏ కూటమి పార్టీల అత్యున్నత స్థాయి సమావేశం బుధవారం సాయంత్రంజరగనుంది. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలతో పాటు జాతీయ స్థాయి ప్రాధాన్యం ఉన్న విషయాలపై కూడా చర్చించనున్నారు. ఈ సమావేశానికి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కూటమిలోని ఇతర ముఖ్యనాయకులు హాజరుకానున్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదంపై మాట్లాడనున్నారు.

మంగళవారం క్వాంటం టెస్ట్ రిఫరెన్స్ ఫెసిలిటీ సెంటర్‌ను ప్రారంభించిన సిఎం చంద్రబాబు

ఎపిలో 'క్వాంటం' అద్భుతం

>> విద్యాసంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. క్వాంటం కంప్యూటింగ్ ఆల్గారిథమ్స్‌లో నిపుణులైన మానవ వనరులను సిద్ధం చేసేందుకు ఐఐటీ చెన్నై, వైసర్ లాంటి సంస్థలతో ప్రభుత్వం భాగస్వామ్యం కుదుర్చుకుంది. క్వాంటంలో నైపుణ్యాల కోసం ఇప్పటికే 60 వేల మంది శిక్షణ పొందుతున్నారు. వచ్చే ఐదేళ్లలో 45 లక్షల మందిని క్వాంటం నిపుణులుగా తీర్చిదిద్దేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. కేవలం 8 నెలల్లోనే క్వాంటం కంప్యూటింగ్ రిఫరెన్సు ఫెసిలిటీలు వాస్తవ రూపం దాల్చాయి. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో క్వాంటం కంప్యూటర్లను నిర్మించాలని నేను ఇచ్చిన సూచనల మేరకు ఇవి ఏర్పాటయ్యాయి. ముంబైలోని టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్, బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, పూణెలోని డీఆర్డీఓ సహా వివిధ సంస్థల భాగస్వామ్యంతో స్వదేశీ టెక్నాలజీతోనే ఈ క్వాంటం టెస్ట్ బెడ్‌లు సిద్ధమయ్యాయి దేశీయంగానే క్వాంటం ఉపకరణాలు తయారు చేయటం ఆత్మనిర్భర్ కార్యక్రమంలో కీలకమైన అంశం. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో రూపొందించుకున్న 10 సూత్రాల్లో డీప్ టెక్ కూడా ఓ కీలకమైన అంశం అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఐఐటీ చెన్నై, ఐబీఎం, వైసర్ సంస్థల భాగస్వామ్యంతో 45 లక్షల మందిని ఏఐ, క్వాంటం, డేటా సెక్యూరిటీలో నిపుణులుగా తీర్చిదిద్దుతాం. సాంకేతికతను అనుసరించటం కాదు...ఆవిష్కరణల స్థాయికి ఏపి ఎదిగేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. అమరావతి క్వాంటం వ్యాలీలో భాగంగా నిర్మితమైన తొలి క్వాంటం టెస్ట్ బెడ్స్ తో ఆంధ్రప్రదేశ్ ఈ టెస్ట్ ఫెసిలిటీ కలిగిన తొలి రాష్ట్రంగా మారింది. ఈ రెండు క్వాంటం టెస్ట్ ఫెసిలిటీల ద్వారా క్వాంటం కంప్యూటింగ్ ఉపకరణాలను పరీక్షించి సర్టిఫై చేసేందుకు అవకాశం ఏర్పడినట్టైంది. తద్వారా క్వాంటం కంప్యూటర్ హార్డ్ వేర్ ను పరీక్షించి సర్టిఫై చేసే సామర్థ్యాన్ని అమరావతి క్వాంటం వ్యాలీ అందిపుచ్చుకుంది. మైనస్ 273 డిగ్రీల ఉష్ణోగ్రత మధ్య క్వాంటం హార్డ్ వేర్, సెమీ కండక్టర్లను పరీక్షించేలా ఈ రిఫరెన్స్ ఫెసిలిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర శాస్త్రసాంకేతిక శాఖ కార్యదర్శి అభయ్ కరాండికర్, వర్చువల్ గా ప్రధాని సాంకేతిక సలహాదారు అజయ్ సూద్, డీఆర్డీఓ డీజీ ఆర్వీ ప్రసాద్,క్యూబిట్ ఫోర్స్ ఫౌండర్ వెంకట సుబ్రమణియన్, ఎస్ఆర్ఎం వర్సిటీ ప్రెసిడెంట్ సత్యనారాయణ్, వీసీ ప్రొఫెసర్ సతీష్ కుమార్, ఐఐటీ చెన్నై, తిరుపతి ప్రొఫెసర్లు కామకోటి, సత్యనారాయణ ఏపీ స్టేట్ క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ తదితరులు హాజరయ్యారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలోని క్వాంటం రెఫరెన్స్ ఫెసిలిటీని సీఎం పరిశీలించారు. క్వాంటం కంప్యూటర్ ఎలా పనిచేస్తుందనే విషయాలను క్యూబిట్ ఫోర్స్ సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. కేవలం స్వదేశీ వస్తువులతోనే స్వదేశీ ఆపరేటింగ్ సిస్టంతో దీన్ని నడుపుతున్నట్లు వివరించారు. క్వాంటం బెడ్‌లో ఉన్న వైర్లు, చిప్‌లను టెస్టింగ్ ఫెసిలిటీలో ఉంచి పరీక్షిస్తామని సీఎంకు క్యూబిట్ ఫోర్స్ సీఈవో వెంకట్ సుబ్రమణ్యం వివరించారు. క్వాంటం కంప్యూటర్ హార్డ్‌వేర్‌ను పరీక్షించాలంటే ఈ క్వాంటం రెఫరెన్స్ ఫెసిలిటీ తప్పనిసరి అని వెల్లడించారు.

పార్టీ బలోపేతమే కార్యకర్తల లక్ష్యం

>> తాను ప్రతి వారం ఏదో ఒక ఒక రోజు పార్టీ కార్యాలయంలో గడుపుతూ ప్రజా సమస్యలను వింటూ పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త ప్రత్యేక సమయం కేటాయించాలని సూచించారు. పార్టీ ప్రవేశపెట్టిన ఆరు ముఖ్య సిద్ధాంతాలను గ్రామస్థాయి వరకు తీసుకెళ్లి ప్రజల్లో చైతన్యం కల్పించాలని పేర్కొన్నారు. గతంలో దేవాలయంలాంటి తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై, చంద్రబాబు ఇంటిపై, నాయకులపై వైసీపీ నాయకులు దాడులు చేశారని ఆగ్రహించారు. కార్యకర్తలను హింసించారని.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలపై దమనకాండకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. అమర్‌నాథ్ గౌడ్, అబ్దుల్ సలాం, తోట చంద్రయ్యలను వెంటాడి మరీ చంపారని ఆవేదన వ్యక్తం చేశారు.డా.సుధాకర్, కోడెల శివప్రసాద్, మిస్బా అనే చిన్నారులను వేధించి.. వారి మరణానికి కారకులయ్యారని తెలిపారు. ఐకమత్యంగా పోరాట స్ఫూర్తితో వైసీపీ ఫేక్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే ఫేక్ సమాచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఏ ఆత్మ చెప్పిందో కానీ మావిగన్ అంటూ జగన్ అండ్ కో కలవరిస్తున్నారని మంత్రి నారా లోకేశ్ సెటైర్లు గుప్పించారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉన్న నేతలతో మంత్రి లోకేష్ సమావేశమయ్యారు. లోకేశ్‌తో భేటీకి ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మరికొందరు కీలక నేతలు హాజరయ్యారు. మేలో జరిగే మహానాడు నిర్వహణపై ప్రధానంగా చర్చించారు. ఈసారి మహానాడును నిర్వహించడానికి శ్రీకాకుళం జిల్లా రణస్థలం, విజయనగరం జిల్లా నెల్లిమర్ల ఈ ప్రాంతాలను టీడీపీ హైకమాండ్ పరిశీలిస్తోంది. ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌కు ఈ రెండు ప్రాంతాల్లో స్థలాలు పరిశీలించాలని నారా లోకేశ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల17వ తేదీన మహానాడు స్థల ఎంపికపై తుది నిర్ణయం తీసుకుంటామని లోకేశ్ స్పష్టం చేశారు.

తిరుమలేశుని 'బ్రేక్'కు మూడురోజుల బ్రేక్?

>> రద్దుచేయడంపై సమాలోచనలు చేస్తున్నారు. స్వామివారి సర్వదర్శనానికి 20గంటల వరకు నిరీక్షిస్తుండగా, ప్రత్యేక ప్రవేశ దర్శనాలు(300రూపాయలు) ఆరేడుగంటలు, టైమ్‌స్లాట్ భక్తులకు ఏకంగా పది,పన్నెండుగంటల సమయంనిరీక్షణ తప్పడంలేదు. ఈ సమయంలో పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా టిటిడి అధికారులు కొన్ని నిర్ణయాలు అమలు చేసే దిశగా కసరత్తు చేస్తోంది. మొదటగా ఏప్రిల్ 27వతేదీ నుండి విఐపి బ్రేక్ దర్శనాలు, టైమ్‌స్లాట్‌టోకెన్ల జారీలో మార్పులు చేయాలనే ఆలోచనతో ఉన్నారు. వేసవిసెలవుల్లో అన్ని రోజులు పూర్తిగా ప్రోటోకాల్ విఐపీలకు మాత్రమే బ్రేక్ దర్శనం కల్పించేందుకు,సాధారణ భక్తులకు సర్వదర్శనం సమయాన్ని పెంచే అవకాశాలపై యోచిస్తున్నారు. భక్తుల రద్దీని బట్టి క్యూలైన్లలో మార్పులు కూడా చేయాలనేది ప్రయోగాత్మక పరిశీలన. మే, జూన్, జులై నెలల్లో ప్రతినెలా సుమారు 23 నుంచి 24 లక్షల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్టు గణాంకాలు పరిశీలించారు. ఇప్పటికే ఉదయం వేళ విఐపి దర్శనాల పేరుతో రోజుకు మూడుగంటలవరకు సమయాన్ని కేటాయిస్తున్నారు. ఆ సమయాన్ని సామాన్య భక్తుల కోసం కేటాయిస్తే సుమారు 15 వేల మంది వరకు భక్తులు ఏడుకొండలస్వామిని దర్శించుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పెరుగుతున్న భక్తుల రద్దీతో సర్వదర్శనం కోసం భక్తులు 18నుండి 20గంటలపాటు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. ఆన్‌లైన్‌లో కొంతవరకు టిక్కెట్లు జారీచేస్తే అన్ని కేటగిరీలు తాత్కాలికంగా పక్కనపెట్టి ఒకేవిధమైన దర్శనాన్ని అమలుచేస్తే, నిరీక్షణ సమయాన్ని 8 గంటల నుండి 12 గంటల వరకు తగ్గించే అవకాశం ఉంటుందని అంచనా. ఇందుకోసం మరింతగా ఆటోమేషన్,ఆర్టిఫిషయల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను టిటిడి వినియోగించుకోవడానికి చూస్తోంది.

ప్రధాని మోడీకి ట్రంప్ ఫోన్

>>చిందని న్యూఢిల్లీ విశ్వసిస్తోంది. అదే సమయంలో, హోర్ముజ్ జలసంధి గుండా నిరాటంకమైన నౌకాయాన స్వేచ్ఛ, ప్రపంచ వాణిజ్య ప్రవాహం కొనసాగుతుందని తాము ఆశిస్తున్నట్లు భారత్ పేర్కొంది.

ఇక జెనీవాలో శాంతి చర్చలు!

>> లేదా జెనీవాలో జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. వేదిక, సమయం ఇంకా ఖరారు కాలేదని, బహుశా గురువారం నాటికి భేటీ ఉండొచ్చని ఒక అమెరికా అధికారి తెలిపారు.

అమెరికాకు ఇరాన్ సీరియస్ వార్నింగ్

బీజింగ్, ఏప్రిల్ 14: ఇరాన్‌తో తమకున్న ద్వైపాక్షిక సంబంధాలలో అమెరికా జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదంటూ చైనా ఘాటు హెచ్చరికలు జారీ చేసింది.

మంగళవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సిఎం చంద్రబాబు

'భారత రత్న'అంబేద్కర్‌కు చంద్రబాబు ఘన నివాళి

విజయవాడ,ఏప్రిల్ 14,ప్రభాతవార్తప్రతినిధి: అంతర్జాతీయ స్థాయిలో అగ్ర రాజ్యాలకు దీటుగా భారత దేశం నిలుస్తోందంటే అందుకు రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగమే కారణమని ఏపీ సీఎం చంద్రబాబు అభివర్ణించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారి జయంతి సందర్భంగా క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన అంబేద్కర్‌ను స్మరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి , మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవి. లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు పలువురు నేతలు పాల్గొన్నారు.ఇక భారత రాజ్యాంగ నిర్మాత, సంఘ సంస్కర్త, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నానంటూ 'ఎక్స్' సీఎం చంద్రబాబు పోస్టు పెట్టారు. అంటరానితనంతో కులవివక్షకు గురైనా ఉన్నత విద్యను అభ్యసించి దేశం గర్వించే అత్యున్నత స్థాయికి ఎదిగిన అంబేద్కర్ ఆదర్శప్రాయులు. ప్రపంచంలో బలమైన ప్రజాస్వామ్య దేశంగా మన దేశం నిలుస్తోందంటే దానికి కారణం ఆయన మనకిచ్చిన రాజ్యాంగం. సమాన అవకాశాలు, హక్కులు అందించి, ప్రతి పౌరుడికి రాజ్యాంగ రక్షణ కల్పించారు. అంబేద్కర్ ఆశయ సాధనే మన లక్ష్యం కావాలి. ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తూ, బాధ్యత కలిగిన పౌరుడిగా ఉండడమే ఆ మహనీయునికి మనం ఇచ్చే ఘన నివాళి అంటూ చంద్రబాబు పేర్కొన్నారు.

డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ నివాళి

దార్శనిక నాయకుడు, పండితుడు, భారతరత్న, భారత రాజ్యాంగ ప్రధాన రూపశిల్పి, రాజ్యాంగ ముసాయిదా కమిటీ ఛైర్మన్, స్వతంత్ర భారత దేశపు మొదటి న్యాయశాఖ మంత్రి అయిన బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయణ్ని స్మరించుకుందాం. సామాజిక న్యాయం, సమానత్వం, సాధికారత కోసం ఆయన చేసిన అవిశ్రాంత పోరాటం మనకు మార్గదర్శకంగా నిలుస్తూనేఉంది అంటూ ట్వీట్ చేశారు.

మంత్రి లోకేష్ నివాళి

అంబేద్కర్ జయంతి సందర్భంగా మంత్రి నారా లోకేశ్ "ఎక్స్" వేదికగా ఘన నివాళులర్పించారు. బలహీనవర్గాల శ్రేయస్సు, దేశ అభివృద్ధి కోసం జీవితాన్ని అంకితం చేశారని లోకేశ్ అన్నారు. సమాజంలో అంటరానితనం నిర్మూలన, వివక్షపై అలుపెరుగని పోరాటం చేశారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందని లోకేశ్ కొనియాడారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా దేశానికి వారందించిన సేవలను స్మరిం చుకుందామని ప్రజలకు లోకేశ్ పిలుపునిచ్చారు.

లోక్‌సభ సీట్లు @ 850!

>> పునర్విభజనతో ముడిపడి ఉన్న ప్రస్తుత కాలపరిమితికి బదులుగా, 2029లోపే లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించే సవరణలను కూడా ప్రభుత్వం విడిగా ప్రవేశపెట్టనుంది. రాజ్యాంగం ప్రకారం, ప్రస్తుతం రాష్ట్రాల నుండి 530 సీట్లు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి 20 సీట్లు ఉండవచ్చు. అయితే, ఒక పునర్విభజన కమిషన్ మొత్తం సీట్లను 543గా నిర్ధారించింది. ప్రభుత్వం, రాజ్యాంగ (131) సవరణ బిల్లును ఎంపీలకు పంపిణీ చేసినట్లు సమాచారం. ఇటీవల, లోక్‌సభ, అసెంబ్లీలలో మహిళలకు 33శాతం కోటాను త్వరితగతిన అమలు చేయడంతో పాటు, దిగువ సభలోని సీట్ల సంఖ్యను 816కు పెంచేందుకు రాజ్యాంగాన్ని సవరించాలని కోరుతూ ప్రవేశపెట్టిన ఒక బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు తెలిసింది. అలాగే నియోజకవర్గాల పెంపు వెనుక ఉన్న ఉద్దేశాన్ని ప్రభుత్వం వివరించింది. "1971 జనాభా లెక్కల ఆధారంగా నాడు నియోజకవర్గాల పునిర్విభజన జరిగింది. అప్పటి నుండి దేశ జనాభా స్వరూపంలో గణనీయమైన మార్పులు వచ్చాయి. రాష్ట్రాలమధ్య,రాష్ట్రాల లోపల జనాభాలో వచ్చిన గణనీయమైన మార్పులు, వేగవంతమైన పట్టణీకరణ, వలసలు, కొన్ని ప్రాంతాల్లో అసమాన జనాభా వృద్ధి వంటి అంశాలు ఇటీవల వెలువడిన జనాభా లెక్కల గణాంకాలలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీని ఫలితంగా జనాభా, నియోజకవర్గాల మధ్య విస్తృతమైన వ్యత్యాసాలు ఏర్పడ్డాయి' అని పేర్కొంది.

నారీ శక్తి వందన అధినియమ్ బిల్లు: పార్లమెంటు చరిత్రలో మరో కీలక ఘట్టంగా, లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు 33 శాతం కోటాను అమలు చేసేందుకు రాజ్యాంగాన్ని సవరించాలని కోరుతూ ప్రవేశపెట్టిన బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 'నారీ శక్తి వందన అధినియమ్'గా ప్రసిద్ధి చెందిన రాజ్యాంగ (నూట ఆరవ సవరణ) చట్టం, 2023, లోక్‌సభ, శాసనసభలలో మహిళలకు (షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన మహిళలతో సహా) దాదాపు మూడింట ఒక వంతు సీట్ల రిజర్వేషన్ కల్పించేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 239తితిను సవరించి, ఆర్టికల్స్ 330ఎ, 332ఎ, 334ఎలను చేర్చింది. ఈ బిల్లు లక్ష్యాన్ని ప్రస్తావిస్తూ,"లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ, జాతీయ రాజధాని ప్రాంతమైన ఢిల్లీ శాసనసభలో మహిళల భాగస్వామ్యాన్ని మరింతగా పెంచడమే" దీని ఉద్దేశ్యమని కేంద్రం పేర్కొంది. 'సదరు సవరణ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత నిర్వహించే సంబంధిత జనాభా లెక్కల ఆధారంగా మొదటి నియోజకవర్గాల పునర్విభజన చేపట్టిన తర్వాతే అటువంటి రిజర్వేషన్ అమలులోకి వస్తుందని సదరు నిబంధనలు తెలియజేస్తున్నాయి," అని బిల్లులో పేర్కొంది.

పార్ల మెంటు ప్రత్యేక సమావేశాల్లో ఈ తరుణంలో పార్లమెంటులో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం వెనుక ఉన్న ఆవశ్యకతను వివరిస్తూ, 131వ సవరణ బిల్లు ఇలా పేర్కొంది, 'తదుపరి జనాభా లెక్కలు, ఆ తర్వాత జరిగే పునర్విభజన ప్రక్రియకు గణనీయమైన సమయం పడుతుంది, తద్వారా మన ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళల సమర్థవంతమైన, అంకితభావంతో కూడిన భాగస్వామ్యం ఆలస్యం అవుతుంది. అందువల్ల, ఇటీవల ప్రచురించిన జనాభా లెక్కల గణాంకాల ఆధారంగా చేపట్టే పునర్విభజన ప్రక్రియ ద్వారా, లోక్‌సభలో, రాష్ట్రాల శాసనసభలలో, ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంతం, కేంద్రపాలిత ప్రాంతాలలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన మహిళలతో సహా మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్‌ను అమలులోకి తీసుకురావడమే ఈ ప్రతిపాదిత బిల్లు లక్ష్యం" లోక్‌సభలో సీట్ల కేటాయింపులో జరిగే పునఃసర్దుబాటుతో మహిళలకు సీట్ల రిజర్వేషన్ ఎలా ముడిపడి ఉందో నొక్కిచెబుతూ, ఈ బిల్లు ఇలా పేర్కొంటుంది, మహిళలకు సీట్ల రిజర్వేషన్ అమలు అనేది, లోక్‌సభ, శాసనసభలలో సీట్ల కేటాయింపులో జరిగే పునఃసర్దుబాటు అనే రాజ్యాంగ పథకంతో, డీలిమిటేషన్ కమిషన్ ద్వారా ప్రాదేశిక నియోజకవర్గాల సరిహద్దులను తిరిగి గీయడంతో ముడిపడి ఉంది.

వ్యతిరేకిస్తున్న ప్రతిపక్షాలు: 2011 జనాభా లెక్కల డేటాను ఉపయోగించి నియోజకవర్గాల పునర్విభజన చేయాలన్న కేంద్రం తీరును ప్రతిపక్షాలు తప్పుపడుతున్నాయి. ఆప్, ఆర్‌జెడి, డిఎంకె సహా పలు పార్టీలు 2021 జనాభా లెక్కల గణాంకాల ఆధారంగానే పునర్విభజన ప్రక్రియ జరగాలని డిమాండ్ చేస్తున్నాయి. వెనుకబడిన తరగతుల మహిళలకు "కోటాలో కోటా" ప్రాతినిధ్యం కల్పించాలన్న డిమాండ్‌పై స్పష్టత ఇవ్వాలని ఇండియా బ్లాక్ పార్టీలు కూడా కోరాయి. ప్రతిపక్ష నాయకులు ఢిల్లీలో బుధవారం (ఏప్రిల్ 15న) కాంగ్రెస్ అధినేత మల్లికార్జున్ ఖర్గే నివాసంలో సమావేశం కానున్నారు. ఈ సమావేశానికి తృణమూల్ కాంగ్రెస్, డిఎంకె పార్టీల నాయకులు కూడా హాజరయ్యే అవకాశం ఉంది.

మహిళలు ఒక్క తాటిపైకి రావాలి
ప్రధాని మోడీ బహిరంగలేఖ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: విధాన రూపకల్పన, నిర్ణయాలు తీసుకోవడంలో మహిళలు చురుకైన భాగస్వాములు అయినప్పుడు, 2047 నాటికి వికసిత భారత్ దిశగా సాగే ప్రయాణం మరింత బలపడుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ఈ మేరకు దేశ మహిళలకు ప్రధాని మోడీ బహిరంగ లేఖ రాశారు. "నారీ శక్తి వందన అధినియమ్"కు సంబంధించిన ఒక ముఖ్యమైన రాజ్యాంగ సవరణపై చర్చించడానికి ఏప్రిల్ 16న పార్లమెంట్ తిరిగి సమావేశమవుతుందని తెలిపారు. ఈ చట్టం సభలో ఆమోదం పొందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వికసిత భారత్ నిర్మాణానికి దోహదపడేందుకు బలమైన అవకాశం లభించినందుకు దేశవ్యాప్తంగా మహిళలు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు.

నేడు ఇండియా కూటమి భేటీ
డీలిమిటేషన్‌పై కేంద్రం కుట్ర: ఖర్గే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్ కమిషన్) బిల్లును ప్రవేశపెడుతున్నట్లు కేంద్రం ప్రకటించడంతో ప్రతిపక్షాలు అప్రమత్తమయ్యాయి. ఈ బిల్లుపై చర్చించేందుకు బుధవారం మధ్యాహ్నం ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో కూటమి నేతలు కీలక సమావేశం నిర్వహించనున్నారు. కేంద్రం ప్రతిపాదనలను ఎలా ఎదుర్కోవాలి, రాష్ట్రాల వారీగా జరిగే మార్పులపై ఎలా స్పం దించాలనే అంశంపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించనున్నారు.మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకోవాలనే మోడీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు.

మరింత పెరిగిన వేసవి తీవ్రత
ఒంటిమిట్టలో 45౦ఉష్ణోగ్రత

విజయవాడ, ఏప్రిల్ 14,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలో వేసవి ఎండల ప్రభావం తీవ్రంగా ఉంది. కడప జిల్లాలోని ఒంటిమిట్టలో మంగళవారం 45 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని, 262 మండలాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు అయినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు వెల్లడించారు.బుధవారం రాయలసీమ, కోస్తా జిల్లాల్లో 42 నుంచి 44 డిగ్రీల మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యేందుకు అవకాశం ఉందని తెలిపారు. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా 46 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉన్నట్లు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో 4 మండలాలు, విజయనగరం జిల్లాలో 19, పార్వతీపురం మన్యం జిల్లాలో 14, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1, పోలవరం జిల్లాలో 4, అనకాపల్లి జిల్లాలో 2, కాకినాడ జిల్లాలో 1, తూర్పుగోదావరి జిల్లాలో 1 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 73 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు.

వడగాడ్పుల తరుణంలో ఎండలో బయటకు వెళ్లేప్పుడు తలకి టోపి పెట్టుకోవాలని, తెలుపురంగు కాటన్: వస్త్రాలు ధరించడం వంటి జాగ్రత్తలు తప్పనిసరి అని అధికారులు చెబుతున్నారు. ఉదయం 10 గంటలు దాటిందంటే చాలు ప్రజల ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు హడలిపోతున్నారు. ఎండ తీవ్రత, వడగాల్పులు, ఉక్కపోత పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.తీవ్రమైన ఎండలు, ఉక్కపోత దృష్ట్యా విపత్తుల సంస్థ అధికారులు ఈ జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళల్లో బయటకు రావద్దని సూచించారు. తరచుగా మంచినీరు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటివి తీసుకోవాలని అన్నారు.

పవర్‌ప్లాంట్‌లో పేలుడు

>> శక్తి జిల్లా, సింగితారి గ్రామ సమీపంలోని వేదాంత పవర్ ప్లాంట్‌లో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. పవర్ ప్లాంట్‌లోని బాయిలర్ ఉన్నట్లుండి పేలిపోయింది. పేలుడు జరిగినప్పుడు చాలా మంది కార్మికులు పరిశ్రమ లోపల పని చేస్తున్నారు. ఈ పేలుడు భారీగా ఉండటంతో అక్కడ పని చేస్తున్న కార్మికుల్లో 10 మంది మరణించారు. మరో 30 నుంచి 40 మంది వరకు గాయపడ్డారు. ఈ ఘటనతో అక్కడ తొక్కిసలాట లాంటి పరిస్థితి తలెత్తింది. పేలుడు జరగడంతో అక్కడి కార్మికులు పారిపోయేందుకు ప్రయత్నించగా, ఇంకొందరు గాయపడ్డట్లు తెలుస్తోంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడ్డ వారిని స్థానిక ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో చాలా మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. పేలు డుకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో దృశ్యాలు హృదయ విదారకంగా ఉన్నాయి.ఈ అంశంపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి సమాచారం వెల్లడించలేదు.

బీహార్ తొలి బిజెపి సిఎంగా 'సామ్రాట్'

>> కుష్వాహా వర్గమే అతి పెద్దది ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలిగిన నితీష్ కుష్వాహా కులానికి చెందిన వ్యక్తినే తదుపరి సీఎంగా ప్రకటించాలని షరతు విధించినట్టు సమాచారం. నితీష్ సలహా మేరకే బీజేపీ సామ్రాట్‌కు సీఎం పీఠం అప్పగించినట్టు తెలుస్తోంది. మధ్యలో కొన్ని సంవత్సరాలు మినహా 2005 నుంచి బీజేపీ, బీహార్ ప్రభుత్వంలో మైనర్ భాగస్వామిగా ఉంటూ వచ్చింది. 20 సంవత్సరాల తర్వాత బీజేపీకి చెందిన నేత బిహార్ సీఎం అయ్యారు. 243 మంది సభ్యులున్న బిహార్ అసెంబ్లీలో నితీశ్ కుమార్ పార్టీకి 85 మంది ఎమ్మెల్యేలు ఉండగా, బీజేపీకి 89 మంది ఉన్నారు, బీహార్ కొత్త సీఎం అయిన సమ్రాట్ చౌధరీ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి . ఆయన మొదట ఆర్జేడీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆ తర్వాత జేడీ (యు)లో చేరారు. ఆ తర్వాత బీజేపీలో చేరి కీలక నాయకుడిగా ఎదిగారు. ఈ రకంగా ఆయనకు బీహార్‌లోని మూడు ప్రధాన పార్టీల్లో పని చేసిన అనుభవం ఉంది. ఏప్రిల్ 15వ తేదీన బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. బీహార్‌లోని ముంగేర్‌జిల్లాలో 1968 నవంబరులో జన్మించిన చౌదరి రాజకీయంగా అంచలంచెలుగా ఎదిగారు. ఆయన తండ్రి శకుని ఆరుసార్లు తారాపూర్ నియోజకవర్గంనుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన తల్లి పార్వతి కూడా అదేస్థానంనుంచి 1998లో ప్రస్తుతం చెలామణిలోలేని మతా పార్టీనుంచి ఎన్నికయ్యారు. చౌదరీ తన తారాపూర్ నియోజకవర్గం నుంచే 2025 ఎన్నికల్లో పోటీచేసి గెలిచారు. తండ్రి, తల్లి, కుమారుడు అదేస్థానంలో మొత్తం 12 సార్లు ఎన్నికలు జరిగితే 9 సార్లు గెలుచుకున్నారు. 1990నుంచే కెరీర్ ప్రారంభించిన 57 ఏళ్ల సామ్రాట్ చౌదరి రబ్రీదేవి సీఎంగా ఉన్న కాలంలో వ్యవసాయ మంత్రిగాపనిచేసారు. 2010, 2000 ఎన్నికల్లో పర్‌భట్టా నియోజకవర్గంనుంచి ఎన్నికయ్యారు. బిజెపి తరపున ఎన్నికై చీఫ్ విప్‌గా కూడా పనిచేసారు. ఆర్జేడి నుంచి 12 మంది ఎమ్మెల్యే లతోకలిసి బిజెపిలో చేరారు. బీహార్ బిజెపి చీఫ్‌గా కూడా పనిచేసారు. బీహార్ కేబినెట్‌లో క్రీడలు, ఆర్థికశాఖ, ఇంజాయితీరాజ్, పట్టణాభి వృద్ధి, హౌసింగ్ మంత్రిగా కూడా పనిచేసారు.

బీహార్ సీఎంగా నితీశ్‌కుమార్ రాజీనామా

జేడీయూ అధినేత నితీశ్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా తన పదవికి రాజీనామా చేశారు. ఈరోజు లోక్‌భవన్ చేరుకున్న ఆయన తన రాజీనామా పత్రాన్ని గవర్నర్‌కు అందజేశారు. నితీశ్ కుమార్ స్థానంలో ముఖ్యమంత్రిగా ఎవరు వస్తారనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రాజీనామాను సమర్పించడానికి ముందు ఆయన మంత్రివర్గ సమావేశాన్ని చివరిసారిగా ఏర్పాటు చేశారు. మంత్రివర్గాన్ని రద్దు చేస్తున్న విషయాన్ని కేబినెట్‌కు తెలియజేశారు. నితీశ్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా రెండు దశాబ్దాలు కొనసాగారు. ఇటీవల ఆయన రాజ్యసభ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. దీనితో ఆయన ఈరోజు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ముఖ్యమంత్రిగా పలువురు బీజేపీ నాయకుల పేర్లు వినిపిస్తున్నాయి. బీజేపీ నాయకుడు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలో తొలిసారి ఆ పార్టీ ఈ పదవిని చేపట్టినట్లవుతుంది. అయితే ఇప్పటి వరకు ఉపముఖ్యమంత్రిగా ఉన్న సామ్రాట్ చౌదరిని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎంపిక చేసారు.

వారం - వర్జ్యం

15-04-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, అశ్విని కార్తె
త్రయోదశి రా.10.26
పూర్వాభాద్ర మ.3.17
వర్జ్యం : రా.12.20-రా.1.50
దు. ఉ.11.42-మ.12.32
శుభసమయం: ఉ.8.30-9.30
రాహుకాలం - మ.12.00-1.30

వార్తాఫలం

మేషం: పురోభివృద్ధి మాత్రం నామమాత్రంగా సాధిస్తారు. సంతాన సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు.బంధువులకలయిక

వృషభం: జీవిత భాగస్వామితో స్పర్థలు, కలతలు రాకుండా మీరే జాగ్రత్త వహించవలసి ఉంటుంది.

మిథునం: కీలక వ్యవహారాలలో విజయాలు సాధిస్తారు. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు.

కర్కాటకం: సెల్ఫ్ డ్రైవింగ్ పట్ల అప్రమత్తత అవసరం. వృత్తి, వ్యాపారాలలో ఊహించని మార్పులు వుంటాయి. ఋణాలుతీరుతాయి.

సింహం: ఆర్థిక వ్యవహారాలలో ఆటుపోట్లు తప్పవు. వివాదాలకు దూరంగా వుండండి. స్పెక్యులేషన్‌కు దూరంగా వుండండి.

కన్య : మీ ఉన్నతిని చూసి ఓర్వలేనివారు అధికమవుతారు. విలాసాలకు అధికంగా ధనం ఖర్చుచేస్తారు. ఆరోగ్యం జాగ్రత్త.

తుల : ప్రేమ విషయంలో పురోగతి సాధిస్తారు. ప్రముఖుల నుండి ఆహ్వానాలు అందుతాయి. స్వల్ప ధనలాభం.

వృశ్చికం: గృహాలంకరణ సామాగ్రికి ఎక్కువగా ఖర్చు పెడతారు. ఆర్థిక వ్యవహారాలలో కొంత పురోగతి ఉంటుంది.

ధనుస్సు: దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు. అందరిలోనూ ప్రత్యేక గుర్తింపు పొందుతారు.వాహనసౌఖ్యం.

మకరం: గృహం కొనుగోలు యత్నాలు ఆలోచనలు గతంలోకన్నా పట్టుదలతో చేస్తారు. శుభకార్యాలలో పాల్గొంటారు.

కుంభం: నిర్లోహమాటంగా మాట్లాడి కొందరు వ్యక్తులను దూరం చేసుకుంటారు. విందు, వినోదాలకు దూరంగా వుండండి.

మీనం: అనేక విషయములను ఏక కాలములో పరిష్కరించవలసిన బాధ్యత ఏర్పడుతుంది. పాత ఋణాలు తీరుస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

తల్లిని బంధించి సజీవదహనం

>> తన పెద్ద కుమారుడు కిషోర్ బాబుతో కలిసి ఇటీవల గద్దలగుంట్లలో అద్దె ఇంటిలో నివసిస్తున్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు ఉండగా, చిన్న కుమారుడు చెన్నైలో ఉద్యోగం చేస్తుండగా, పెద్ద కుమారుడు కిషోర్ బాబు తల్లితోనే ఉంటూ మాంసం దుకాణం నిర్వహిస్తున్నాడు. అయితే కిషోర్ మద్యం అలవాటుకు బానిసై తరచూ తాగి వచ్చి తల్లితో గొడవ పడుతూ ఉండేవాడని స్థానికులు చెబుతున్నారు. కుటుంబంలో కొంతకాలంగా ఉద్రిక్తతలు కొనసాగుతున్నట్లు సమాచారం.మంగళవారం ఉదయం కూడా ఇదే తరహాలో తల్లికొడుకుల మధ్య వాగ్వా దం చెలరేగింది. కోపాన్ని అదుపులో పెట్టుకోలేక పోయిన కిషోర్, మద్యం మత్తులోనే అమాన వీయ నిర్ణయం తీసుకున్నాడు. తన తల్లిని ఇం ట్లోని ఒక గదిలో బంధించి తాళం వేసి బయ టకు వచ్చి, ఇంటి చుట్టూ పెట్రోల్ పోసి నిప్పం టించాడు. ఒక్కసారిగా మంటలు ఎగసిపడ టంతో ఇంటి మొత్తం అగ్నికి ఆహుతైంది.లోపల బంధించబడిన వెంకటరమణమ్మ బయటకు వచ్చే మార్గం లేక మంటల్లో చిక్కుకుని సజీవ దహనమైంది. ఆమె సహాయం కోసం అరిచిన ప్పటికీ ఎవరూ వెంటనే చేరుకోలేకపోయారని స్థానికులు చెబుతున్నారు. ఇది గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. వృద్ధురాలి శరీరం పూర్తిగా కాలిపోయి కొంత భాగం మాంసం ముద్దలా కొంత భాగం బూడిదగా మారింది. కేవలం కాలు, చెయ్యి వంటి అవశేషాలు మాత్రమే మిగిలినట్లు పోలీస్ అధికారులు తెలిపారు.సమాచారం అందుకున్న ఒంగోలు మొదటి పట్టణ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. నిందితుడైన కుమారుడు కిషోర్‌ను అదుపులోకి తీసుకుని కఠినంగా విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

బర్త్‌డే, పెళ్లి రోజున పోలీసులకు సెలవు

విజయవాడ,ఏప్రిల్ 14,ప్రభాతవార్తప్రతినిధి: ఏపీ పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవం రోజున ప్రత్యేక సెలవు మంజూరు చేయాలని డీజీపీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అన్ని జిల్లాల ఎస్పీలకు, పోలీస్ విభాగాల అధిపతులకు ఆదేశాలు పంపారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే తప్ప, సిబ్బంది కోరిన వెంటనే ఈ ప్రత్యేక సెలవును మంజూరు చేయాలని ఆయన స్పష్టంగా సూచించారు.

న్యూఢిల్లీకి ఎపి మహిళా ప్రజాప్రతినిధులు

విజయవాడ,ఏప్రిల్ 14,ప్రభాతవార్తప్రతినిధి: పార్లమెంట్‌లో మహిళ రిజర్వేషన్ బిల్లు కేంద్రం ప్రవేశ పెట్టనుంది.దాంతో ఆయా పార్టీలకు చెందిన మహిళా ప్రజాప్రతినిధులంతా ఢిల్లీ వేదికగా మద్దతు తెలపనున్నారు. అందుకోసం వారంతా ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. ఏప్రిల్16వ తేదీన ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశ పెట్టనున్నారు. దీంతో కూటమి మహిళ ప్రజాప్రతి నిధులంతా లోక్‌సభ గ్యాలరీలో కూర్చొనున్నారు.

15-4Pg3exHMNWJQE.qxd:15-4Pg3exHMNWJQE.qxd 15/04/26 11:11 PM Page 1

తిరుమల సమాచారం

టిటిడి ట్రస్ట్‌లకు రూ.37 లక్షలు విరాళం

తిరుమల, ఏప్రిల్ 14 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి ట్రస్ట్‌లకు దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. మంగళవారం కర్ణాటక రాష్ట్రం బెలగావికి చెందిన ప్రవీణ్ సోన్వాల్కర్ శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.17లక్షలు విరాళంగా అందించారు. సుభాష్ సోన్వాల్కర్ శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు 10 లక్షలు విరాళంగా అందించారు. దాతలు తిరుమలలో టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడుకు విరాళం డిడిలను అందజేశారు. బాలాజీ ఆరోగ్య వరప్రసాదినికి: టిటిడి ఆధ్వర్యంలోని బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి దాత విరాళమిచ్చాడు. పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడుకు చెందిన కొవ్వూరి రామ్‌దీప్ రెడ్డి బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి రూ.10,01,116 లక్షలు విరాళంగా అందించారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి విరాళం చెక్కును అందజేశారు.

శ్రీవారి ఆశీస్సులందరిపై ఉండాలి

తిరుమల, ఏప్రిల్ 14 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారి ఆశీస్సులు తెలుగురాష్ట్రాల ప్రజలకు కలగాలని, సుఖసంతోషాలతో ఉండాలని మాజీ సిఎస్ ఎల్‌వి సుబ్రమణ్యం ఆకాంక్షించారు. మంగళవారం ఉదయం సుబ్రమణ్యం దంపతులు విఐపి బ్రేక్‌లో తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. శ్రీవారి ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదం అందజేశారు.

ఎఐ, క్వాంటం రంగాల్లో దేశానికి హబ్‌గా అమరావతి

- కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ కార్యదర్శి అభయ్ కరాందికర్

విజయవాడ, ఏప్రిల్ 14 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని సందర్భంగా ఏపీలో క్వాంటం టెస్టింగ్ ఫెసిలిటీలు మొదలు కావటం క్వాంటం విప్లవంలో ఓ బలమైన సందేశమని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ కార్యదర్శి అభయ్ కరాందికర్ స్పష్టం చేశారు. ఐటీని అందిపుచ్చుకున్న సీఎం చంద్రబాబు ఇప్పుడు డీప్‌టెక్ రంగంలోనూ ముందడుగు వేశారని కొనియడారు. భవిష్యత్ టెక్నాలజీలను ప్రోత్సహించటం ద్వారా పెట్టుబడులు, ప్రగతిని వేగంగా సాధించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. భారత్ సాంకేతికంగా సార్వభౌమ దేశంగా, వికసిత్ భారత్‌గా మార్చటంలో ఇది కీలకమైన ముందడుగు అవుతుందని అన్నారు.

క్వాంటం ఉపకరణాలను దేశీయంగా తయారు చేయటంలో ఈ రిఫరెన్స్ ఫెసిలిటీలు ఎంతో కీలకమని గుర్తుచేశారు. క్వాంటం కంప్యూటర్ హార్డ్ వేర్ తయారీ, సర్టిఫికేషన్‌లో బెంచ్ మార్క్‌గా ఇది మారుతుందని తెలిపారు. ఉపకరణాలు ఒక్కటే కాదు క్వాంటం కంప్యూటింగ్ ద్వారా నూతన ఆవిష్కరణలు రావాల్సి ఉందని తెలిపారు. కమ్యూనికేషన్, ప్రెసిషన్ సెన్సింగ్, ఫైనాన్స్, డిజైన్లు, కొన్ని కీలకమైన రంగాల్లో క్వాంటం ద్వారా ఆవిష్కరణలు రావాలని పిలుపునిచ్చారు. ఈ క్వాంటం రంగంలో మానవ నైపుణ్యాలను కూడా పెంచుకునే దిశగా జాతీయ స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నామని అభయ్ కరాందికర్ స్పష్టం చేశారు. క్వాంటం నిపుణులను తయారు చేయటంలో ఏపీ ముందంజలో ఉందని చెప్పారు. నేషనల్ క్వాంటం మిషన్ ద్వారా ప్రైవేటు రంగంలో చేసే పరిశోధనకు ప్రత్యేక నిధిని కూడా కేటాయిస్తున్నట్లు వెల్లడించారు.

విజనరీ సీఎం చంద్రబాబు క్వాంటం రిఫరెన్స్ టెస్ట్ ఫెసిలిటీల ద్వారా క్వాంటం రంగంలో విప్లవాన్ని అందిపుచ్చుకున్నారని కేంద్ర శాస్త్ర సాంకేతిక సలహాదారు అజయ్ కుమార్ సూద్ స్పష్టం చేశారు. క్వాంటం టెక్నాలజీలో స్వయం సమృద్ధి సాధించటంలో ఇది కీలకమైన ముందడుగని తెలిపారు. అమరావతి ఏఐ, క్వాంటం రంగాల్లో దేశానికి హబ్ గా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ రంగంలో నిపుణులను కూడా సత్వరం సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఐటీ లాగే క్వాంటం రంగంలోనూ ప్రపంచానికి మన సత్తా చాటాలని అజయ్ కుమార్ సూద్ పిలుపునిచ్చారు. అమరావతి క్వాంటం వ్యాలీ ఏర్పాటు ద్వారా ఆంధ్రప్రదేశ్ ఓ కీలకమైన ముందడుగు వేసిందని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా మారిపోతున్న వివిధ సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని టెక్నాలజీ పరంగా మనం బలోపేతం కావాల్సి ఉందని అన్నారు.

క్వాంటం హార్డ్ వేర్ తయారీలో భాగంగా ఇవాళ ప్రారంభించుకున్న రిఫరెన్సు ఫెసిలిటీలు కీలకంగా మారతాయని వివరించారు. దేశీయంగా తయారు చేసుకున్న ఉపకరణాలు స్వయం సమృద్ధిని సాధించటంలో ప్రధాన పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ క్వాంటం ప్రయణాన్ని సాఫ్ట్ వేర్, హార్డ్ వేర్ డెవలప్‌మెంట్‌తో పాటు ఇతర ఆవిష్కరణలకూ విస్తరించాలని కోరుతున్నట్లు అజయ్ కుమార్ తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రికి రెండు కళ్లు

కోవూరు (నెల్లూరు), ఏప్రిల్ 14 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి పథంలో పయనింపచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. కోవూరులోని పెళ్లకూరు కాలనీలో 33 లక్షల నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్లు, డ్రైన్‌లను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను క్రమం తప్పకుండా నెరవేరుస్తూ ముఖ్యమంత్రి ముందుకు సాగుతున్నారన్నారు. నియోజకవర్గానికి మండల కేంద్రం అయిన కోవూరు పంచాయతీ పరిధిలో ఈ 22 నెలల పాలనలో 11 కోట్ల మేర అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందన్నారు. ప్రతి గడపకు సంక్షేమం, ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నా సూపర్ సిక్స్ లాంటి సంక్షేమ పథకాలను ఆపకుండా నిధులు అందిస్తున్న ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. అనంతరం కోవూరు మండలంలోని 10 పంచాయతీలకు సంబంధించి 33 చెత్త రిక్షాలను వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పంపిణీ చేశారు.

అలిపిరి టోల్ గేట్‌లో ప్రత్యేక కార్గో లేన్

విస్తరణకు టిటిడి నిర్ణయం

తిరుమల, ఏప్రిల్ 14 ప్రభాతవార్త ప్రతినిధి: దేశవిదేశాల నుండి శ్రీవారి దర్శనార్థం ఏడుకొండలకు వస్తున్న భక్తుల వాహనాలు, లగేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేసేందుకు తిరుపతి అలిపిరిలో టోల్‌గేట్ విస్తరణ చేయాలని టిటిడి నిర్ణయించింది. ఇందుకోసం ఇప్పటికే టిటిడి బోర్డు ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అధికారులు ప్రణాళికలు రూపొందించారు. అలిపిరి టోల్ గేట్‌ను విస్తరణ చేయాలని భావిస్తున్నారు. ఇక్కడ ప్రత్యేకంగా కార్గో లేన్‌లను అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపట్టనున్నారు.తిరుమలకు అవసరమైన పలు రకాల సరకు రవాణాను క్రమబద్ధీకరించేందుకు ప్రత్యేక కార్గో లేన్‌ను నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధంగా ఉంది. ఇందుకు అలిపిరి టోల్‌గేట్ భారీ ఆధునీకరణ కార్యక్రమానికి టిటిడి ఆమోదం తెలిపింది. త్వరలో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. కొండకు చేరుకునే వాహనాల రద్దీని తగ్గించడం, భద్రతను పటిష్టం చేయడం లక్ష్యంగా చేపట్టిన చర్యలో ఇదీ ఒక భాగంగా పేర్కొంటున్నారు. పునఃరూపకల్పన చేసే అలిపిరి చెక్ పోస్ట్‌లో 14 లేన్‌లు ఉంటాయని, వాటిలో మొదటి రెండు లేన్‌లు ప్రత్యేకంగా సరుకు రవాణా వాహనాల కోసం కేటాయించబడతాయి. మిగిలిన లేన్‌లు సాధారణ వాహనాల రాకపోకలకు ఉపయోగపడతాయి. తద్వారా యాత్రికులకు సులభమైన ప్రయాణం సాధ్యమవుతుంది. ప్రస్తుతం రోజుకు సగటున 10వేల వాహనాలను నిర్వహిస్తున్న అలిపిరి చెక్ పోస్ట్ వద్ద ఈ ఆధునీకరణ వలన వాహనాల రద్దీని నియంత్రించే వీలు కలుగుతుంది. ఇప్పటికే ఆమోదం పొందిన డిజైన్లు భవిష్యత్తులో మరో రెండు లేన్‌లను జోడించేందుకు కూడా వీలు కల్పిస్తున్నాయి. భూదేవి కాంప్లెక్స్ సమీపంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న కార్గో స్కానర్‌లను ఇప్పుడు అలిపిరికి తరలించి, కొత్త వ్యవస్థలో సరకు రవాణా తనిఖీలను ఏకీకృతం చేయనున్నారు. ప్రతిపాదిత కార్గో లేన్ ప్రస్తుత చెక్ పోస్ట్‌కు సుమారు 650 మీటర్ల ముందు ఉన్న వినాయక ఆలయం వరకు విస్తరిస్తుంది. కార్గో లేన్ పూర్తయిన తర్వాత చెక్ పోస్ట్ పూర్తి ఆధునీకరణ చేపట్టనున్నట్టుగా టిటిడి ఇంజనీరింగ్ అధికారుల సమాచారం. అప్‌గ్రేడ్‌లో భాగంగా అధునాతన స్క్రీనింగ్ పరికరాలను తెప్పిస్తున్నారు. వీటిలో డోర్‌ఫ్రేమ్డ్ మెటల్ డిటెక్టర్లు, వాహన స్కానర్లు, మానవ స్కానర్లు, లగేజీ స్కానర్లు ఉన్నాయి. ఇప్పటికే మూడు ప్రయోగాత్మకంగా అమర్చారు. ఈ నెలాఖరు నాటికి మరో మూడు డిఎఫ్ఎండిలు, రెండు అదనపు మెటల్ డిటెక్టర్లు అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నారు. మే నెల నాటికి లగేజీ స్కానర్లు రానున్నాయి. వాహనాల్లో కూర్చున్న యాత్రికులను తనిఖీ చేయడానికి వాహన స్కానర్లు, "గ్రీన్ స్కానర్ల" సరఫరా కోసం టిటిడి వెబ్‌సైట్‌లో టెండర్లను ఆహ్వానించింది.

కూటమి కన్ను తెరిస్తే జగన్ అండ్‌కోకు దిబిడి దిబిడే

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు (నెల్లూరు), ఏప్రిల్ 14 ప్రభాతవార్త: కూటమి కన్ను తెరిస్తే జగన్ అండ్ కోకు దబిడి దిబిడేనని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. రాజధాని మావిగన్ పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని ,మతిస్థిమితం లేని వ్యక్తి జగన్ అని మండిపడ్డారు. రాష్ట్రాన్ని డ్రగ్ కల్చర్‌తో బ్రస్టు పట్టించాడని, దుర్మార్గమైన వ్యక్తి అని మండిపడ్డారు. ఆత్మకూరులో మంత్రి ఆనం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ జువ్వలదిన్నెతో మత్స్యకార వర్గాలకు మంచి చేయాలని కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంటే అడ్డుకట్టు వేయాలని ప్రయత్నాలు చేస్తున్నాడన్నారు. జువ్వలదిన్నెలో మొత్తం 950 మీటర్లలో 150 మీటర్లు మాత్రమే సాగర్ డిఫెన్స్‌కు ప్రభుత్వం ఇస్తుందని, మిగతాది మత్స్యకారులకేనని స్పష్టం చేశారు. మీ ప్రభుత్వంలో ఉన్న ఎమ్మెల్యే సముద్ర తీర ప్రాంతాన్నంత లే అవుట్లు వేసి అమ్ముకుంటుంటే ప్రశించలేని వ్యక్తివి ఏ ముఖం పెట్టుకొని మళ్ళీ మత్స్యకారుల దగ్గరకు వస్తావని నిలదీశారు. మత్స్యకారుల కోసం జగన్ రావడం లేదని, కాంట్రాక్టర్లను బెదిరించి కమీషన్లు గుంజుకునేందుకు వస్తున్నాడన్నారు. రహదారులపై జగన్నాథ రథచక్రాలు తిరుగుతున్నాయని వాటి కిందపడి నువ్వు నీపార్టీ నాయకులు నలిగిపోతారని హెచ్చరించారు. మీ బెదిరింపులకు బిదిరే వారు ఎవరూ లేరని మీ ఊరిలో ఎంపిటిసిని గెలిపించుకోలేని దౌర్భాగ్య స్థితిలో నువ్వు ఉన్నావని గుర్తుచేసుకోవాలన్నారు. జగన్ జువ్వల దిన్నెకు వీరభద్రుడిగా వస్తానంటే ఒట్టి భద్రుడుగా మిగిలి పోతవన్నారు. జరుగుతున్న పనులు చెడగొట్టాలని చూడడం దుర్మార్గమని, ఐదేళ్ళు అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని నాశం చేశారని, తీర ప్రాంతానిన మీ ఎమ్మెల్యేలు లే అవుట్లు వేసి దోచుకున్నారని, నీవాళ్ళ దోపిడీని ఎందుకు అడ్డుకోలేదని, నువ్వు జువ్వల దిన్నెకి వస్తే ఎవరికీ భయం లేదని, సక్రమంగా తాము కన్ను తెరిస్తే ఎక్కడుంటారో తెలియదన్నారు. అభివృద్ధికి ఆటంకపరిస్తే జగన్నాధ రథచక్రాల కింద నలిగిపోతారు. విధ్వంసం చేయడానికేనా జువ్వలదిన్నె పర్యటన అని మంత్రి ప్రశ్నించారు.

తిరుపతిలో ఎస్పీ అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు

తిరుపతి, ఏప్రిల్ 14 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి ప్రశాంతతకు, ప్రజల భద్రతే లక్ష్యంగా అసాంఘిక కార్యకలాపాలపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకునే అర్ధరాత్రి వేళ రోడ్లపై ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు స్వయంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపేందుకు ప్రత్యేక దృష్టి సారించి, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలు రహదారులు మాత్రమే కాకుండా వాణిజ్య సముదాయాలు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాలు, గ్రామాలు, పట్టణాల్లో ఏకకాలంలో చేపట్టడం జరిగింది. పోలీస్ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ, తనదైన శైలిలో మార్గనిర్దేశం చేశారు.

వైసిపి ఉన్మాద రాజకీయాలు చేస్తోంది

మంత్రి పార్థసారధి మండిపాటు

విజయవాడ, ఏప్రిల్ 14 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత ఐదేళ్ల కాలం ప్రజాస్వామ్య చరిత్రలోనే ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోయింది. అధికార మదంతో విర్రవీగిన వైసిపి నేతలు, సామాన్యుల నుంచి ప్రతిపక్ష నేతల వరకు ఎవరినీ వదలకుండా వేధింపులకు గురిచేశారని మంత్రి పార్థసారథి మండిపడ్డారు. వైసిపి సాగించిన ఈ ఉన్మాద రాజకీయాలు చివరకు ఉగ్రవాదం కంటే ప్రమాదకరంగా మారాయని పౌర సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని పేర్కొన్నారు.

అమరావతిలో మీడియా సమావేశంలో మంత్రి పార్థసారథి మాట్లాడుతూ.. "గత ప్రభుత్వంలో చట్టాన్ని గౌరవించాల్సిన ప్రజాప్రతినిధులే చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని అరాచకాలు సృష్టించారు. ప్రతిపక్షాలపై భౌతిక దాడులు చేయడం, అక్రమ కేసులు బనాయించడం ద్వారా వారి గొంతు నొక్కారు. శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించడంతో రాష్ట్రంలో అశాంతి రాజ్యమేలింది. ప్రజల ఆస్తులను కబ్జా చేయడం, ప్రకృతి వనరులను దోచుకోవడమే పనిగా పెట్టుకున్న వైసిపి నేతలు, రాష్ట్రాన్ని అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారారు. రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తూ, ఆర్థికంగా రాష్ట్రాన్ని దివాలా తీయించారు. మహిళలపై అసభ్యకర పోస్టులు పెడుతూ పైశాచిక ఆనందం పొందారు. మహిళలపై దాడులు జరుగుతున్నా, ఫిర్యాదులు అందుతున్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం వారి బాధ్యతారాహిత్యానికి పరాకాష్ట. వైసిపి అరాచకాలను భరించలేక ప్రజలు విసిగిపోయి మార్పు కోరుకున్నారు. కూటమి ప్రభుత్వం, అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని ముందుకు నడిపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది" అని అన్నారు.

మొబిలైజేషన్ అడ్వాన్స్ పేరుతో కూటమి మోసాలు

మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

కర్నూలు అర్బన్ ఏప్రిల్ 14 ప్రభాతవార్త: కర్నూలులో నిర్వహించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విలేకరుల సమావేశంలో మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వైసిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి తో కలిసి మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలపై గత పది నెలలుగా రాష్ట్ర పాలన అస్తవ్యస్తంగా మారిందని ఆరోపించారు. ప్రజా సమస్యలను పట్టించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వైయస్ జగన్ అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేక కూటమి నేతలు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని అన్నారు. అమరావతిలో చదరపు అడుగుకు రూ.14,800 నిర్మాణ వ్యయం చూపడం దారుణమని పేర్కొన్నారు. హైదరాబాద్, బెంగళూరులో తక్కువ ఖర్చుతో నిర్మాణాలు జరుగుతున్నాయని, ఇక్కడ ఖర్చు ఎందుకు ఎక్కువగా ఉందని ప్రశ్నించారు. కేవలం ప్లానింగ్ కోసమే రూ. 400 కోట్లు ఖర్చు చేయడం అన్యాయమన్నారు. మొబిలైజేషన్ అడ్వాన్స్ పేరుతో పనులు చేయకుండానే కాంట్రాక్టర్లకు రూ.5,500 కోట్లు చెల్లించారని ఆరోపించారు. రాజధాని మౌలిక వసతులకు రూ.2 లక్షల కోట్లు అవసరమని, ఈ అప్పులు ఎలా తీర్చుతారని ప్రశ్నించారు. నారా చంద్రబాబు నాయుడు నిర్ణయాల వల్ల రాష్ట్రానికి రాజధాని లేకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. 'మావిగన్' ప్రతిపాదనపై దేశవ్యాప్తంగా సానుకూల చర్చ జరుగుతోందన్నారు. తక్కువ ఖర్చుతో రాజధాని సాధ్యమవుతుందని, మేధావులు ఈ ప్రతిపాదనను స్వాగతిస్తున్నారని చెప్పారు. మచిలీపట్నం-విజయవాడ-గుంటూరు ప్రాంతాలను కలిపితే తక్షణ రాజధాని సాధ్యమని అభిప్రాయపడ్డారు. అభివృద్ధి, పథకాలపై విమర్శలు గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పనులు నిలిచిపోయాయని విమర్శించారు. విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలు రూ.10 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.2,600 కోట్లు ఉండటంతో ఆస్పత్రులు రోగులను చేర్చుకోవడం లేదన్నారు. నాడునేడు పనులు నిలిచిపోయి స్కూళ్లు, ఆస్పత్రుల పరిస్థితి దయనీయంగా మారిందని వివరించారు. వ్యవసాయం, రైతుల పరిస్థితి పూర్తిగా దెబ్బతిందని ఆరోపించారు. ఉద్యోగుల హామీలపై విమర్శలు, ఉద్యోగులు మళ్లీ మోసపోయారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ సిఎం జగన్ పర్యటనకు సర్వం సిద్ధం

బిట్రగుంట (నెల్లూరు), ఏప్రిల్ 14 ప్రభాతవార్త: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె షిప్పింగ్ హార్బర్ సందర్శనకు ఈ నెల 15వ తేదీన మాజీ ముఖ్యమంత్రి రాష్ట్ర వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి పర్యటనకు సర్వం సిద్ధం చేసినట్లు వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి చెప్పారు. బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామంలో మంగళవారం వైఎస్ఆర్సిపి కేంద్ర పాలిటి బ్యూరో సభ్యులు మాజీ శాసనసభ్యులు కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, కావలి మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ ఇన్చార్జి రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, ఉదయగిరి మాజీ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రోగ్రాం కోఆర్డినేటర్ శాసన మండలి సభ్యులు తలశిల రఘురాం, పోలీస్ అధికారులతో కలిసి హెలిప్యాడ్ నిర్మాణం, సభా వేదికను పరిశీలించారు. అనంతరం కాకాని గోవర్ధన్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో మత్స్యకారుల ప్రయోజనాల కోసం జువ్వల దిన్నెలో 70 ఎకరాల్లో షిప్పింగ్ హార్బర్ నిర్మాణం 90 శాతం పైగా పనులు పూర్తి చేయడం జరిగిందని, దీనిని పూర్తి చేసి మళ్లీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మత్స్యకారులతో స్వయంగా దీని జగన్మోహన్ రెడ్డి ప్రారంభించాలని అనుకున్నారన్నారు. అయితే ఆ తదనంతరం ఎన్నికల కోడ్ రావడం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మిగిలిన 10 శాతం పనులు కూడా పూర్తి చేయకుండానే షిప్పింగ్ హార్బర్ కేటాయించిన 70 ఎకరాల భూముల్లో 29.5 ఎకరాలు సాగర్ డిఫెన్స్ కంపెనీకి కూటమి ప్రభుత్వం కట్టబెట్టిందన్నారు. మత్స్యకారులతో సంప్రదించకుండానే ప్రైవేటు కంపెనీకి హార్బర్ భూముల కేటాయించడాన్ని మత్స్యకారులు జీర్ణించుకోలేకపోతున్నారని ఆరోపించారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా అగ్నిమాపక సేవలు విస్తరించాలి

• ప్రజల సేవ పట్ల నిబద్ధతతే అగ్నిమాపక సిబ్బంది కీలక బాధ్యత

• అగ్నిమాపక వారోత్సవాల ప్రారంభోత్సవంలో డిజిపి హరీష్ గుప్తా

విజయవాడ, ఏప్రిల్ 14 ప్రభాతవార్త ప్రతినిధి: అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలకు తెగించి చేసే సాహసాలు నిత్యస్మరణీయమని డిజిపి హరీశ్ కుమార్ గుప్తా వ్యాఖ్యానించారు. విపత్కర పరిస్థితుల్లో క్షణం ఆలోచించకుండా విధి నిర్వహణల్లోకి దూసుకుని వెళ్ళే వారి తెగువ ప్రశంసనీయమన్నారు. రాష్ట్రంలో అగ్నిమాపక శాఖ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. విజయవాడలోని గవర్నర్‌పేటలో అగ్నిమాపక శాఖ హెడ్ క్వార్టర్స్‌లో వారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిజిపి హరీశ్ కుమార్ గుప్తా, ఫైర్ డిజి వెంకటరమణ పాల్గొన్నారు. అమరవీరుల స్మృతికి డిజిపి నివాళి అర్పించారు. అనంతరం జెండాను అవగతం చేశారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ ప్రమాదం సంభవించినప్పుడు ప్రతి ఒక్కరూ అక్కడి నుంచి పారిపోవాలని చూస్తారని, కానీ అగ్నిమాపక సిబ్బంది మాత్రమే లోపలికి వెళ్లి ప్రాణాలను కాపాడతారని అన్నారు. ఇది క్రమశిక్షణతో కూడిన ధైర్యం, నిరంతర శిక్షణ, ప్రజల సేవ పట్ల నిబద్ధత అని చెప్పుకొచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అగ్నిమాపక సేవలు విస్తరించాయన్నారు. పట్టణీకరణ, పారిశ్రామిక విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి కారణంగా ప్రమాదాల తీవ్రత పెరిగిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక శాఖ కేవలం ప్రమాదం జరిగినప్పుడు స్పందించే స్థాయి నుంచి డేటా, సాంకేతికత ఆధారంగా ముందుగానే అప్రమత్తమయ్యే దిశగా మారుతోందని వివరించారు. బాణసంచా పరిశ్రమలు, పారిశ్రామిక, రసాయన విపత్తులు వంటి అనేక సవాళ్లను చూస్తున్నామని డిజిపి తెలిపారు. భద్రతా నిబంధనలను కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాపార సంస్థలు, ప్రైవేట్ కార్యాలయాల నిర్వాహకులు బాధ్యతగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అందరూ కలిసి భద్రతా పరికరాలను ఏర్పాటు చేసుకుని, నిబంధనలను పాటించాలన్నారు. అగ్ని ప్రమాదాలను నివారించడం ఉమ్మడి బాధ్యతగా పేర్కొన్నారు. అగ్నిమాపక, పోలీస్, విపత్తు, ఆరోగ్య శాఖలన్నీ కలిసి ఒకే వ్యవస్థగా పనిచేయాలన్నారు. భవిష్యత్తులో అగ్నిమాపక భద్రతలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని డిజిపి హరీశ్ కుమార్ గుప్తా వెల్లడించారు.

ప్రజల్లో అవగాహన కల్పిస్తాం: అగ్నిమాపక శాఖ డిజి

ఏప్రిల్ 20 వరకు వారం రోజుల పాటు అగ్నిమాపక శాఖ వారోత్సవాలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు ఫైర్ డిజి వెంకటరమణ తెలిపారు. ఈ ఏడాది థీమ్ "సురక్షి త పాఠశాలలు, సురక్షి త ఆసుపత్రులు, అగ్నిమాపక భద్రతపై అవగాహన ఉన్న సమాజం, అగ్ని ప్రమాదాల నివారణకు కలిసి పనిచేస్తాయి" అని ప్రకటించారు. మార్చి 2025 నుంచి మార్చి 2026 వరకు సుమారు 13,000 ఫైర్ కాల్స్‌కు స్పందించినట్లు వెంకటరమణ వెల్లడించారు. మిచాంగ్ తుఫాను, భారీ వరదలు, బాణసంచా పేలుళ్లు, బస్సు ప్రమాదాల సమయంలో అగ్నిమాపక సిబ్బంది ధైర్యంగా సేవలు అందించారని చెప్పారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 1,230 ఆసుపత్రులు, పాఠశాలల్లో మాక్ డ్రిల్స్ నిర్వహించి ప్రజల్లో భద్రతా అవగాహన కల్పించినట్లు ఫైర్ డిజి వెంకటరమణ తెలిపారు.

డిప్యూటీ తహసీల్దార్లకు వివిధ అంశాలపై శిక్షణ

విజయవాడ, ఏప్రిల్ 14 ప్రభాతవార్త ప్రతినిధి: డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా డిప్యూటీ తహసీల్దార్లుగా నియమితులైన వారు వివిధ అంశాలకు సంబంధించి ప్రభుత్వ విభాగాల్లో శిక్షణ తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కలెక్టరేట్, జిల్లా సర్వే డైరెక్టర్ కార్యాలయాలతో పాటు గ్రామాలకు వెళ్లి విఆర్ఏ, విఆర్ఓల వద్ద నాలుగు వారాలు పనిచేయాలి. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయం, పోలీసు శిక్షణకు సంబంధించి సిఐ కార్యాలయం, పంచాయతీ కార్యదర్శి, ఎంపిడిఓ వద్ద శిక్షణ తీసుకోవాలి. జడ్‌పి సిఇఓ, జలవనరులు, సహకార, వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖలతో పాటు ఆరోగ్య కేంద్రం, ఎపిహెచ్ఆర్‌డిఐ, సిసిఎల్లో శిక్షణ పొందాలి. మొత్తం 61 వారాల పాటు వివిధ ప్రభుత్వ విభాగాల్లో శిక్షణను నిర్దేశిస్తూ సిఎస్, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు.

తమ పూర్వీకులందరూ సాధించిన ఘన విజయాలను గురించి గర్వపడనివారు, ముందు తరాలవారు తమని గుర్తించగల ఏకార్యాన్నీ సాధించలేరు.

న- మెకాలే

ఎండ ప్రచండం!

ఎండల తీవ్రతతో తెలుగు రాష్ట్రాలు నిప్పుల కొలిమిగా మారాయి. గత నెల రోజులుగా ఆయా ప్రాంతాల్లో విభిన్న వాతావరణం చోటు చేసుకుంది. కొన్నిచోట్ల అకాల వర్షాలు, పలుచోట్ల వడగళ్ల వర్షం, చూసాం. ఇప్పుడు ఉన్నట్టుండి వడగాడ్పులు చప్పుడు వింటున్నాం. భానుడి భగభగలతో జనం మిట్ట మధ్యాహ్నం బయటకు వెళ్ళ లేక ఉన్న చోటనే ఇంట్లోనో, కార్యాలయంలోనో ఉండిపోతున్నారు. తెలంగాణలో అన్ని జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. కొన్ని ప్రాంతాలకు ఎల్లో అలెర్ట్. తెలుగు రాష్ట్రాల నుంచి వస్తున్న సమాచారం వింటుంటే ఎండ వేడిమి నుండి తట్టుకోలేని పరిస్థితులు ఎదురౌతాయి. ఇప్పటికే రోడ్లు నిర్మానుష్యంగా ఉన్నాయి. ఏప్రిల్ 19 నుంచి మే 31 వరకు ప్రత్యేక వాతావరణం చూస్తామని ఈ కారణంగాకొన్ని కఠినమైన పరిస్థితులు ఎదురవుతాయని వాతావరణ శాఖ అలర్ట్ చేసింది.గ్యాస్ సిలిండర్లను ఎండలో ఉంచరాదు. ఎయిర్ కండిషనర్‌ల వినియోగం పేరిట విద్యుత్ వాడకాన్ని పెంచరాదని సూచన. పెంపుడు జంతువులను కూడా వడదెబ్బ నుండిరక్షణ కల్పించాల్సిన బాధ్యత మనదే. వడగాలులు సాధారణ రోజుల కన్నా ఎక్కువ ప్రభావం చూపుతాయి. ఆంధ్రప్రదేశ్‌లోని తీర ప్రాంతమైన కోస్తా జిల్లాల్లో వడగాలునపలుప్రభావం నుంచి బయటపడే ఆలోచన చేయాల్సి ఉంది. ఇప్పటికే మంగళశారం నాడు తెలుగు రాష్ట్రాలలో కనీసంఐదుగురు వడగాల్పులకు మృతి చెందినందున ముందు జాగ్రత్త చర్యగాప్రభుత్వ శాఖలు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆ రోజుల్లో ఉష్ణోగ్రత 45 డిగ్రీల నుండి 55 డిగ్రీల వరకు అత్యధిక వేడిమి ఉంటుందనే హెచ్చరికల నేపథ్యంలో డాక్టర్లు, శాస్త్రజ్ఞులు సైతం మానవ సహిత జీవజాలాన్ని, జంతు జాలాన్ని వేడివాతావరణంలో ఎలారక్షించు కోవాలో, సూచిస్తున్నారు. అధిక నీటిని తాగాలన్నది వారి సలహా. వృద్ధులను, పిల్లలను బయటికి రావద్దని ప్రభుత్వాలు హెచ్చరిక చేస్తున్నాయి.ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం3 గంటలకు ఎవరూ బయటకు వెళ్లకూడదని వాతావరణశాఖ హెచ్చరించింది. అతివేడిమి ఉన్న రోజుల్లో భూమి మీదనేరుగా 70శాతం అతి నీల లోహిత సూర్య కిరణాలు ప్రసరిస్తాయి. వీటి ఫలితంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడి,అకస్మాత్తుగా అస్వస్థతకు గురై వైద్య సహాయంకోసం పరుగులు పెట్టాల్సి వస్తుంది. ఉక్కపోత నుంచి ఉపశమనానికి గాలి చొరబడే గదుల్లో గాలి వచ్చేలా తలుపులు కిటికీలు తెరుచుకునేటట్లు ఉంచాలి. మొబైల్ ఫోన్లు పేలిపోవచ్చు. ద్విచక్రవాహనాలకు పెట్రోల్‌ను ట్యాంక్ ఫుల్ చేయవద్దని సూచిస్తున్నారు. ప్రయాణాలు వాయిదా వేసుకోవాలనే సూచనలు ఉన్నాయి. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉక్కపోత అధికంగా ఉంటుందని, గాలిలో తేమ శాతం తగ్గిపోవడం వల్ల వడ దెబ్బ తగిలే అవకాశం ఉంది.వారం రోజులు హీట్ ఇండెక్స్ ఎక్కువ గా ఉంటుంది. డీహైడ్రేషన్ సమస్యలు తలెత్తుతాయి. శ్రామిక జనంఎండవేడిమి లేని ప్రాంతాల్లో పనికి వెళ్ళాల ని వాతావరణ నిపుణులుహెచ్చరిస్తున్నారు, వేసవిలో ఎండ తీవ్రత 35డిగ్రీల సెల్సియస్‌దాటినప్పటి నుంచి సమస్యలు పెరుగుతాయి. వేసవి ఉష్ణోగ్రతలు 35డిగ్రీల నుంచి 40 డిగ్రీల వరకు ఉన్నప్పుడు బయట ఎక్కువసే పు తిరిగే వారిలో డీహైడ్రేషన్, తలనొప్పి, తల తిరగడం వంటి సమస్యలు తలెత్తే అవకాశాలు ఉంటాయి. ఎండల ధాటి 40-45 డిగ్రీలకు చేరుకుంటే, ప్రమాద స్థాయి మరింతగా పెరుగుతుంది.ఉష్ణోగ్రతలు ఈ స్థాయి కి చేరినప్పుడు బయట ఎక్కువసేపు ఉంటే త్వరగా అలసట, నీరసం ముంచుకొచ్చి, డీహైడ్రేషన్‌కు లోనవడం, వాంతులు, తలతిరగడం, వడదెబ్బకు లోనవడం వంటి ప్రమాదాలు తలెత్తవచ్చు.ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటినట్లయితే, వడదెబ్బ సోకే అవకాశాలు మరింత ఎక్కువగా ఉంటాయి. ఈ ఉష్ణోగ్రతలు ఒక్కోసారి ప్రాణాపాయానికి కూడా దారితీయవచ్చు. గడచిన పదేళ్లలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సగటు గరిష్ఠఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటే ఎక్కువగానే నమోదవుతున్నాయి. భారత వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్లో వేసవి సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40.5-42.5 డిగ్రీల వరకు తెలంగాణలో 41.5 నుంచి 43.5 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి.విజయవాడ, కర్నూలు,రామగుండం, భద్రాచలం వంటి కొన్ని ప్రాంతాల్లో వేసవి సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45-47డిగ్రీల వరకు కూడా నమోదవుతున్నాయి. అందువల్ల గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలను తాకినప్పటి నుంచి తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించడం మంచిది.ఎల్‌నినో కాస్త ముందే పలుకరించినా భూమధ్య రేఖ వెంబడి పసిఫిక్ మహా సముద్రం వేడెక్కుతుంది. చివరిసరిగా ఎల్‌నినో పరిస్థితులు 2023లో ఏర్పడ్డాయి. ఈ ఏడాదిరుతుపవనాల సమయంలో అత్యల్పవర్షపాతం నమోదవుతుందని వాతావరణశాఖ చెబుతోంది. ఇప్పుడు మీద పడనున్న ఎల్‌నినో ప్రభావంతో దేశంలో నీటి వనరులకు కొరత ఏర్పడుతుంది.దానికితోడు అత్యల్ప వర్షపాతం కూడా రేపటి వ్యవసాయ కార్యాచరణపై ప్రభావం చూపుతుంది. భారత్లోకి వచ్చే మొత్తం వర్షపాతం సుమారు 75 శాతం వస్తుంది.ఈసారి నైరుతి రుతుపవనాల ప్రభావం వ్యవసాయ దారులను ఇబ్బందులకు గురిచేసేటట్లుగా ఉండచ్చు. వర్షాధార ఖరీఫ్‌లో సాగు ఆయకట్టు బాగా తగ్గుతుంది నీటి వనరులు ఎండిపోవడం, సాగు అవసరాలు తీర్చే నీరు లభ్యత కాకపోతే సాగులో కొంత ఆయకట్టు తగ్గుతుంది.జూన్,జూలై నెలల్లో అతి తక్కువ వర్షపాతం వలన దేశంలోని అన్నిప్రాంతాలు నీటికరువుని ఎదుర్కుంటాయి.ఈఏడాది వర్షపాతం 94శాతంమాత్రమే ఉంటుంది. కొంత మేర కరువు పరిస్థితుల్ని చూడొచ్చు.

భుజం తడితే లాభం లేదు, పక్కనే నిలబడాలి. అదే నిజమైన ప్రశంస.

మహాత్మా గాంధీ

అందరిపట్లా మర్యాదగా వ్యవహరించండి. ఎక్కువ మందితో పరిచయం పెంచుకోండి. ఒక్కరిద్దరితో స్నేహంగా ఉండండి. ఎవరికీ శత్రువు కాకండి.



బెంజిమెన్ ఫ్రాంక్లిన్

ప్రజావాక్కు



సంయమనం పాటించాలి

నేడుదేశంలో హత్యలు,అత్యాచార సంఘటనల్లో బాధితులపై ఎక్కడ,ఎలా జరిగాయని మీడియాలో సవివరంగా వస్తున్నాయి. దర్యాప్తు చేసే పోలీసులకు తెలుపవలసిన వివరాలన్నీ టీవీ, పేపర్ చూసే సామాన్యులకు అవసరం లేదు. సెల్ ఫోన్లలో వచ్చే ఇలాంటి దారుణ సంఘటనల ప్రసారాలన్నీ కూడా ప్రభుత్వం నియంత్రించాలి. లేకపోతే సమాజంలో బాధితుల పరిస్థితి రచ్చకెక్కి పెనంపైనుండి పొయ్యిలో పడ్డట్టవుతుంది. మరోవైపు నిందితులకు వాళ్ల పరువు పోకుండా ముసుగువేస్తారు. టివీల్లో 24గంటల వార్తా ప్రసారాలవల్ల సమాజంలో సున్నితత్వం, సెంటిమెంట్స్ తగ్గి తాగుడు, డ్రగ్స్ వంటి వాటి మత్తులో సైకోల హింసోన్మాదం, ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. కనుక గతంలో వలె టీవీలు, పత్రికలు సంయమనం పాటించి మొదట జాతీయ వార్తలకి ప్రాముఖ్యత నిచ్చి ఇలాంటి పైశాచిక సంఘటనలని సమాజానికి క్లుప్తంగా తెలపాలి.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

ప్రకృతిని కాపాడుకుందాం

ఒక ప్రక్క అకాలవర్షాలు, వరదలు మరోప్రక్క అడవిలో మంటలు ఇవన్నీచూస్తుంటే,మనిషిమీద ప్రకృతి ప్రతిదాడి చేస్తోందనిపిస్తోంది. ఇంత జరుగుతున్నా ప్రజలకు చీమ కుట్టినట్లయినా లేదు. సుఖాలకు అలవాటు పడిన మనిషి చెట్లను నరుకుతున్నాడు. భూమాత గుండెల్లో గునపాలు నింపుతున్నాడు. దయాదాక్షిణ్యం లేకుండా జంతువులను చంపుతున్నాడు. తనస్వార్థంతో తన సుఖాన్నే వెతుక్కుంటున్నాడే తప్ప ప్రకృతి గురించి ఆలోచించడం మానేశాడు. పర్యావరణాన్ని పరిరక్షించాలంటే మానవుడు రాక్షసత్వాన్ని వీడి జీవరాశులన్నింటితో సహజీవనం చేయడం నేర్చుకోవాలి.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

ఫైనాన్స్ సంస్థల ఆగడాలు

రోజురోజుకు డబ్బుల ఎగవేత ఎక్కువ అవుతుంది. గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ఇవే గొడవలు. కూలి పనులను చేసుకొని పొదుపు చేసిన డబ్బులు అప్పుగా తీసుకోని తరువాత ఇవ్వడంలో ఇబ్బంది పెడుతున్నారు.అనుమతి లెని ఫైనాన్స్ సంస్థలు కొన్ని నడుస్తున్నాయి.వాటిని అనుమతి తీసుకోని నడిపించేలాప్రభుత్వం కొన్ని నిబంధనలు రూపొందిచడం అవసరం. గొడవలు లేకుండా,అమాయకులు మోసపోకుండా చూడాలి.

- రాపాక. రవీందర్, జనగాం

ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి

హైదరాబాదు మహానగరంలో పలు కాలనీలలో వారానికి ఒకసారి నిర్వహించే కూరగాయలసంతలలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడకం జరుగుతోంది.కూరగాయలు అమ్మేవారు కూరగాయలను ప్లాస్టిక్ సంచులలో వేసి ఇవ్వటం, కొనుగోలుదారులు కూడా ప్లాస్టిక్ సంచులలోనే వేసి ఇవ్వాలని అడగటం వల్ల ప్లాస్టిక్ వ్యర్థాల ప్రమాదం ఏర్పడుతోంది. చదువుకున్న వారు కూడా ఇలాంటి దుశ్చర్యలకు దిగటం అత్యంత విచారకరం. దేశనాగరీకులకు పర్యావరణం ఒక పట్టని విషయంగా ఉంది. ప్లాస్టిక్ సంచులవాడకంపై నిషేధంఉన్నా, అమలు విషయంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష ్యం కొట్టొచ్చినట్లు కనపడు తోంది. కూరగాయలను ప్లాస్టిక్ సంచులలో ఉంచి ఫ్రిజ్‌లలో నిల్వ చేయటం వల్ల ప్రమాదకర క్యాన్సర్‌భారీన పడే అవకా శం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నా, అనేకులకు చెవికి ఎక్కటం లేదు. పర్యావరణం పట్ల సరైన తీరు లేని ప్రజలకు తిక్క దించే అధికారగణం రావాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి,సికింద్రాబాద్

అమరావతి అభివృద్ధి కాంక్షకు చిహ్నం

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన (సవరణ) చట్టం2026కు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేయడం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక అపూర్వ ఘట్టం. ఏప్రిల్ 6, 2026న ఈ చారిత్రక బిల్లు చట్టంగా మారడంతో, అమరావతికి ఏకైక , శాశ్వత రాజధానిగా చట్టబద్ధమైన హోదా లభించింది. 2014 పునర్విభజన చట్టంలోని సెక్షన్ 5(2)కు చేసిన ఈ సవరణ ద్వారా,"కొత్త రాజధానిఉంటుంది' అనే పాతనిబంధన స్థానంలో "అమరావతియే ఆంధ్రప్రదేశ్ రాజధాని' అనే స్పష్టత వచ్చింది.ఈ విజయం ఐదు కోట్ల ఆంధ్రుల కలల సాకారంగా నిలుస్తుంది.ముఖ్యంగా అమరావతికోసం భూములిచ్చిన రైతుల త్యాగాలకు వారి సుదీర్ఘ పోరాటానికి ఇది దక్కిన గౌరవం. పార్లమెంటు ఉభయ సభలు గత వారం ఈ బిల్లును ఆమోదించగా, దశాబ్దకాలంగా కొనసాగుతున్న సందిగ్ధతకు శాశ్వత ముగింపు పడింది

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

జీవరాశులను పరిరక్షిద్దాం

ప్రస్తుత వేసవికాల దృష్ట్యా మనతో పాటు ప్రకృతి వనంలో భాగమైన జీవరాశులకు ఎక్కడ చూసినా ఎండిపోయిన చెరువులు కుంటలు దర్శనమిస్తుండడంతో సరైన నీరు,ఆహారం లభించక సమస్త జీవరాశులు నేలరాలుతున్నాయి. కాబట్టి అవకాశం ఉన్న చోట నీరు, ఆహారం కల్పించి జీవరాశులను కాపాడే ప్రయత్నం చేద్దాం.

-ఎం.శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

పేదరిక నిర్మూలన సామాజిక బాధ్యత

గత దశాబ్దంలో పది లక్షలమంది ప్రజలు పేదరికం నుండి బయటపడినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. వివిధ అంచనాల ప్రకారం దాదాపు 24.8 కోట్ల మంది వ్యక్తులు పేదరికం నుంచి బయటపడ్డారు. భారతదేశంలో కొన్ని క్లిష్టమైన సవాళ్లు మిగిలి ఉన్నాయి. అనధికారిక కార్మికులు, పట్టణ పేదలు, వలసదారులు, మహిళలలో సామాజిక రక్షణ కవరేజ్ అంతరాలు కొనసాగుతున్నాయి. వీరిలో చాలా మందికి పోర్టబిలిటీ, ప్రయోజనాల గురించి అవగాహన లేదు.ప్రపంచ ప్రమాణాలతో పోలిస్తే భారతదేశంలో సామా జిక రక్షణ వ్యయం చాలా తక్కువగా ఉంది. ప్రయోజనాల సమర్ధతను పరిమితం చేస్తుంది. ప్రభుత్వాలు దీర్ఘకాలిక సామాజిక భద్రత కంటే స్వల్పకాలిక ఉపశమనంపై తర చుగా దృష్టి సారిస్తున్నాయి. సామాజిక రక్షణపై పూర్తిగా సాకారం చేసుకోవడానికి, భారతదేశం సమానత్వం, సమర్ధత, స్థిరత్వాన్ని నిర్ధారించే సార్వత్రిక, హక్కుల ఆధారిత, సమగ్ర వ్యవస్థల వైపు పయనించాలి.

డా. సునీల్ కుమార్ పోతన

సార్వత్రిక ప్రాప్యత, బలహీన వర్గాల ఉత్పాదక వృద్ధిని ప్రాథమిక సామాజిక భద్రతకు సూచికగా చెప్పవచ్చు. భారతదేశంలో కేంద్ర, రాష్ట్ర పథకాలు, చట్టబద్ధమైన నిబంధనలు, సంక్షేమ కార్యక్రమాల మిశ్రమంగా సామాజిక రక్షణ పనిచేస్తుంది.ఆర్థిక అంతరాలు లేకుండా సామాజిక రక్షణలో సామాజిక భద్రత, పెన్షన్లు, ఆరోగ్య బీమా,నిరుద్యోగ ప్రయోజనాలు, వైకల్య మద్దతు, ప్రసూతి ప్రయోజనాలను కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు అందించాలి. ఐక్య రాజ్యసమితి ఆమోదించిన 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో పేదరిక నిర్మూలనలో అందరికి సామాజిక రక్షణ కల్పించాలి. సామాజిక రక్షణ వ్యవస్థలు, చర్యలను అమలు చేయాలని అన్ని సభ్య దేశాలకు 2015లో ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చింది. ఆదాయ మద్దతు కార్యక్రమాలు చేపట్టి దుర్బలత్వం, అసమానత, పేదరికాన్ని 2030 నాటికీ తగ్గించాలి. వ్యక్తులు, కుటుంబాల జీవిత చక్రంలో పేదరికం, దుర్బలత్వం,అభద్రతను తగ్గించడానికి సామాజిక రక్షణవిధానాలు, కార్యక్రమాలను ప్రభుత్వాలు చేపడుతాయి. ఆదాయభద్రత, ఆరోగ్యసంరక్షణ, ఉపాధి మద్దతు,వృద్ధాప్య పెన్షన్లు, వైకల్య ప్రయోజనాలు, ఆర్థిక రుణభారాల నుండి ప్రజలనురక్షించే, వారి శ్రేయస్సుకు మద్దతుగా సామాజిక రక్షణ అవసరం. ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డిజి), అంతర్జాతీయ కార్మిక సంస్థ సిఫార్సులకు అనుగుణంగా సామాజిక రక్షణ విధానాలను సభ్య దేశాలు అవలంబిస్తాయి. గడిచిన దశాబ్దంలో భారతదేశం సామాజిక రక్షణ కవరేజీలో గణనీయమైన విస్తరణను నమోదు చేసింది. అంతర్జాతీయ కార్మిక సంస్థ గుర్తించిన అధికారిక డేటా ప్రకారం భారతదేశంలో సామాజిక రక్షణ కవరేజ్ 2015లో జనాభాలో దాదాపు 19 శాతం ఉంది. అది 2025లో 64.3 శాతానికి పెరిగింది. దీని ఫలితంగా 2025నాటికి 94కోట్ల మంది ప్రజలు చట్టబద్ధంగా కనీసం ఒక సామాజిక రక్షణ ప్రయోజనాన్ని పొందుతున్నారు. పదేళ్లలో కవరేజ్‌లో ఈ 45 శాతం పాయింట్ల పెరుగుదల ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగవంతమైన విస్తరణలలో ఒకటిగా పరిగణించవచ్చు.లబ్ధిదారుల సంఖ్య పరంగా ప్రపంచంలో రెండవస్థానంలో భారతదేశం ఉంది. ఆదాయ స్థాయిలు, అధికారిక, అనధికారిక రంగాలు, గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పౌరులకు నగదు, వస్తువు ప్రయోజనాలను అందించడానికి ప్రభుత్వం చేసిన సమిష్టి ప్రయత్నాన్ని ఈ విస్తరణ ప్రతిబింబిస్తుంది. ఆధార్ ఆధారిత గుర్తింపును ఉపయోగించి అంతర్జాతీయ కార్మిక సంస్థ సహకారంతో జాతీయ సామాజిక రక్షణ డేటా విశ్లేషణ నిర్వహించారు. 34ప్రధాన కేంద్ర పథకాల రికార్డులను సమగ్రపరచి వివరాలను వెల్లడించారు. ఈ విశ్లేషణ ప్రకారం 2024 నాటికి జనాభాలో దాదాపు 65 శాతం అంటే దాదాపు 92కోట్ల మంది ప్రజలు కనీసం ఒక సామా

జిక రక్షణ ప్రయోజనం కిందకు వచ్చారు. ఆహారం, గృహ సహాయం వంటి నగదు, వస్తుపరమైన ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకున్నప్పుడు, కవరేజ్ 2021లో దాదాపు 24.4 శాతం ఉండగా 2024లో 48.8 శాతానికి రెట్టింపు అయింది.భారతదేశంలో బహుళ జనాభా, సామాజిక ఆర్థిక సమూహాలను లక్ష్యంగా సామాజిక రక్షణ నిర్మాణం చేపట్టారు. అనేక ప్రధాన పథకాలను ప్రభుత్వాలు అందిస్తున్నాయి. అతి తక్కువ ప్రీమియంతో పెన్షన్, బీమా చొరవలలో 'ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన' ప్రమాద బీమాను అందిస్తోంది.2025 మధ్యనాటికి 51 కోట్లకు పైగా నమోదయ్యారు. 'ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన', జీవిత బీమా పథకం, దాదాపు 23.64 కోట్ల వ్యక్తులను కవర్ చేస్తుంది. ప్రధాన మంత్రి శ్రమ యోగి మాన్ ధన్ అనధికారిక కార్మికులను లక్ష్యంగా చేసుకుని పెన్షన్ పథకం, అసంఘటిత రంగ కార్మికులకు 'అటల్ పెన్షన్ యోజన' ఆర్థిక భద్రతను అందిస్తోంది. లక్షలాది మంది చందాదారులను, గణనీయమైన పెన్షన్ కార్పస్ సేకరణలను కలిగి ఉంది. ఆర్థిక బీమాతో పాటు, భారతదేశంలో సామాజిక రక్షణ ఉపాధి, జీవనోపాధి మద్దతు లభిస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద గ్రామీణ కుటుంబాలకు ఏడాదికి కనీసం 125 రోజుల వేతన ఉపాధిని అందిస్తోంది. 'ఇ శ్రమ్ పోర్టల్‌లో 30 కోట్లకు పైగా అసంఘటిత కార్మికులు చేరారు. ఇది వివిధ సంక్షేమ పథకాలను ఏకీకృతం చేస్తోంది. సామాజిక రక్షణలో 'ప్రజా పంపిణీ వ్యవస్థ', 'ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన' వంటి విస్తృత సంక్షేమ జోక్యాలు కూడా ఉన్నాయి. ఈ పథకాల ద్వారా లక్షలాది మందికి సబ్సిడీ లేదా ఉచిత ఆహార ధాన్యాలను అందిస్తున్నారు. 'ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన' వంటి చొరవలతో ఆరోగ్య భద్రత బలోపేతం అవుతుంది. ఇది అర్హత కలిగిన కుటుంబాలకు గణనీయమైన ఆరోగ్య కవరేజీని అందిస్తుంది. నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను మెరుగుపరుస్తుంది. భారతదేశంలో బహుళకోణ పేదరికం, దుర్బలత్వాన్ని తగ్గించడంలో సామాజిక రక్షణ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. గత దశాబ్దంలో పది లక్షలమంది ప్రజలు పేదరికం నుండి బయటపడినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. వివిధ అంచనాల ప్రకారం దాదాపు 24.8 కోట్ల మంది వ్యక్తులు పేదరికం నుంచి బయటపడ్డారు. భారతదేశంలో కొన్ని క్లిష్టమైన సవాళ్లు మిగిలి ఉన్నాయి. అనధికారిక కార్మికులు, పట్టణ పేదలు, వలసదారులు, మహిళలలో సామాజిక రక్షణ కవరేజ్ అంతరాలు కొనసాగుతున్నాయి. వీరిలో చాలా మందికి పోర్టబిలిటీ, ప్రయోజనాల గురించి అవగాహన లేదు.ప్రపంచ ప్రమాణాలతో పోలిస్తే భారతదేశంలో సామాజిక రక్షణ వ్యయం చాలా తక్కువగా ఉంది. ప్రయోజనాల సమర్ధతను పరిమితం చేస్తుంది. ప్రభుత్వాలు దీర్ఘకాలిక సామాజిక భద్రత కంటే స్వల్పకాలిక ఉపశమనంపై తరచుగా దృష్టి సారిస్తున్నాయి. సామాజిక రక్షణపై పూర్తిగా సాకారం చేసుకోవడానికి, భారతదేశం సమానత్వం, సమర్ధత, స్థిరత్వాన్ని నిర్ధారించే సార్వత్రిక, హక్కుల ఆధారిత, సమగ్ర వ్యవస్థల వైపు పయనించాలి.

చిన్నారుల భద్రత అందరి కర్తవ్యం

మేకిరి దామోదర్

కన్నతల్లి పొత్తిళ్లలో ఆడుతూ పాడుతూ పెరగాల్సిన చిన్నారులను కొందరు దుర్మార్గులు అంగడి సరుకుల్లా మార్చుతున్న దారుణ పరిస్థితి సమాజాన్ని కలచివేస్తోంది. చిన్నారి నవ్వులో కనిపించాల్సిన నిర్దోషిత్వం, వారి కళ్లలో మెరవాల్సిన భవిష్యత్తు ఆశలు ఇవన్నీ కొందరి క్రూర వ్యాపారాలకు బలి పశువులవుతున్నాయి. పేదరికం, అజ్ఞానం, నిరాశ్రయస్థితులను ఆసరాగా చేసుకుని కొన్ని ముఠాలు చిన్నారుల అక్రమ రవాణా అనే ఘోర నేరాన్ని కొనసాగిస్తున్నాయి. నిరుపేద కుటుంబాలకు తక్కువ మొత్తంలో డబ్బు ఇచ్చి పిల్లలను కొనుగోలు చేయడం, అమాయక పిల్లలను అపహరించడం వంటి ఘటనలు పెరుగుతుండటం మన సమాజానికి పెద్ద హెచ్చరికగా మారింది. ఇటీవలి గణాంకాలు చిన్నారుల అదృశ్యాల పెరుగుదలను స్పష్టంగా చూపిస్తున్నాయి. రోజుకు వందల సంఖ్యలో పిల్లలు కనిపించకుండా పోవడం, ప్రతి ఎనిమిది నిమిషాలకు ఒక చిన్నారి అదృశ్యమవుతున్నట్లు అంచనాలు ఉండటం పరిస్థితి ఎంత భయానకమో తెలియజేస్తోంది. ఈ సంఖ్యల వెనుక ప్రతి తల్లి కన్నీరు, ప్రతి కుటుంబం బాధ దాగి ఉంది. ఒక చిన్నారి కనిపించకపోవడం అంటే కేవలం ఒక కేసు నమోదు కాదు ఒక కుటుంబానికి జీవి తాంతం మానని గాయం. జనసాంద్రత ఎక్కువగా ఉన్న బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఆసుపత్రులు, మురికి వాడలు ఈ ముఠాలకు వేట స్థలాలుగా మారుతున్నాయి. పర్యవేక్ష ణ లోపాలు, భద్రతా లోపాలు వీరికి అవకాశాలుగా మారు తున్నాయి. అమాయకత్వమే ఈ చిన్నారుల బలహీనతగా మారుతోంది. తెలియని వ్యక్తుల మాటలకు లోనై ప్రమా దంలో పడుతున్నారు. డిజిటల్ యుగంలో కూడా సోషల్ మీడియా, ఆన్లైన్ గేమ్స్ వంటి వేదికలు కొందరు దుర్వినియోగం చేస్తుండటం మరో ఆందోళనకర అంశం. అపహ రించిన చిన్నారులను భిక్షాటనకు దింపడం, బలవంతపు కార్మికులుగా మార్చడం, అక్రమ కార్యకలాపాలకు వినియో గించడం వంటి అమానవీయ చర్యలు జరుగుతున్నాయి. కొందరు బాలికలను వ్యభిచారంలోకి నెట్టివేస్తుండగా, మరి కొన్ని సంఘటనల్లో అవయవాల అక్రమ వ్యాపారం వంటి హీనకృత్యాలు వెలుగులోకి వస్తున్నాయి. చిన్నారి శరీరం, భావాలు, భవిష్యత్తు ఏదీ ఈ ముఠాలకు విలువ కాదు. లాభమే వారి లక్ష ్యం. పోలీసులు కొన్ని ముఠాలను పట్టు కోవడం కొంత ఊరటనిచ్చినప్పటికీ, సమస్య మూలాలను పూర్తిగా

నిర్మూలించడంలో ఇంకా లోపాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఒకే ముఠా కొద్ది సంవత్సరాల్లో డజన్ల సంఖ్యలో పిల్లలను విక్రయించడం వంటి ఘటనలు బయ టపడటం పరిస్థితి తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తోంది. విచారణలో ఆలస్యం, న్యాయ ప్రక్రియలో నత్తనడక, బాధి తులకు సరైన పునరావాసం లేకపోవడం వంటి సమస్యలు ఇంకా ఉన్నాయి. దత్తత ప్రక్రియలో ఉన్న ఆలస్యాలు, క్లిష్టతలు కూడా ఈ అక్రమ వ్యవస్థకు బలాన్నిస్తున్నాయి. చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలనుకునే దంపతులు సంవ త్సరాల పాటు వేచి చూడాల్సి రావడం వల్ల కొందరు అక్రమ మార్గాల వైపు మళ్లే పరిస్థితి ఏర్పడుతోంది. ఇది ఒక సామాజికపాలనా వైఫల్యానికి సంకేతం. అందుకే పారదర్శకమైన, వేగవంతమైన, సులభమైన దత్తత విధా నం అత్యవసరం గా మారింది. ఈ నేపథ్యంలో చట్టాల కఠిన అమలు, వేగవంతమైన న్యాయ ప్రక్రియ, అంత రాష్ట్ర సమన్వయ ం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ద్వారా ఈ నేరాలను అరికట్టాల్సిన అవసరం ఉంది. సీసీటీవీలు, ట్రాకింగ్ వ్యవస్థలు, డేటాబేస్‌లు సమ ర్థంగా ఉపయోగపడాలి. పిల్లల అక్రమ రవాణా సమస్యను నిర్మూలించాలంటే కేవలం చట్టాలు సరిపోవు సమగ్ర దృష్టి అవసరం. పేదరి క నిర్మూలన, ఉపాధి అవకాశాల పెంపు, విద్యా ప్రాచుర్య ం వంటి మూల కారణాలను పరిష్కరించా ల్సిందే.కుటుంబాలు ఆర్థికంగా బలపడితే పిల్లలను అమ్ము కోవాల్సిన పరిస్థితులు తగ్గుతాయి. ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలుచేస్తూ,పిల్లల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రతి గ్రామంలో, ప్రతి పట్టణంలో బాలల రక్షణ కమిటీలు చురుకుగా పనిచేయాలి. పాఠశాలలు పిల్లలకు సురక్షిత ప్రవర్తన గురించి అవగాహన కల్పిం చాలి. ప్రజల్లో అవగాహన పెంపు కూడా కీలకం. అనుమా నాస్పద కార్యకలాపాలను వెంటనే అధికారులకు తెలియజే యడం, పిల్లలపై తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవడం అవసరం.పిల్లల కదలికలపై పర్యవేక్షణ, అత్యవసర సంప్ర దింపు వివరాలు వారికి నేర్పించడం వంటి చిన్న చర్యలే పెద్ద రక్షణగా మారవచ్చు. స్వచ్ఛంద సంస్థలు, మీడియా, సామాజిక కార్యకర్తలు కలిసిపిల్లల రక్షణపై చైతన్యం కల్పించాలి. బాధిత పిల్లలకు పునరావాసం, మానసిక బలపరిచే సేవలు అందించడం కూడా అంతే ముఖ్యం.ప్రపంచంలోని కొన్ని దేశాలు అమలు చేస్తున్న కఠిన విధానాలను ఆదర్శంగా తీసుకుని, మన దేశంలో కూడా దృఢమైన చర్యలు చేపట్టాల్సిన సమయం వచ్చింది. పిల్లల రక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత కాదు ప్రతి పౌరుడి కర్తవ్యమే.మన చుట్టూ ఉన్న ప్రతి చిన్నారి పరిరక్షణ కూడా మన బాధ్యత అనే భావన పెంపొందాలి.మనం చూసి కూడా చూడనట్టు ఉంటే, వినీ విననట్టు ఉంటే అది ముమ్మాటికి సమాజపు వైఫల్యమే. రేపటి భద్రత, నేటి స్పందనపై ఆధారపడి ఉంది.మన ఉమ్మడి స్పందనే వారి రక్షణగా మారాలి.

చంద్రగోళం సరే.. మరి భూగోళం పరిస్థితి ఏమిటి?

దాడిశెట్టి శ్యామ్ కుమార్

భారతదేశంతో పాటు రష్యా, చైనా, అమెరికా, జపాన్ లాంటి దేశాలు చంద్రమండలం గురించి ప్రయోగా త్మక పరిశోధనలు చేస్తూనే ఉన్నాయి. ఇటీవల అమెరికాకు చెందిన నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా)మానవ సహిత మిషన్ ఆర్టెమిస్ టూలో భాగంగా చంద్రుడి ఉపరితలం దగ్గరగా వెళ్ళిన వ్యోమగాములు తిరిగి భూమి చేరుకోవడంతో రాబోవు కాలంలో చంద్రమండలం మీద మానవ నివాస నిర్మాణాల విషయమై ఏమైనా అవకాశాలు ఉంటాయా అనే విషయమై విస్తృతంగా పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉంటుందని శాస్త్రవేత్తల నుండి భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. పందొమ్మిది వందల అరవై తొమ్మిది జూలై ఇరవై రోజున అపోలో మిషన్ టూ ద్వారా అమెరికా వ్యోమగాములు చంద్రమండలం మీద అడుగుపెట్టిన తర్వాత చాలా సంవత్సరాల అనంతరం ఆర్టెమిస్ టూ మిషన్ ద్వారా నలుగురు వ్యోమగాములు చంద్రమండలం దగ్గరగా పరిభ్రమణం చేసి రావడంతో అంతరిక్ష పరిజ్ఞానం ప్రయోగాలు మరింత ఆసక్తిని పెంచాయి. మొట్టమొదట చంద్రమండలం మీద అడుగు పెట్టిన మానవుడు చంద్రుని గురించి పరిశోధనలు గావించి శోధించి సాధించింది ఏమున్నా కానీ, భారతదేశం చంద్రయాన్ మిషిన్ పేరిట అతి తక్కువ ఖర్చుతో చంద్రమండలం మీదికి పంపిన కృత్రిమ ఉపగ్రహాలు మాత్రం అంతకంటే ఎక్కువగా దక్షిణ ధృవం మీద పరిశోధనలు చేయడమే కాకుండా చంద్రమండలం మీద మంచు రూపంలో నీటి జాడలను గుర్తించినట్టు, అదేవిధంగా సల్ఫర్ ఇనుము ఆక్సిజన్ మెగ్నీషియం సిలికాన్ అల్యూమినియం లాంటి ఖనిజ మూల కాలు చంద్రమండలం మీద కూడా ఉన్నట్లు భారత అంత రిక్ష పరిశోధన సంస్థ ఇస్రో నిర్ధారించుకున్నట్టు చెపుతారు. చంద్రమండల యాత్రలో గతంలో వివిధ దేశాలు కనుగొన్న విశేషాల కంటే భారతదేశ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మానవ రహిత ఉపగ్రహాలను చంద్రమండలం మీదికి పంపి అక్కడ ఉన్నటువంటి అత్యంత విలువైన సమాచారాన్ని ప్రపంచానికి అందించింది.భూమి పుట్టినప్పుడే చందమామ కూడా పుట్టి ఉంటుంది. కాబట్టి పైగా భూమికి ఏకైక సహజ ఉపగ్రహం చందమామ. కాబట్టి చంద్రమండలం మీద చేసిన పరిశోధనలు భూమండలంలో ఉన్న ఖనిజ లవణాలు కూడా చంద్రమండలం మీద పుష్కలంగా ఉండి ఉండవచ్చు అనే భిన్న అభిప్రాయాలు శాస్త్రవేత్తల్లో లేకపో లేదు. అయితే చంద్ర మండలంలో వాతావరణం లేక నిర్మా నుష్యంగా ఎందుకు అయిందో నిర్ధారిత కారణాలు ఇంకా తెలుసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఒకవేళ భూమం దలంలో మానవుడు ప్రకృతితో చేసే పర్యావరణానికి హాని కలిగించే వికృత కార్యకలాపాలను నియంత్రించుకోలేకపోతే రాబోవు కాలంలో భూమండలం కూడా మానవుని ఉనికిలేని గ్రహంగా మారే అవకాశం లేకపోలేదు అనే వాదనలు వినిపిస్తున్నాయి.భూమండలంలో అలాంటి పరిస్థితులు తలెత్తకుండా పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రపంచంలో ప్రతి ఒక్కరిపై ఉంటుందని. భారత పురాణ ఇతిహాసాల్లో చందమామ గురించిన ప్రస్తావన ఉంది. కవులు రచయితలు చందమామను వర్ణించిన సందర్భాలు చందమామ వెన్నెల రాత్రులు చాలా వర్ణనాతీతంగా ఉంటాయని పురాణ కథలు చెపుతూ ఉంటాయి. ఇలాంటి చందమామ అందరిదైనప్పుడు కొందరికే అందుకోవడానికి సాధ్యమవుతుందా అనే సందే హం కలగకమానదు.చందమామను అందుకోవడంలో భారత దేశం కూడా ఉండడం విశేషం. భారతదేశం అంతరిక్ష పరి శోధన కేంద్రం ఇస్రో గగన్‌యాన్ మిషన్ పేరిట అంతరి క్షంలో పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి సన్నా హాలు చేస్తూనే రాబోవు కాలంలో చంద్రమండలం మీదికి ప్రత్యక్షంగా మానవుని పంపి అక్కడ పరిస్థితులను ఉనికిని అధ్యయనం చేయడానికి ప్రయత్నిస్తుంది అంటే భారతదేశం లో అగ్రరాజ్యాల కన్నా కూడా మరింత వేగవంతంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ అంతరిక్ష ప్రయోగాలను నిర్వహి స్తూ ప్రపంచానికి అంతరిక్ష పరిజ్ఞానంలో ఆదర్శవంతమైన దిశగా పురోగామిస్తుందని చెప్పవచ్చు. భూమండలం చుట్టూ ఉన్న పరిసరాల పట్ల ఆధునికత సంతరించుకుంటున్న మానవుని మితిమీరిన దైనందిన కార్యకలాపాలతో విడుదల వుతున్న వ్యర్థ పదార్థాలు ఇంధనాల మండలం వల్ల వచ్చే విషపూరిత వాయువులు ఇలాంటి అనేకమైన హానికరమైన రసాయనాలు మోతాదు నుంచి వాతావరణంలో కలుస్తూ ప్రకృతి పర్యావరణానికి నష్టం కలిగించే విధంగా ఉంటూనే ఉన్నాయి. ముందు వీటిని నియంత్రించే విధంగా మానవాళి ప్రయత్నం చేస్తూ భూమండలాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఉంది. మానవ మేధస్సు భూమండలంలో ఇంకా తెలుసుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉన్నప్పటికీ, వాటి మీద మరింతగా ఆసక్తి చూపించవలసిన అవసరం ఉంది. కానీ అనంత దూరంలో ఉన్న చంద్రమండలంవైపు దృష్టి సారి స్తున్న చంద్రమండలంలో అక్కడ ఏదో సాధిద్దాం అనుకుం టున్న మానవ మేధస్సుకు భూమండలం తప్ప వేరే ఇతర గ్రహాలు ఉపగ్రహాలు మానవ నివాసయోగ్యంగా ఉండగలవా అనేది సంశయమే. అంతరిక్ష పరిజ్ఞానం ఈనాటిది కాదు అతి పురాతనమైన భారతదేశం, గ్రీకు, ఈజిప్టు తదితర దేశాల్లో అంతరిక్ష పరిజ్ఞానం గురించి అనేకమంది పరిశోధ నలు గావిస్తూనే అనేక రకాల విలువైన విషయాలను తెలుసుకుంటూ ఖగోళ రహస్యాలతో పాటు ప్రకృతిని కాపాడుకుంటూ భూమి మీద పర్యావరణంపై ప్రత్యేక దృష్టి సారించారని అనేక చారిత్రక అంశాలు తెలియజేస్తాయి. కానీ నేడు అందుకు భిన్నంగా భూమండలంలో జరుగుతున్న పరిణామాలతో మానవ విధ్వంసానికి కారణమయ్యే యుద్ధ నీతితో అధునాతన ఆయుధాలు సృష్టించే బీభత్సం ప్రకృతి పర్యావరణానికి హాని చేసేటటువంటి అస్తవ్యస్తమైన పరిణామాలు భూగోళంలో చోటు చేసుకుంటున్నాయి. అధునాతన విధ్వంసక ఆయుధాలను సమకూర్చుకొని భూమండలంలో కొన్ని దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలతీరు మానవ మనుగడకు పర్యావరణ పరిరక్షణకు నష్టంకలిగించేరీతిలో కొనసాగుతుండడం భూగోళ సహజమైన ప్రకృతికి పర్యావరణ వినాశనానికి ప్రత్యక్షంగా పరోక్షంగా కారణం అవుతున్నాయేమో అని అనిపిస్తుంది.ఏదేమైనప్పటికీ ముందు మానవుడు భూగోళం చుట్టూఉన్న అనేకవిషయాలను లోతుగా తెలుసుకునే అవసరం మరింతగాఉంది. భూమండలాన్ని పరిరక్షించుకోకపోతే మానవ మనుగడకు అంతగా నివాసయోగ్యంగా లేని సురక్షితం కానీ ఉపగ్రహాలు ఇతర గ్రహాలు మానవ జీవన విధానానికి ఏవిధంగా సహకరిస్తాయి అనే అంశాన్ని అంతరంగా ప్రపంచంలోని ప్రతి ఒక్కరు పునరాలోచించాలి.

తాడిపత్రిలో ఐక్యంగా అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు

-మాల, మాదిగ సంఘాల ఆధ్వర్యంలో డీజే ర్యాలీ, అన్నదానం

అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న అవార్డు గ్రహీత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను మంగళవారం తాడిపత్రి పట్టణంలో మాల, మాదిగ సంఘాలు ఐక్యతతో ఘనంగా నిర్వహించాయి. డీజే ర్యాలీతో పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్న సంఘ సభ్యులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాల, మాదిగ సంఘాల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాణంలో పోషించిన పాత్ర, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఆయన ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు బింగి ప్రభాకర్, వైకే విశ్వనాథ్, గంగరాజు, హెచ్‌పీ గ్యాస్ ఓబులేసు, పారిశ్రామికవేత్త కంబగిరిరాముడు, మాజీ కౌన్సిలర్ విజ్జి, కన్నా, ప్రసాద్, పావురాల శీనయ్య, బింగి రాజశేఖర్, ఎస్‌బీఐ మోషే, రంగస్వామి, లింగం రవి, ఎంపీ పుల్లయ్య, శంకర్, అబ్రహం, శ్రవణ్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు ఘననివాళి

అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వైసిపి నాయకులు

పుట్లూరు, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

భారత రాజ్యాంగ నిర్మాత, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం వంటి సిద్ధాంతాలపై ఆధారపడే నూతన సమాజానికి బాటలు వేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని మంగళవారం పుట్లూరు మండల కేంద్రంలోని వైఎస్ఆర్‌సిపి కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు పొన్నపాటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర య్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమానత్వం, న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడు అంబేద్కర్ అన్నారు. విద్య, క్రమశిక్షణ, ఐక్యత అనే మార్గంలో నడవాలని చూపించిన మహనీయుడన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కలగాలనే ఆయన ఆశయం ఎప్పటికీ మార్గదర్శకం అన్నారు. ఆయన ఆశయాలను ఆచరించటం మన కర్తవ్యమని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

పుట్లూరు, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను మంగళవారం పుట్లూరు మండలం ఓబులాపురం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మంగారి ఆలయం సర్కిల్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ వేడుకల్లో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎస్.సూరి, కెవిపిఎస్ మండల కార్యదర్శి నాగభూషణం, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి టి.పెద్దయ్య, రైతు సంఘం నాయకులు భాస్కర్‌రెడ్డి, యేసు రత్నం, ఓలేసు, రామాంజి, నాగార్జున, ప్రజలు, కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ యువసేన ఆధ్వర్యంలో జయంతి వేడుకలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

అంబేద్కర్ యువసేన నాయకులు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అంబేద్కర్ యువసేన ఆధ్వర్యంలో ఘనంగా జయంతి ఇవ్వడం నిర్వహించి అనంతరం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించి స్థానిక అంబేద్కర్ నగర్ నుంచి జడ్పీ కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు డీజేలతో డబ్బులతో వారి బైక్ ర్యాలీతో చేరుకొని బాణాసంచా పేలుస్తూ జయంతి సంబరాలు చేసుకున్నారు. భారత రాజ్యాంగ నిర్మాత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిడాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 135 జయంతి వేడుకలు సందర్భంగా అంబేద్కర్ యువ సైన్యం ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తాడిమర్రి నరేంద్ర, టీసీ నాగేంద్ర, లబ్బే రాఘవ, హెచ్ సూరి, సత్యమయ్య, సాకే జగదీష్, షేక్షా, పవన్, రవి, మురళీకృష్ణ, శ్రీనివాసులు, కుళ్లాయి స్వామి, దేవేంద్ర, శేషు, అంబేద్కర్ నగర్ కాలనీవాసులు, యువ సైన్యం పాల్గొన్నారు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తాం

అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం.

అనంతపురం రూరల్, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తామని ఎంపీపీ వరలక్ష్మి, ఎంపీడీవో దివాకర్ పేర్కొన్నారు. సోమవారం అనంత రూరల్ పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వరలక్ష్మి అధ్యక్షతన ఎంపీడీవో దివాకర్, కార్యాలయ సిబ్బందితో కలిసి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో నిర్మించడంతోనే ఇప్పుడు మనం రాజ్యాంగ హక్కులను పొందుతున్నామన్నారు. నేటి సమాజంలోని యువత మహనీయుల ఆశయాలను ఆసరగా తీసుకుని వారి అడుగు జాడలలో నడవలన్నారు. ఈ కార్యక్రమం లో ఎంపీటీసీ లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో అక్రమంగా సజీవ కోళ్ల రవాణా

-విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీల్లో బట్టబయలు

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 14, ప్రభాతవార్త

తనిఖీల్లో పట్టుబడ్డ అక్రమంగా తరలిస్తున్న కోళ్లు

కదిరి డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులో నిబంధనలకు విరుద్ధంగా సజీవ కోళ్లను అక్రమంగా రవాణా చేస్తుండగా విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. కడప జోన్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం తెల్లవారుజామున ఈ సర్ప్రైజ్ తనిఖీలు నిర్వహించారు. కదిరి నుండి బెంగళూరు (వంగసంద్ర) వైపు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ బస్సులో అక్రమ రవాణా జరుగుతున్నట్లు అందిన గోప్య సమాచారం మేరకు, శ్రీ సత్యసాయి మరియు అనంతపురం జిల్లాల విజిలెన్స్ అధికారి ఎస్ఐ కె. శ్రీనివాసులు నేతృత్వంలోని బృందం గౌనిపల్లి వద్ద బస్సును అడ్డుకుని తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా బస్సు లగేజీ డిక్కీలో దాచిన 46 సజీవ కోళ్లు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా కోళ్లు తరలించిన ప్రయాణికుడు ఎస్. రమేష్‌పై పెనాల్టీ విధించారు. బస్సు డ్రైవర్లు మరియు సంబంధిత ప్రయాణికుడి నుండి స్పాట్ వివరణలు సేకరించారు. ఆర్టీసీ బస్సుల్లో అనుమతి లేకుండా నిషేధిత వస్తువులు, సజీవ జంతువులు రవాణా చేయడం కఠినంగా నిషేధమని అధికారులు స్పష్టం చేశారు. ఇటువంటి నిబంధనలు అతిక్రమించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీ బృందంలో ఎస్ఐ కె. శ్రీనివాసులు, ఆర్టీసీ కానిస్టేబుల్ కె.టి. ప్రవీణ్ కుమార్, అలాగే ఆర్ ఈ ఎస్ / పి టీ పీ విభాగాలకు చెందిన టిటిఐలు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌ఏజే ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

భారత రాజ్యాంగ నిర్మాత, సామాజిక న్యాయం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (హెచ్‌ఆర్‌ఏజే) ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. హెచ్ ఆర్‌ఏజే జాతీయ అధ్యక్షులు నందం నరసింహారావు ఆదేశాల మేరకు సంస్థ మహిళా అధ్యక్షురాలు కాకర్ల సరస్వతి, స్టేట్ కన్వీనర్ గుత్తా భాస్కరనాయుడు, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కర్ణకుమార్, స్టేట్ స్పోక్స్ పర్సన్ నాగబాబు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాకర్ల సరస్వతి మాట్లాడుతూ మహిళల హక్కులు, సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ చేసిన కృషి అమోఘమని, మహిళలు విద్య ద్వారా ఎదిగి సమాజంలో తమ స్థానాన్ని బలోపేతం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మిద్దె నరసింహులు, ఎం. శ్రీనివాసులు, మహబూబ్‌బాషా, రేష్మ, శంషాద్, చిప్పల లక్ష్మీ, షాహినా, అంజలి పాల్గొన్నారు.

విజన్‌లో ఘనంగా అంబేద్కర్ జయంతి

అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

యాడికి, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

యాడికి మండల కేంద్రంలోని విజన్ విద్యాసంస్థలో మంగళవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన దేశానికి చేసిన సేవలను విద్యార్థులకు వివరిస్తూ భారత రాజ్యాంగాన్ని తయారు చేయడం కోసం అనేక దేశాలు తిరిగి ఎంతో శ్రమకోర్చి అతి పెద్ద లిఖిత రాజ్యాంగాన్ని తయారు చేయడం జరిగిందన్నారు. స్వాతంత్రం వచ్చిన తరువాత మనకు అత్యుత్తమ విధానాలతో కూడిన జీవన విధానంను అమల్లోకి వచ్చేలా కృషి చేసిన మహనీయులు అంబేద్కర్ అని అందరూ ఆయనను స్మరించుకోవాలన్నారు. అంబేద్కర్ స్వేచ్ఛ, సమానత్వం కోసం పోరాడారని విజన్ కరెస్పాండెంట్ విశ్వనాథ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజన్ స్కూల్ ఉపాధ్యాయులు అమర్, శేఖర్, కోటి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

యల్లనూరు, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను మంగళవారం ఎంఆర్‌పిఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళాలు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ అభివృద్ధి కోసం జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. భారత రాజ్యాంగం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాలనరసింహులు, గంగాధర్, శంకర్, నరసింహామూర్తి, నాగభూషణం, ప్రహ్లాద, తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు ఆధ్వర్యంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం.

అనంతపురం రూరల్, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా మాల మహానాడు ఆధ్వర్యంలో బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు మాల సంక్షేమ ఐక్యవేదిక ద్వారా ఉరు ముల కళాకారులతో ర్యాలీగా వచ్చిన బాబా సాహెబ్ కి నివాళులర్పించి ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ అంబేద్కర్ మహిళా సాధికారత రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపన ఓటు హక్కుబాలికలకు రక్షణ హక్కు భారత రాజ్యాంగం ద్వారా ఈ దేశంలో ఉన్న ప్రజలందరికీ కులాలకు మతాలకు అతీతంగా ప్రపంచం గర్వించే విధంగా రాజ్యాంగాన్ని అందించడం జరిగిందని కొనియాడారు. ఈ కార్యక్రమం లో ఏపీ సంక్షేమ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు కోట్ల గంగాధర్, ఏపీ మాల రాష్ట్ర శాశ్వత ఉపాధ్యక్షులు దాసరి రామ్మూర్తి, రాష్ట్ర అధికార ప్రతినిధి పామిడి చలపతి మాల మహానాడు అధ్యక్షులు సుగామంచి శ్రీనివాసులు, చేయ్యేడు రాము, ఉరుములు సుమలత రమాదేవి సాకే శ్రీదేవి బండారు మనోజ్ కుమార్ సూర్య నారాయణ యేసుపాదం మారుతీ అజయ్ జయరాం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బిఆర్ అంబేద్కర్ జయంతి

కేక్ కట్ చేస్తున్న దృశ్యం

అమడగూరు, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

మండలంలో మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా నాయకులు, అధికారులు మాట్లాడుతూ అంబేద్కర్ నిరుపేద కుటుంబంలో జన్మించి ఎన్నో కృష్టాలను అనుభవించన ఆయన కృషి, పట్టుదలే ఆయుధాలుగా మలుచుకుని ఉన్నత విద్య అభ్యసించి పట్టభద్రుడయ్యారన్నారు. దళితుల సంక్షేమానికి కృషి చేశాడన్నారు. భారత రాజ్యాంగాన్ని రచించి చట్టసభల్లో మహిళలకు ఉపాధి, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ లోకనాథ్‌రెడ్డి, ఎస్ఐ గోపాలకృష్ణ, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు వై.గంగులప్ప, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నంజప్ప, ఎంఆర్‌పిఎస్ నాయకులు ఉత్తప్ప, సూరి, నరసింహులు, బావన్న, దొడ్డప్ప, చలపతి, మునికృష్ణ, సర్వేయర్ సురేంద్ర, ఎం.నాగరాజు శ్రీకాంత్, మండల విలేకరుల అధ్యక్షుడు వార్త రమణ, నిర్మలమ్మ, సరస్వతి, రామాంజులు, నవీన్, ఆదినారాయణ, చంద్రశేఖర, శివ, హరీష్, ఆదినారాయణ, ఎంఆర్‌పిఎస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

మొదటి స్థాయి గ్రామ సభలు

గ్రామ సభలో మాట్లాడుతున్న లోకేశ్వర్‌రెడ్డి

నంబులపూలకుంట, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

ఎన్‌పికుంట మండలంలోని కొత్తపల్లి, వంకమద్ది గ్రామాలలో రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా మొదటి స్థాయి గ్రామ సభలు ఆయా గ్రామాలలో గ్రామ స్పెషల్ ఆఫీసర్ లోకేశ్వర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ..గ్రామ సభలో చర్చించి ఆమోదించవలసిన అంశాలు అయినటువంటి ఇంకుడు గుంతలో మరియు కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, జల పునరుద్ధరణ నిర్మాణాలు, జల బడ్జెట్, నీటి వనరుల పునరుద్ధరణలో ప్రజాభాగస్వామ్యం, జల ధార జల హారతి 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక, నీటి పునర్ వినియోగం అంశాలు, తడి చెత్త పొడి చెత్త ఇంటి నుంచి సేకరణ క్లాప్ మిత్రాల ద్వారా తదితర అంశాలపై ఆయా గ్రామ సభలో చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎం.శ్రీరాములు నాయుడు, కేశవ రెడ్డి, భాస్కర్ నాయుడు, మనోహర్ నాయుడు, ఎం.రవీంద్ర, పి.నరసింహులు, నాగేంద్ర, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా డా. బి ఆర్ అంబేద్కర్ జయంతి

నల్లమాడ ఏప్రిల్ 14 ప్రభాతవార్త

అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

డా. బిఆర్ అంబేద్కర్ 135 జయంతి వేడుకలను అధికారులు, తెలుగుదేశం, వైయస్సార్సీపి, ఎమ్మార్పీఎస్‌ల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దళిత సంఘం ఆధ్వర్యంలో కేకును కట్ చేసి, ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పేద దళిత కుటుంబంలో జన్మించిన అంబేద్కర్ సమాజంలోని ఆర్థిక, సామాజిక ఆటుపోట్లను అధిగమించి రాజ్యాంగ సృష్టికర్త అయ్యారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అంజినప్ప, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సతీష్, వార్డెన్ సత్యనారాయణ, టిడిపి నాయకులు మైలే శంకర, రిటైర్డ్ ఉపాధ్యాయుడు లక్ష్మన్న, బుట్టి నాగభూషణం నాయుడు, కోట్ల మంజునాథ్ రెడ్డి, వైయస్సార్సీపి నాయకులు పోరకల రమణ, కుల్లాయి నాయక్, దళిత సంఘం నాయకులు పేపర్ చంద్ర, సూరి, నరసింహులు పాల్గొన్నారు

వేసవికాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం: స్పెషలాఫీసర్ దివాకర్

అనంతపురం రూరల్, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో దివాకర్.

అనంత రూరల్ మండలం సోములదొడ్డి గ్రామములో డా. బి.ఆర్.అంబేద్కర్ 135 వ జయంతిని పంచాయతీ అభివృద్ధి అధికారి పవన్ కుమార్ ఆధ్వర్యంలో వివిధ పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరంగ్రామ సభ నుగ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారి శ్రీ పి.దివాకర్ అధ్యక్షతన గ్రామ సచివాలయం లో గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభ లో ముందుగా డా.బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించినారు. గ్రామ సభ ను ఉద్దేశించి ప్రత్యేక అధికారి దివాకర్ మాట్లాడుతూ గ్రామం ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టవలసిన పనుల గురించి గ్రామ ప్రజలతో చర్చించారు. ఈ వేసవి కాలంలో గ్రామము లో త్రాగు నీటి సమస్య రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటాము అని ప్రజలకు వివరించడం జరిగింది. అలాగే 10 సంవత్సరములుగా వృథాగా ఉన్న త్రాగు నీటి ట్యాంక్ ను బాగు చేయించి మరల ఉపయోగంలోకి తీసుకొని రావడం జరుగుతుందన్నారు. తెలియచేసినారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధికారి పవన్ కుమార్, రాచానపల్లి సింగిల్ విండో ప్రెసిడెంట్ పాముదాయి రఘు, మాజీ ఎంపీటీసీ పాముదాయి వెంకటేష్, పొడరాళ్ళ సాగునీటిసంఘం అధ్యక్షులు రామమోహన్, స్థానిక నాయకులు నాగలింగారెడ్డి, వీరనారప్ప, రాము, చల్లా నాయుడు, సంజీవరెడ్డి, సాయినాథ్, కుమార్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేసిన ఎస్ఐ

అమడగూరు, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

అమడగూరు మండల పరిధిలోని నారాయణస్వామి మఠం కూడలి వద్ద మంగళవారం ఎస్ఐ గోపాల్‌కృష్ణ వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పకుండా ఆర్‌సిలు హెల్మెట్లు, లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులకు జరిమానాలతో పాటు జైలు శిక్ష కూడా ఉంటుందన్నారు. అక్రమంగా కర్ణాటక మద్యం సరఫరా లాంటివి జరపరాదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ చేస్తున్న దృశ్యం

ఘనంగా బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు

తనకల్లు, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బైకు భాస్కర్‌రెడ్డి, తదితరులు

మండల పరిధిలోని కొక్కంటి క్రాసులో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సత్యసాయి జిల్లా వైఎస్ఆర్‌సిపి ఉపాధ్యక్షులు బైక్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు కొనసాగిద్దామని, ప్రతి ఒక్కరూ అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తనకల్లు మండల ఉపాధ్యక్షులు కొండకమర్ల ముస్తఫా, లక్ష్మీపతి, మహేష్‌రెడ్డి, కొక్కంటి క్రాస్ డీలర్ సురేష్‌రెడ్డి, మబ్బు మోహన్‌రెడ్డి, ఆలయ మాజీ కమిటీ మెంబర్ బీరప్ప, చైతన్య స్కూల్ అధినేత పలుమర్ల పవన్‌కుమార్, తనకల్లు బాబ్జాను, మారపు ప్రకాష్, హరినాథ్‌బాబునాయుడు, ఓ.చంద్ర, బి.క్రిష్టప్ప, జగనన్న యూత్ లీడర్స్ ఉద్దాల ప్రవీణ్‌కుమార్, బాలినేని గణేష్, బాలినేని గోవర్ధన్, చప్పిడిహరి, అశోక్, నరేంద్ర పాల్గొన్నారు. అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాల్లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు ఘననివాళి

అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి కేకు కట్ చేస్తున్న వైసీపీ నాయకులు

తనకల్లు, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

మండలంలో స్థానిక దేశాయి సంజీవరెడ్డి మిషన్ కాంపౌండ్‌లో వైసిపి కన్వీనర్ మబ్బు అశోక్‌వర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తనకల్లు మండలంలోని మహిళ విభాగం అధ్యక్షురాలు విజయలక్ష్మి, సీనియర్ నాయకులు దేశాయ్ భక్తవత్సలరెడ్డి, దేశాయి సంజీవరెడ్డి, మండ్లిపల్లి మాధవరెడ్డి, సూర్యనారాయణ, విజయ్‌కుమార్, జెవి రమణ, మాజీ సర్పంచు పూల శంకర, కొండయ్య, కుమార్, ఆదినారాయణ, విజయ్, కుమార్, హరినాథ్‌రెడ్డి, ప్రకాష్, హరినాథ్, భాను, ప్రతాప్, డాక్టర్ ఇమామ్‌సాబ్, నాగభూషణ్‌రెడ్డి, దూగినేపల్లి భయ్యారెడ్డి, సానే రమణ, శివన్న, రమేష్‌నాయక్, రాజారెడ్డి, రమణారెడ్డి, బాబ్జాన్, రమణ, బిఎస్ నిజాం, మస్తాన్, చంద్ర, ఆదినారాయణ, షఫీ, ఈశ్వర్‌రెడ్డి, అమీర్, డీలర్ నరసింహులు, రమణారెడ్డి, వేణుగోపాల్, ఆదినారాయణ, ఉత్తన్న, భానుప్రకాష్, తనకల్లు మండల వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

నల్లచెరువు ఏప్రిల్ 14 ప్రభాతవార్త,

అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మండల అధికారులు

మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం 1 నందు డిప్యూటీ ఎంపీడీవో బాబురావు, ఏవో అశోక్ రెడ్డి పంచాయతీ కార్యదర్శిలు నరేష్ కుమార్ శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ బాబా సాహెబ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ, భారతదేశపు మొట్ట మొదటి కేంద్ర న్యాయశాఖ మంత్రిగా రాజ్యాంగ శిల్పి అని అంటరానితనం కుల నిర్మూలన కోసం ఎంతో కృషి చేశాడని ఇతను చేసిన విశేష కృషికి ఆయనకు పుట్టినరోజు కార్యక్రమాలు జరుపుకుంటున్నారని ఆయన సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. అదేవిధంగా తాసిల్దార్ కార్యాలయం నందు తాసిల్దార్ రవి నాయక్ తోటి సిబ్బంది జయంతి వేడుకలను నిర్వహించారు మండల పరి షత్ కార్యాలయం నందు ఎంపీడీవో అశోక్ రెడ్డి కార్యాలయ సిబ్బందితో అంబే ద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయాల్లో బాబాసాహెబ్ జయంతి వేడుకలను నిర్వహించారు,

ఘనంగా రాజ్యాంగ నిర్మాత జయంతి వేడుకలు

నల్లచెరువు ఏప్రిల్ 14 ప్రభాత వార్త

అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పలువురు తెదేపా, ఎంఆర్పిఎస్ నాయకులు

మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలి నందు తెదేపా మండల కన్వీనర్ రాజశేఖర్ బాబు ఆధ్వర్యంలో, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 135,వ జయంతి వేడుకలు ను నిర్వహించారు ఈ సందర్భంగా మండల తెదేపా నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ జయంతి వేడుకల్లో భాగంగా మండల కన్వీనర్ మాట్లాడుతూ సామాజిక వర్గంలో జన్మించి భారత రాజ్యాంగాన్ని రూపొందించి బడుగు బలహీన వర్గాల వారికి వెలుగులు నింపిన మహనీయుడు అంబేద్కర్ అని తెలుపుతూ అంటరానితనం, కుల వివక్షతపై జీవితాంతం పోరాడుతూ స్వతంత్ర భారతదేశపు మొదటి న్యాయశాఖ మంత్రిగా సేవలందించిన ఆయన దేశ నిర్మాణంలో కీలకపాత్ర పోషించారు అని తెలిపారు, ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాబు సాబ్, సహకార సంఘం అధ్యక్షులు క్నుడ వెంకటరమణ, మాజీ సర్పంచ్ పంచరత్నమ్మ, కూటమి నాయకులు జెరిపిడి శంకర, మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వర్ల భరత్ కుమార్, మల్లీ, నాగ బయప్ప, తిరుపాలు, రమణ, ఆర్ట్ సీనా, మల్లీ ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు

కందుకూరును అభివృద్ధి బాటలో నడిపిస్తున్నాం

స్పెషలాఫీసర్, కార్యదర్శి

అనంతపురం రూరల్, ఏప్రిల్ 14 ప్రభాతవార్త



గ్రామ సభ నిర్వహిస్తున్న దృశ్యం.

అనంత రూరల్ మండలం కందుకూరు గ్రామ పంచాయితీ ని అభివృద్ధి బాటలో నడిపిం చడం జరుగుతుందని స్పెషలాఫీసర్, ఎంపీడీవో దివాకర్, పంచాయతీ అభివృద్ధి అధికారి మల్లికార్జున తెలిపారు. మంగళవారం పంచాయితీ అభివృద్ధి అధికారి మల్లికార్జున గ్రామ సభ ఏర్పాటు చేయడంతో, ఈ కార్యక్రమానికి స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో దివాకర్ హాజరై అంబేద్కర్ జయంతి సందర్భంగా ముందుగా డా. బిఆర్ అంబేద్కర్ చిత్రపట్టాలకు పూలమాలు వేసి నివాళుల్పంచారు. జాతీయ నాయకుల గురించి వారు చేసిన సేవలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మల్లికార్జున గ్రామంలో ఏమి ఏమి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామో ప్రజలకు తెలియజేశారు. అనంతరం గ్రామంలోని ప్రజల సమస్యలను తెలుసుకుని ఆ సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి పంచాయితీని ఎంతోఅభివృద్ధి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు, ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు సచివాల సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ మీదుగా తుంకూరుకు రైలు మార్గం ఏర్పాటుకు కృషి చేయండి

-మంత్రి పయ్యావుల కేశవ్‌కు గిరిజన ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మూడ్ కేశవనాయక్ వినతి

ఉరవకొండ, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

ఆంధ్ర, కర్నాటక సరిహద్దులోని పూర్తిగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి దోహదం చేయగల గుంతకల్లు నుండి ఉరవకొండ మీదుగా తుంకూరుకు రైలు మార్గం ఏర్పాటుకు కృషి చేయాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు గిరిజన ఐక్య సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మూడ్ కేశవనాయక్ కోరారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొనడానికి మంత్రి మంగళవారం ఉరవకొండకు రాగా స్థానిక అన్న క్యాంటిన్‌వద్ద మంత్రిను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మూడ్ కేశవనాయక్ మాట్లాడుతూ రైల్వే డివిజినల్ కేంద్రమైన గుంతకల్లు నుండి ఉరవకొండ మీదుగా కర్నాటక రాష్ట్రంలోని టుంకూరుకు కళ్యాణదుర్గం, మడకశిర, కర్నాటకలోని మధుగిరి, కొరటగిరి, పావుగడ ప్రాంతాలను కలుపుతూ బ్రాడ్‌గేజ్ రైలు మార్గం ఏర్పాటుకు 1933లో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు. అయితే సదరు ప్రతిపాదన ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదన్నారు. ఈ రైలు మార్గం ఏర్పాటు చేయడంవల్ల ఆంధ్ర, కర్నాటక ప్రాంతాల్లోని కొన్ని వందల గ్రామాలకు ప్రయోజనం చేకూరుతుందని వేలాది మంది ప్రజలు, రైతులు, వ్యాపారస్థులు, విద్యార్థులు, నిరుద్యోగులకు, దళిత, గిరిజన, బడుగు, బలహీనవర్గాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ రైలు మార్గం ఏర్పాటు గూర్చి 2001-18 మధ్య ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర రైల్వే మంత్రులకు అనేకమార్లు విన్నవించడం జరిగిందని వివరించారు.

అతకల్లు పట్నం పేరును తొలగించిన గుర్తు తెలియని వ్యక్తులు

- ఆగ్రహించిన ఆ దేశాలయ కాపులు

రామగిరి, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

అతకల్లు పట్నం బోర్డు పేరును తొలగించిన గుర్తు తెలియని వ్యక్తులు

మండలంలోని నసనకోట గ్రామంలో వెలసిన అతకల్లు పట్నం పెదయ్యస్వామి దేవాలయంలో అతకల్లు పట్నం అనే పేరును గుర్తు తెలియని వ్యక్తులు అతకల్లు పట్నం పేరుకు రంగుపూసేశారు. కురుబకులస్తులు ఈ దేవాలయ కాపులు కాగా వీరి ఆపేరు పెట్టుకోకూడదని కనగానపల్లి పెదయ్యస్వామి ఆలయ పూజారి, కొందరు వ్యక్తులు కొన్ని రోజుల క్రితం పోలీసుల స్టేషన్‌కు వెళ్లారు. నసనకోట పెదయ్యస్వామి కాపులు గత నెలలో పెద్ద పరుష చేసుకుంటుండగా వీల్లు ఆపేరు పెట్టుకోకూడదంటూ పోలీసులకు ఫిర్యాదుచేశారు. అప్పట్లో కొందరుపెద్దలు జోక్యంచేసుకుని పరుష యదావిధిగా జరిగేలా చేశారు. గత 20 సంవత్సరాల క్రితం కూడా తాము అతకల్లు పట్నం నసనకోట పెదయ్యస్వామి పరుష నిర్వహించుకున్నామని అప్పట్లో లేని సమస్య ఇప్పుడు కనగానపల్లి పెదయ్య స్వామి పూజారి లేని గొడవలు సృష్టిస్తున్నారని నసనకోట స్వామికాపులు ఆరోపించారు. ఉన్నపేర్లు పెట్టుకోవ డానికి ఇలా గొడవలుచేస్తూ గ్రామాలమధ్య, వ్యక్తుల మధ్య సృష్టిస్తున్నారని వారు ఆరోపించారు. ఇందుకు సంబంధించి కులపెద్దలు గురువులను విచారించిన వారుకూడా పేరు పెట్టుకోవడంలో మాతప్పు లేదని తెలియజేస్తున్నారని అలా చేస్తున్న వారిపై దాడికి దిగినట్టు వారు తెలిపారు. ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా కుల పెద్దలు కానీ అధికారులు కానీ సరిగా స్పందించలేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి ఇలాంటి దుండగులపై చర్యలు తీసుకోవాలని నసనకోట పెదయ్యస్వామి కాపులు విజ్ఞప్తి చేశారు.

నా కామం తీర్చాలని వెంటపడి వేదిస్తున్నాడు.. చర్యలు తీసుకోండి

- పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళ
- కేసు నమోదు చేసిన పోలీసులు

అగళి, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

మండల పరిధిలోని హెచ్‌డి హళ్లి గ్రామానికి చెందిన లత అనే మహిళ తన కామం తీర్చాలనే తరచూ వెంటపడి వేదిస్తున్నారని లత అగళి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. లత అగళి ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుండగా అదే గ్రామానికి చెందిన మహేష్ ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుకున్నారు. మూడేళ్ల క్రితం లతకు వివాహమైంది. 10 నెలల బాలుడు కూడా కలడు. సంవత్సర కాలం నుంచి మహేష్ లత అనే అమ్మాయిని తరచూ వేదిస్తూ నన్ను ప్రేమించాలని, నా కామకోరిక తీర్చాలంటూ తరచూ వెంట పడుతున్నాడని ఆమె తెలిపింది. అతను వెంటపడుతున్న సమయంలో నీవు నాకు అన్నతో సమానమని చెప్పినా సైతం పట్టించుకోకుండా నా కామం తీర్చాలని తరచూ వెంటపడి వేదిస్తున్నాడని ఆమె కనబడినప్పుడల్లా వెంటపడి వేదిస్తున్నాడని, నా కామం తీర్చకుంటే నీ భర్తను చంపుతానని మహేష్ బెదిరిస్తున్నాడని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు జమేదార్ బాలాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా 135వ అంబేద్కర్ జయంతి వేడుకలు

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

మండల కేంద్రమైన చెన్నేకొత్తపల్లిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతో స్తవ కార్యక్రమం చెన్నేకొత్తపల్లి అందరివాడు ఉత్సవ సొసైటీ ఆధ్వర్యంలో, మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసీల్దార్ ఎసురేష్ బాబు, రామగిరి పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వి.శ్రీధర్, ఎంపీడీఓ బాలకృష్ణుడు, సింగిల్ విండో ప్రెసిడెంట్ వెట్టి నరసింహులు, ఎస్.ఐ సత్యనారాయణ, ఇఓఆర్‌డి అశోక్ నాయక్, పంచాయతీ కార్యదర్శి అశోక్ కుమార్‌లు పాల్గొన్నారు, ఈ సందర్భంగా ముందుగా, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేద్కర్ సామాజిక న్యాయం కోసం చేసిన సేవలు దేశానికి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుచుకుంటూ, సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఉత్సవ కమిటీ సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగ నిర్మాతకు నివాళులు...దేశం కోసం ప్రాణమిచ్చిన జవాన్‌కు జోహార్లు

-టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి ఆధ్వర్యంలో కార్యక్రమాలు

గోరంట్ల, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా మంగళవారం టిడిపి మండల కన్వీనర్ గుత్తా బాలకృష్ణచౌదరి ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ నేపథ్యంలో మండలంలోని కల్లితాండలో వీరజవాన్ మురళినాయక్ మొదటి వర్ధంతి సందర్భంగా మురళినాయక్ ఘాట్‌ను సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నిమ్మల విద్యాధరణి, సుబ్బారెడ్డి, నాగేనాయక్, బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, జనసేన మండల అధ్యక్షులు సంతోష్‌కుమార్, జనసేన జిల్లా కార్యదర్శి సురేష్, వృషభదేవుడు, గిరిధర్‌గౌడ్, రవీంద్రనాయక్, నబిరసూల్, చింతా భాస్కర్‌రెడ్డి, బొట్టు శ్రీనివాసులు, జయరాం, మాజీ డీలర్ రమేష్, నాగమణి, గాజుల రమేష్, కురవ మల్లికార్జున, తిరుపాల్, తాగుతోట వెంకటేష్, డీలర్ శంకర, రమణ, చిలమత్తూరి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.


వీరజవాన్ ఘాట్ వద్ద జోహార్లు అర్పిస్తున్న దృశ్యం

అంగరంగ వైభవంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు..!

సమసమాజ స్వాప్నికుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ..! మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్ ఏప్రిల్ 14 ప్రభాతవార్త

భారత రాజ్యాంగ నిర్మాత, న్యాయ కోవిదుడు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన సమసమాజ స్వాప్నికుడు భారతరత్న డా.బి.ఆర్.అంబేద్కర్ గారి 134వ జయంతి వేడుకలు మడకశిర పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్లో పట్టణంలో అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. మంగళవారం అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అందరికీ తినిపించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత, న్యాయ కోవిదుడు, బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన సమసమాజ స్వాప్నికుడు భారతరత్న డా.బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలను ప్రతి ఒక్కరు జరుపుకోవాలని అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవితంలోని ప్రతి అడుగు ఒక పూల బాటలేమీ కాదు ఒక కన్నీటి సంద్రం. ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోయిని మహోన్నతమైన వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ. మాజీ మున్సిపల్ చైర్మన్ నరసింహ రాజు. జిల్లా అధికార ప్రతినిధి నాగేంద్ర. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ భక్తర్. సింగల్ విండో అధ్యక్షుడు నరేష్ కన్నా. మాజీ మున్సిపల్ చైర్మన్ సుబ్బరాయుడు. సీనియర్ నాయకులు మల్లికార్జున. నారాయణప్ప. జనసేన పార్టీ శివాజీ. డాక్టర్ ఎస్సీ సెల్ నాయకుడు కృష్ణమూర్తి.తాలూకా ఎస్సీ సెల్ నాయకుడు మారుతి.తెదేపా నాయకులు బుల్లెట్ శంకర్. వైజాక్ రమేష్. మంజునాథ్. కొల్లేష్. శ్రీరాములు.క్లస్టర్ ఇంచార్జ్ ఈశ్వర్. పట్టణ, మండల కన్వీనర్లు నాగరాజు.నాగరాజు. పట్టణ ప్రధాన కార్యదర్శి తిమ్మరాజు. మాజీ కౌన్సిలర్లు విక్రమ్. హనుమంతు. ఉమా శంకర్.పుల్లయ్య. నాయకులు. కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వ్యవస్థీకృత అసమానతలను సవాలు చేసిన వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

బత్తలపల్లి, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

ఎంపీడీవో కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు నివాళులు అర్పిస్తున్న అధికారులు

సావరాజిక అణచివేతను, వ్యవస్థీకృత అసమానతలను కేవలం తన మేధో శక్తితో సవాలు చేసిన అజేయ యోధుడు, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ తీ.అంబేద్కర్ అని ఎంపీడీవో నరసింహనాయుడు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం తో పాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సమసమాజ నిర్మాణానికి, కులవాదాన్ని నిర్మూలించడం, సమైక్యతకు విఘాతం కలిగించే మనువాదాన్ని నిర్భయంగా తిరస్కరించడమే రాజ్యాంగ నిర్మాతకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. అదేవిధంగా స్థానిక పశు వైద్యశాలలో ఏ డి శ్రీనివాసులు సిబ్బందితో కలిసి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటాల నుంచి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారిమల్లికార్జున, కార్యాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఎస్సీ స్మశాన వాటికకు భూమి కేటాయింపు

రొళ్ల ఏప్రిల్ 16 (ప్రభాతవార్త):

పోజెషన్ సర్టిఫికేట్ జారీనీ పంచాయతీ కార్యదర్శికి అందజేస్తున్న తహశీల్దార్

మండల తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం అంబేద్కర్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి తాహశీల్దార్ చంద్రశేఖర్ తోటి సిబ్బందితో కలిసి నివాళులు అర్పించి ఆయన సేవలను కొనియాడారు. అనంతరం మండలంలోని ఎం.రాయపురం గ్రామ సర్వే నెం.218లో ఉన్న భూమిలో 0.50 సెంట్ల భూమిని ఎస్సీ స్మశాన వాటికకు కేటాయించినట్లు తహసిల్దార్ తెలిపారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అడ్వాన్స్ పొజెషన్‌గా అప్పగించినట్లు చెప్పారు.దీనికి సంబంధించిన అడ్వాన్స్ పొజెషన్ సర్టిఫికేట్ జారీనీ పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్ కు అందజేశారు.నిర్దేశిత ప్రయోజనానికి మాత్రమే వినియోగించవలసిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ గిరియప్ప,విఆర్ఓ నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ సమక్షంలో టిడిపిలో చేరిన వైకాపా నాయకులు

అమరాపురం ఏప్రిల్ 14 ప్రభాతవార్త

మండల పరిధిలోని కే. గొల్లహట్టి, రంగాపురం గ్రామాలకు చెందిన వైకాపా నాయకులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో మంగళవారం చేరారు. వైకాపా నుండి సీనియర్ నాయకులు మాజీ డీలర్ ముద్దన్న, తిమ్మన్న, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ వీరభద్రప్ప, పాలన్న, ముద్దిరప్ప, ఉమేష్, హర్షవర్ధన్, రంగాపురం రామచంద్రప్ప తదితరులకు టిడిపి కండువా వేసి పార్టీలోకి మాజీ ఎమ్మెల్సీ ఆహ్వానించారు. టిడిపి రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధిని చూసి వైకాపాను విడి టిడిపిలో చేరినట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ,టిడిపి మండల కన్వీనర్ కృష్ణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, మండల క్లస్టర్ కన్వీనర్ నవీన్, మాజీ సర్పంచ్ విశ్వేశ్వర, పిఎం చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ ధనుంజయ, టీచర్ గోవిందప్ప, పంచాయతీ కన్వీనర్ చిక్కన్న, డీలర్ రమేష్, లింగరాజు, అశ్వత్ ,విజయ్ ,వీరమద్దన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

వజ్రకరూరు ఏప్రిల్ 14 ప్రభాతవార్త

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను పరిష్కరించుకొని మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాలలో, మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొత్తం ప్రసంగిస్తూ సమాజంలో ధర్మసమానత్వం కోసం నిర్విరామ కృషి చేశారన్నారు. అట్టడుగు బడుగు బలహీన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించి విద్యా, ఉద్యోగలలో అవకాశాలు కల్పించారన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా ఆశయ సాధనకు కృషిచేయాలన్నారు.

అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

అంబేద్కర్ జయంతి వేడుకల్లో జేజేఆర్ యూత్

సోమందేపల్లి,ఏప్రిల్ 14 ప్రభాత వార్త

అన్నదానం చేస్తున్న జేజేఆర్ యూత్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని ఆశయాలను కొనసాగిద్దాం అంటూ జేజేఆర్ కాలనీ యువ నాయకులు పేర్కొన్నారు మంగళవారం అంబేద్కర్ జయంతి వేడుకలను పట్టణం అంబేద్కర్ సర్కిల్లో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని జగజ్జీవన్ రావు నగర్ కు చెందిన జేజేఆర్ యూత్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ పురవీధులలో బైక్ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ సర్కిల్లో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకొన్నారు. ఈ సందర్భంగా యూత్ నాయకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఉన్నతంగా చదివి ఆదర్శవంతంగా నిలవాలని కొనియాడారు. నిరుపేద కుటుంబంలో పుట్టినా, చదువుతో భారత రాజ్యాంగాన్ని రాసి చరిత్ర పుటల్లో నిలిచిపోయిన గొప్ప వ్యక్తి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. అలాంటి వ్యక్తి ఆశయాలను తప్పక కొనసాగించాలని అందుకు ఉన్నత విద్యతోనే సాధ్యమని, ప్రతి ఒక్కరు చదువు పైన దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా అన్నదానం నిర్వహించిన జేజేఆర్ కాలనీ యువ నాయకులకు కృతజ్ఞతలు అభినందనలను పలువురు తెలియజేశారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కి ఘన నివాళులు..

కొత్తచెరువు ఏప్రిల్ 14 ప్రభాతవార్త

భారత రాజ్యాంగ నిర్మాత బడుగు బలహీన వర్గాల అభ్యున్నత కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి భారతరత్న పితామహుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని డీఈవో జీ కృష్ణప్ప కొనియాడారు కొత్తచెరువు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి జవాబు పత్రాలు మూల్యాంకనం జరుగుచున్నది అక్కడ ఉన్నటువంటి ఉపాధ్యాయులు డీఈవో జి కృష్ణప్ప ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతోత్సవాలు సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు అలాగే ధర్మవరం రహదారిలో ఉన్న బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి దళిత సంఘ నాయకులు, వైఎస్ఆర్సిపి నాయకులు, తెదేపా జనసేన బిజెపి తదితర నాయకులు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు అలాగే మండలంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో బిఆర్ అంబేద్కర్ జయంతోత్సవాలు ను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత బడుగు బలహీన వర్గాల మరియు దేశ అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన మహోన్నత వ్యక్తి భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని కొనియాడారు ఆయన నిత్యం పోరాటయోధుడు రాజ్యాంగ నిర్మాత గానే కాకుండా తన సొంత ఆలోచనలతో దేశానికే కాదు ప్రపంచ మానవాళికి దిశానిర్దేశం చేసిన మహనీయుడుఅన్నారు ఈ కార్యక్రమంలో వేరువేరుగా వివిధ శాఖలఅధికారులు దళిత సంఘ నాయకులు వైసిపి తెదేపా బిజెపి సిపిఎం సిపిఐ తదితర నాయకులు పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిసిన నైరుతిరెడ్డి

గుంతకల్లు, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

వైఎస్ జగన్‌ను కలిసిన నైరుతిరెడ్డి

వైఎస్ఆర్‌సిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పరిస్థితులను జగన్ అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. ఆమె వెంట గుంతకల్లు, గుత్తి, పామిడి మండలాల కన్వీనర్లు, ఇతర నాయకులు ఉన్నారు.

గుత్తిలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

వైకాపా నేతలు ర్యాలీ చేస్తున్న దృశ్యం

గుత్తి, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

గుత్తి పట్టణంలో మంగళవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ప్రజా సంఘాలు రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైకాపా ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు ర్యాలీ చేసి అనంతరం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా రాష్ట్ర పెన్షనర్ల కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం, సిపిఐ, ఎంఆర్‌పిఎస్, ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్, జమాతే ఇస్లామీ హింద్, తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో నాయకులు పాల్గొన్నారు.

కొల్హాపురి మహాలక్ష్మి దేవత భక్తులకు అన్నదానం

- అన్నదానం చేసిన జడ్పిటిసి ఉమేష్

అగళి, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

రత్నగిరిలో వెలసిన పురాతన కొల్హాపురి మహాలక్ష్మి జాతర జరుగుతుంది. ఈ జాతరలో విశేష సంఖ్యలో భక్తులు హాజరవుతారు. స్వామి పూజలో పాల్గొని భక్తులకు జడ్పిటిసి ఉమేష్, భార్య ఆశలు కలిసి ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంతోపాటు భక్తులకు స్వహస్తాలతో పంపిణీ చేశారు. భక్తులు దూర ప్రాంతాల నుంచి జాతర సమయంలో మహాలక్ష్మి పూజలో పాల్గొనడం తోపాటు పెద్ద ఎత్తున జ్యోతులు, గంగపూజ, నిర్వహిస్తారని అలాంటి భక్తులకు అన్నదానం చేయడం పూర్వ జన్మ సుకృతం అన్నారు.

అన్నదానం చేస్తున్న జడ్పిటిసి ఉమేష్ →

దేశ ప్రజాస్వామ్యానికి బలమైన పునాదులు వేసిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్

జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

పుట్టపర్తి, ఏప్రిల్ 14, ప్రభాతవార్త

అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

డాక్టర్ అంబేద్కర్ భారత రాజ్యాంగ రూపకర్తగా దేశ ప్రజాస్వామ్యానికి బలమైన పునాదులు వేశారని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135, జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అంకితలు ముఖ్య అతిథిలుగా హాజరై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, సమానత్వం, సామాజిక న్యాయం, విద్య, హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ప్రతి ఒక్కరూ డాక్టర్ అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజంలో న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వం విలువలను పెంపొందించేందుకు కృషి చేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏ ఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ ఐ లు వలి, మహేష్, రవికుమార్ , ఆర్.ఎస్.ఐ లు ప్రదీప్ సింగ్, ప్రసాద్, ఏ ఆర్ ఏ ఆర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణాలకు తెగించి అగ్నిమాపక సిబ్బంది అందిస్తున్న సేవలు అమోఘం

-గవిమఠ సంస్థానం ఉత్తరాధికారి జగద్గురు డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి -ఉరవకొండలో అట్టహాసంగా ప్రారంభమైన అగ్నిమాపక వారోత్సవాలు

కరపత్రాలు విడుదల చేస్తున్న గవిమఠం ఉత్తరాధికారి జగద్గురు డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి, ఆర్టీసీ డీఎం హంపన్న, ఫైర్ ఆఫీసర్ ఎ.భీమలింగయ్య తదితరులు

ఉరవకొండ, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

సిబ్బంది గౌరవ వందనం స్వీకరిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారి ఎ.భీమలింగయ్య

ప్రాణాలకు తెగించి అగ్నిమాపకశాఖ సిబ్బంది అందిస్తున్న సేవలు అమోఘమని గవిమఠ సంస్థానం ఉత్తరాధికారి జగద్గురు డాక్టర్ కరిబసవ రాజేంద్రస్వామి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలు సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవలశాఖ ఆధ్వర్యంలో అగ్నిమాపకశాఖ అధికారి ఎ.భీమలింగయ్య ఆధ్వర్యంలో పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో జరుగగా ఉత్తరాధికారితోపాటు ఆర్టీసీ డిపో మేనేజర్ హంపన్న, వెలుగు ఏపీఎం కాలేనాయక్, సీసీ మల్లికార్జున ముఖ్య అతిధులు గా హాజరయ్యారు. తొలుత ముంబాయి అగ్నిప్రమాదంలో అసువులుబాసిన అగ్నిమాపక సిబ్బందితోపాటు ఇటీవల మరణించిన ఎస్.సోనికుమార్, ఎస్.హెచ్.దుంగర్‌సింగ్ ఆత్మకు శాంతిచేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. భారతరాజ్యాంగనిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అగ్నిమాపక సామాగ్రికు పూజలు జరిపారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విపత్తులు, అగ్నిప్రమాదాల సమయంలో అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి అందిస్తున్న సేవల కారణంగా ఆస్థి, ప్రాణనష్టాలు నివారించబడుతున్నాయని కొనియాడారు. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎ.భీమలింగయ్య మాట్లాడుతూ వారం రోజులపాటు జరిగే కార్యక్రమంలో ప్రజలకు విపత్తులు, అగ్నిప్రమాదాలపై స పూర్ణ అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఘనంగా నిర్వహణ

శ్రీ సత్య సాయి జిల్లా వైద్యము ఏప్రిల్ 14 ప్రభాతవార్త:

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీ సత్యసాయి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్. ఫైరోజా బేగం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతగా అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సామాజిక న్యాయం, సమానత్వం, విద్య అభివృద్ధికి ఆయన చేసిన కృషి అపారమని పేర్కొన్నారు.రాజ్యాంగం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పించిన మహనీయుడిగా ఆయన నిలిచారని తెలిపారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.అనంతరం కార్యాలయ సిబ్బంది మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆశాజ్యోతి అయిన అంబేద్కర్ జయంతిని కార్యాలయంలో జరుపుకోవడం గర్వకారణమని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిపిహెచ్ఎన్ఓ వీరమ్మ, డెమో సుబ్రహ్మణ్యం, సిహెచ్ఓ వన్నప్ప, కార్యాలయ పర్యవేక్షకులు ఫైరోజ్, నాగభూషణ్, ఉద్యోగుల సంఘ ప్రతినిధి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో 43 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్ - వాహనం స్వాధీనం

గుత్తి, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

బియ్యం వాహనాన్ని స్వాధీనం చేసుకున్న దృశ్యం

గుత్తి మండలంలోని ఎంగిలి బండ క్రాస్ వద్ద ఓ గొడౌన్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. అందిన సమాచారం మేరకు అర్బన్ సిఐ రామారావు ఆధ్వర్యంలో ఎస్ఐ అమీర్‌ఖాన్, ఏఎస్ఐ రామాంజనేయులు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 43 క్వింటాళ్ల మేర 86 బియ్యం బస్తాలతో పాటుగా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనలో నిందితులైన రామచంద్ర, శేఖర్, శంకర్‌లపై కేసు నమోదు చేశారు. తదుపరి రెవెన్యూ అధికారులకు జప్తు చేసిన రేషన్ బియ్యాన్ని అప్పగించారు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

07ATP14_07ATP14.qxd 14-04-2026 PM 11:20 Page 1

కదిరిలో ఘనంగా అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు

అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

కదిరి, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

నవభారత నిర్మాత, భారతరత్న డా.బిఆర్.అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను మంగళవారం కదిరి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు అంబేద్కర్ కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రాజ్యాంగంపై ప్రతి ఒక్కరితో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కందికుంట వెంకట ప్రసాద్ మాట్లాడుతూ. అంబేద్కర్ సమానత్వం, సామాజిక న్యాయం కోసం చేసిన సేవలు దేశానికి చిరస్మరణీయమన్నారు. ఆయన చూపిన మార్గంలో సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం దళితుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డా.పాలవల పవన్‌కుమార్‌రెడ్డి, టిడిపి అధికార ప్రతినిధి రాజశేఖర్‌బాబు, బిజెపి నాయకులు గంగాధర్, ఆర్‌డిఓ వివిఎస్ శర్మ, ఎమ్మార్పిఎస్ నాయకులు జయరామ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, టిడిపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సిపిఐ ఆధ్వర్యంలో..

రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్.అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను మంగళవారం సిపిఐ నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సిపిఐ నాయకులు అంబేద్కర్ కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మాల మహానాడు ఆధ్వర్యంలో..

రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్.అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను కదిరి పట్టణంలో మాల మహానాడు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత, సంఘ సంస్కర్తగా దళిత హక్కుల పోరాట యోధుడిగా అంబేద్కర్ చేసిన కృషి చరిత్రలో నిలిచారని కొనియాడారు. 1891లో జన్మించిన ఆయన కుల నిర్మూలన, సమానత్వం కోసం జీవితాంతం పోరాడాలన్నారు. అంటరాని తనం సామాజిక అసమానతలకు, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం అహర్నిశలు పోరాడిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు పిచ్చిలి రామచంద్ర, కె.రామచంద్ర, త్యాగరాజ్, చంద్రమౌళిలు పాల్గొన్నారు.

సిమ్స్ వైద్యశాల ఎండి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

కదిరి, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

భారత రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్.అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా సిమ్స్ వైద్యశాల ఎండి నిస్సార్ యాసిన్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. మొదటగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వైద్యశాలలో దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిస్సార్ యాసిన్ మాట్లాడుతూ.. అణగారిన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. అంబేద్కర్ ఇచ్చిన మెడికేట్, అడిటేట్, ఆర్‌జోన్ అనే సందేశాన్ని ప్రతి ఒక్కరు ఆచరణలో పెట్టాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు తమ పిల్లలను కూడా ఉన్నత చదువులుచదివించాలని, విద్యద్వారానే సమాజంలో సమానత్వం సాధ్యమవుతుం దన్నారు. మాదిగ పోరాట సమితి నాయకులు ఆనంద్ మాట్లాడుతూ.. సిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషించ దగ్గ విషయమని ప్రధానంగా పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తించి వారిని ప్రోత్సహించడం చాలా అవసరం అన్నారు. అంబేద్కర్ జయంతి రోజు ఇలాంటి గొప్ప కార్యక్రమం నిర్వహించిన వైద్యశాల ఎండి నిస్సార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ నాయకులు నాగేంద్రనాథ్, తిరుపాల్, శ్రీనివాసులు, నరసింహులు, బాబ్‌జాన్, వైద్యశాల సిబ్బంది, మున్సిపాల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ స్తున్న సిమ్స్ వైద్యశాల ఎండి నిసార్ యాసిన్

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

వశిష్ఠ పాఠశాల కరస్పాండెంట్ పిట్టా శివ శంకర్ రెడ్డి

అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కరస్పాండెంట్ శివ శంకర్ రెడ్డి

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 14, ప్రభాతవార్త

దళితులు, నిరుపేదల ఆశావాది రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ ఆశయాలను సాధించే విధంగా అందరం కృషి చేద్దామని వశిష్ఠ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ పిట్టా శివ శంకర్ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక వశిష్ఠ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మంగళవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అదేవిధంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి, కొండకమర్లలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, ఏఐబిఎస్ఎస్ అఖిల భారత బంజారా సేవా సంఘం మండల అధ్యక్షులు యంవి రమణ నాయక్, ప్రధాన కార్యదర్శి కుమావత్ బాబు నాయక్, ఉపాధ్యాయులు ఎన్ సి నరసింహులు, కట్టుబడి గౌస్ లాజం లు అంబేద్కర్ విగ్రహాలకు మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.... దేశంలోనే కాకుండా ప్రపంచ చరిత్రలోనే గొప్ప వ్యక్తిగా పేరుగాంచిన డాక్టర్ అంబేద్కర్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాల్సిన అవసరం ఉందన్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని పాఠశాలలు, కార్యాలయాలలో అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే స్థానిక రెయిన్బో, విజ్ఞాన్, మస్తాన్ ఇంగ్లీష్ మీడియం, స్థానిక ప్రభుత్వ పాఠశాల, తహసిల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయంతో పాటు సచివాలయం తదితర ప్రభుత్వ కార్యాలయాలలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి దేశానికి ఆయన చేసిన సేవలు రాజ్యాంగం పట్ల ఆయనకు ఉన్న అంకితభావం పట్ల అభివర్ణించారు. అలాగే మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు రామాంజనేయులు, నాయకులు ఎర్ర దొడ్డెప్ప, అచ్చక్క గారి లక్ష్మన్న, నరసింహులు, భావన్న, జి. ఆంజనేయులు, పలక గంగన్న బంజారా నాయకులు రమణ, సుధాకర,బాబు తో పాటు రత్న బాయ్ తో పాటు స్థానికులు పురవీధుల్లో అంబేద్కర్ చిత్రపటంతో ర్యాలీ జరిపి సంబరాలు చేసుకున్నారు.ఆయా కార్యక్రమంలో స్థానిక అధికారులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

భారతీయ భీమ్‌సేన ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు

అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

భారతీయ భీమ్‌సేన ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని నంద్యాల రోడ్డులో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అపే ఫ్రచర్ల ప్రసాద్ మాట్లాడుతూ అంబేద్కర్ సమానత్వం, సామాజిక న్యాయం కోసం చేసిన కృషిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ భీమ్‌సేన నాయకులు శంకర్, మద్దిలేటి, ఓబులేష్, పెద్దయ్య, గణేష్ పాల్గొన్నారు.

రాజ్యాంగ శిల్పి మన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

నంబులపూలకుంట, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

మండల కేంద్రం ఎంఆర్ఓ కార్యాలయంతో 135 డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని ఘనంగా జరుపకున్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాలులు అర్పించారు. అనంతరం తహసిల్దార్ దేవేందర్ నాయక్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ముసాయిదా రూపకల్పన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కీలక పాత్ర పోషించారు బాబా సాహెబ్ అనే పిలవబడే ఆయన సామాజిక న్యాయ సమానత్వం కోసం పోరాడిన గొప్ప నాయకుడుగా చెప్పుకోవాలి. ప్రపంచ దేశంలో లేని రాజ్యాంగం మనదేశంలో ఉన్నదంటే బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అలాంటిది అని తెలిపారు.

అంగన్‌వాడి కేంద్రంలో

అంబేద్కర్ జయంతి వేడుకలు

అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

యాడికి, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

యాడికి మండలంలో ఏపి అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి మహాలక్ష్మీ మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ దేశానికి అందించిన రాజ్యాంగం మహిళలు, పిల్లలు, కార్మిక వర్గాలకు రక్షణ కల్పించే గొప్ప పత్రమన్నారు. కానీ నేడు అంగన్‌వాడి కార్యకర్తలు, హెల్పర్లు తక్కువ వేతనాలతో, అధిక పనిభారంతో, ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడి సిబ్బందికి గౌరవ వేతనం పెంచాలని, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, పదవీ విరమణ ప్రయోజనాలు కల్పించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సామాజిక భద్రతా పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పుల ప్రకారం అంగన్‌వాడి సిబ్బందికి న్యాయం చేయాలని, ఐసిడిఎస్ పథకాన్ని బలోపేతం చేసి ప్రైవేటీకరణ ప్రయత్నాలను విరమించాలని ఆమె ప్రభుత్వాలను కోరారు. అంబేద్కర్ చూపిన సమానత్వం, సామాజిక న్యాయం మార్గంలోనే కార్మికుల హక్కుల సాధన కోసం పోరాటాన్ని మరింత బలోపేతం చేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఉమాగౌడ్, సిఐటియు గౌరవ అధ్యక్షులు బషీర్‌అహ్మద్, నాగేంద్ర, అంగన్‌వాడి కార్యకర్తలు, హెల్పర్లు, వెలుగు విఒఏలు, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తాం

- బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి

అంబేద్కర్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాలులు అర్పిస్తున్న బిజెపి, జనసేన నాయకులు

కదిరి, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

భారత రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్.అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తామని బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత బిఆర్.అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా మంగళవారం బిజెపి, జనసేన టిడిపి ఆధ్వర్యంలో ఘనంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం భారతరాజ్యాంగ నిర్మాత డా.బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ..సమాజంలో సమానత్వం న్యాయం, స్వాతంత్ర్యం అనే విలువలను స్థాపించడంలో అంబేద్కర్ పాత్ర అమోఘం అన్నారు. ఆయన చూపిన మార్గం ప్రతి భారతీయుడు అనుసరించాల్సి ఉందని అన్నారు. ముఖ్యంగా యువత ఆయన ఆలోచనలను ఆదర్శంగా తీసుకుని దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో దేశంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం, పేదరిక నిర్మూలన అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌ఓ సైతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జ్ న్యాయవాది భైరవ ప్రసాద్, తెలుగుదేశంపార్టీ నాయకులు న్యాయవాది నాగేంద్ర ప్రసాద్, కొత్తచెరువు మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ ప్రేమ్‌నాథ్‌రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు ఉత్తంరెడ్డి, సుదర్శన్, ఓబిసి మోర్చ రాష్ట్ర కార్యదర్శి చంటి, డిఎల్ ఆంజినేయులు, నాగార్జున, ప్రతాప్, బిజెపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

అగాపే ఆశ్రమంలో అన్నదానం

అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

యాడికి, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

యాడికి మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డు, రాఘవేంద్ర కాలనీలో ఉన్న ఆగాపే ఆశ్రమంలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని నగరూరు గ్రామానికి చెందిన రామాంజనేయులు, శివ, హరీష్, విష్ణు, సూరి, వెంకటనారాయణ, రాజు, వరుణ్‌లు ఈ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అంబేద్కర్ భారతీయ న్యాయవాదిగా, ఆర్థిక శాస్త్రవేత్తగా, రాజకీయ నేతగా, సంఘసంస్కర్తగా పనిచేశారని, సమాజంలో ఆయన ఆలోచన విధానం మార్పు తెచ్చేవిగా ఉంటాయని, ప్రజలకు సమాన హక్కులు కల్పించాలని ఎంతగానో కృషి చేశారన్నారు. అలాంటి వ్యక్తి జయంతిని ఘనంగా జరుపుకోవడం ఆనందంగా వుందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అగాపే ఆశ్రమంలో కేక్ కట్ చేసి ఆశ్రమంలోని వారందరికి భోజనాలు వడ్డించారు. దీంతో ఆశ్రమ ఫౌండర్ బత్తల ప్రసాద్, ఆశ్రమంలోని వారు వారికి అభినందనలు తెలిపారు.

మున్సిపల్ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు

అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కమీషనర్, సిబ్బంది

తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

తాడిపత్రి మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విశిష్ట సేవలను స్మరించుకున్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, మానవ హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన అపార కృషి దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని కొనియాడారు. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి పౌరుడు జీవితంలో మార్గదర్శకంగా ఉండాలని, సమాజంలో ప్రతి వర్గానికీ సమాన అవకాశాలు కల్పించడం మనందరి బాధ్యతన్నారు. యువత ఆలోచనలను ఆచరణలో పెట్టి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఏ.పేరవాండ్లపల్లిలో ఘనంగా జ్యోతుల కార్యక్రమం

జ్యోతుల వేడుకల్లో పాల్గొన్న భక్తులు

అమడగూరు, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

అమడగూరు మండలం ఏ.పేరవాండ్లపల్లిలో మంగళవారం జ్యోతుల మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక నుండి తెప్పించిన సప్పలమ్మ దేవతకు గ్రామస్తులు పొట్టేళ్లను బలిదానం చేస్తూ తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి మండలం నుండే కాకుండా కర్ణాటక మండలాల నుండి భారీగా ప్రజలు తరలివచ్చారు. గ్రామస్తులు ప్రతి ఏటా ఉగాది పండుగ తరువాత ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పేరం శివప్ప, బాబు, ఎస్సాలు ఆంజనేయులు, ఈశ్వరయ్య, నరసింహులు, మూర్తి, కృష్ణ, శ్రీనివాసులు, మంజునాథ, వెంకటరమణ, రంగప్ప, నాగరాజు, డాక్టర్ సమరం, రామాంజులు, ఆంజనేయులు, ఆదినారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న సంతోష్

కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సంతోష్

అమడగూరు, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబే డ్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ చేతుల మీదుగా అమడగూరు మండ లానికి చెందిన మహేష్, మంజుల దంపతుల కుమారుడు కె.సంతోష్ అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్నాడు. విద్యా, ప్రతిభా రంగాల్లో సాధించిన విశేష ప్రతిభకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సంతోష్‌ను కలెక్టర్ అభినందిస్తూ భవి ష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్డీఓ సువర్ణ, అమడగూరు హాస్టల్ వార్డెన్లు కృష్ణనాయక్, రవీంద్రనాథ్‌రెడ్డిలు సంతోష్‌ను అభినందించారు.

సిపిఐ ఆధ్వర్యంలో బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు

అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న సిపిఐ నాయకులు

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు రంగయ్య. పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ మాట్లాడుతూ అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రచించడం జరిగిందన్నారు. అందరికీ సమాన హక్కులను కల్పించారని, దళితుల హక్కుల కోసం పోరాడారన్నారు.భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) పునాదిగా పనిచేసే ఆలోచనలను అందించడంలో కీలక పాత్ర పోషించారన్నారు. లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడం, అణగారిన వర్గాల కోసం సాధికారత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తన జీవితంలో ఎక్కువ భాగాన్ని అంకితం చేశారన్నారు. భారత రాజ్యాంగ శిల్పిగా, ప్రజాస్వామ్య పరిరక్షకునిగా, మహామేధావిగా, సంఘసంస్కర్తగా పాటుపడ్డారని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణ, నాగరంగయ్య, శ్రీనివాసులు, సూరి, అబ్రహం, తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ అంబేద్కర్‌కు జె.సి ప్రభాకర్‌రెడ్డి ఘన నివాళి

అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జె.సి ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను మంగళవారం తాడిపత్రిలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆర్టీసి బస్టాండ్ సర్కిల్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డి పూలమాల వేసి భారతదేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు. సామాజిక సమానత్వం, న్యాయం, విద్య ప్రాముఖ్యతపై అంబేద్కర్ పాటుపడ్డారని గుర్తు చేసుకున్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం రాజ్యాంగం ద్వారా సమాన హక్కులు కల్పించిన మహోన్నత వ్యక్తి బిఆర్ అంబేద్కర్ అని జె.సి ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు.

బాల్య వివాహాలకు దూరంగా ఉండాలి

- రూరల్ సిఐ శివగంగాధర్‌రెడ్డి

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిఐ శివగంగాధర్‌రెడ్డి

తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 14 ప్రభాతవార్త

సమాజంలో బాల్యవివాహాలకు దూరంగా ఉండాలని తాడిపత్రి రూరల్ అప్‌గ్రేడ్ సిఐ శివగంగాధర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. శ్రీరక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని అక్కన్నపల్లి గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని పోలీసులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన సిఐ శివగంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. మహిళలకు చట్టం గురించి అవగాహన కల్పించారు. సైబర్ మోసాల పట్ల ప్రజలు అవగాహన కలిగి తమ మొబైల్‌కు వచ్చే ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేయరాదన్నారు. దానివల్ల తమ ఖాతాలో ఉన్న డబ్బులు కోల్పోయే అవకాశాలు ఉన్నాయన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. ఏవైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతూ ఉంటే తమకు సమాచారం అందిస్తే వాటిని అరికట్టడానికి అవకాశం ఉంటుందన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలియజేశారు. అనంతరం కడప రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి జరిమానా విధించారు. ఈ కార్యక్రమాల్లో సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో ఘనంగా అంబేద్కర్ జయంతి

టిడిపి కార్యాలయంలో అంబేద్కర్ జయంతి దృశ్యం

పెనుకొండ ఏప్రిల్ 14 ప్రభాతవార్త

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ పట్టణ కార్యాలయం (అన్న క్యాంటీన్ ఆఫీస్) నందు భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 136వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమం మంత్రి సవిత సూచనలు మేరకు నిర్వహించబడింది.ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం అంబేద్కర్ సర్కిల్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అర్బన్ టిడిపి కన్వీనర్స్ శ్రీరాములు మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ సేవలను స్మరించుకుంటూ, ఆయన చూపిన మార్గంలో నడవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, విద్య యొక్క ప్రాముఖ్యతను ఆయన సందేశంగా నిలిచాయని శ్రీరాములు తెలిపారు.ఈ కార్యక్రమం లో పెనుకొండ మండల రూరల్ కన్వీనర్ ఈశ్వర ప్రసాద్, టిడిపి పట్టణ మహిళా అధ్యక్షురాలు రమణమ్మ.బిజెపి రామకృష్ణ, రామాంజినేయులు, జనసేన శ్రీదేవి తెలుగుదేశం పార్టీ బిజెపి జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

15-04pg10.qxd:15-04pg10.qxd 15/04/26 11:39 PM Page 1

గోపాల్‌గంజ్ పేస్ గన్

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ కనుగొన్న అద్భుత ఆణిముత్యం సాకిబ్ హుస్సేన్. ఈ 21 ఏళ్ల యువ పేసర్ అరంగేట్రం మ్యాచ్‌లోనే రాజస్థాన్ రాయల్స్ బ్యాటర్ల వెన్నులో వణుకు పుట్టించాడు. తొలి మ్యాచ్‌లోనే 4 వికెట్లు తీసి అదరహో అనిపించాడు. తన 4 ఓవర్ల కోటాలో 24 రన్స్ మాత్రమే ఇచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టాడు. తద్వారా ఐపీఎల్ అరంగేట్రంలో అత్యుత్తమ ప్రదర్శన చేసిన భారత ఆటగాడిగా ముంబై ఇండియన్స్ బౌలర్ అశ్విని కుమార్ పేరిట ఉన్న రికార్డును సాకిబ్ సమం చేశాడు.

బీహార్‌లోని గోపాల్‌గంజ్ నుంచి వచ్చిన సాకిబ్ సైనికుడు కావాలనుకున్నాడు. దుర్భర ఆర్థిక పరిస్థితులు అతన్ని క్రికెట్ వైపు మరల్చాయి. సాకిబ్ కేవలం వేగంతోనే కాకుండా తన స్లోయర్ బంతులతో బ్యాటర్లను బోల్తా కొట్టించడంలో దిట్ట. గంటకు 140కిలోమీటర్ల పైగా వేగంతో బంతులు వేస్తూనే, అకస్మాత్తుగా వేగాన్ని తగ్గించి బ్యాటర్ల టైమింగ్‌ను దెబ్బతీస్తాడు. రాజస్థాన్ మ్యాచ్‌లో ఫెరీరాను తన స్లోయర్ బంతితోనే అవుట్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు.

సాకిబ్‌కు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీతో తొలి బ్రేక్ లభించింది. అక్కడ మంచి ప్రదర్శన్ ఇవ్వడంతో తమ నెట్ బౌలర్‌గా సీఎస్‌కే తీసుకుంది. 2024 ఐపీఎల్ వేలంలో సాకిబ్ అన్‌సోల్డ్‌గా మిగిలాడు. నిలకబడగా 140 కి.మీ వేగంతో బంతులు విసిరే సాకిబ్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్ అక్కున చేర్చుకుంది. ఆ సీజన్‌లో ఒక్క మ్యాచ్ ఆడే అవకాశం రాలేదు. 2025వేలానికి ముందు అతడిని కేకేఆర్ వదలిపెట్టింది. సన్‌రైజర్స్ బౌలింగ్ కోచ్ వరుణ్ ఆరోన్ దృష్టిలో సాకిబ్ పడడంతో... అతన్ని మినీ వేలంలో 30 లక్షల బేస్ ధరతో తీసుకుంది. ఇప్పుడు ఆ నమ్మకాన్ని సాకిబ్ వంద శాతం నిలబెట్టుకున్నాడు.

కుర్రాళ్లు కేక

ఐపీఎల్ అంటే బ్యాట్స్‌మెన్ గేమ్. ఇక మెరుపు వీరులు, ధనాధన్ వీరులు, డైనమైట్లు, మ్యాచ్ ఫినిషర్లు పదుల సంఖ్యలో దూసుకురావడంతో బ్యాట్స్‌మెన్ హవా మరింతగా పెరిగింది. బంతి పడింది తడువే స్టాండ్స్‌లోకి పంపించే వాళ్లు రావడంతో ఎంతటి బౌలర్‌కైనా చుక్కలు కనబడుతున్నాయి. బంతి వేయడం వరకే బౌలర్లు పరిమితమవుతున్నారు. వికెట్ తీయడం అటుంచి డాట్ బాల్ వేయడమే అదే మహా భాగ్యం అన్నట్లుగా బౌలర్ల పరిస్థితి మారింది. ఇలాంటి పరిస్థితుల్లోనూ అపుడపుడూ బౌలర్లు పైచేయి సాధిస్తున్నారు. పిచ్ నుంచి కాసింత సహకారం లభించినా బ్యాట్స్‌మెన్ గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నారు. ఇదే కోవలోకి వస్తారు. ఐపీఎల్ అరంగేట్ర బౌలర్లు ప్రపుల్ హింగే, సకిబ్ హుస్సేన్.

(వార్త క్రీడా విభాగం): వేదిక ఉప్పల్ స్టేడియం... సన్ రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్. మ్యాచ్‌కు ముందు అందరి చూపు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీపైనే. ఎవరి డామినేట్ చేస్తారన్నదానిపైనే లెక్కలన్నీ. వీరిద్దరి తర్వాత అందరి చూపు ఇషాన్ కిషన్, యశస్వీ జైస్వాల్‌పై. ఈ నలుగురు తప్పిస్తే మరొకరి ఊసే లేదు. ఇక బౌలర్లయితే ఊసేలోనే లేకుండా పోయారు. మ్యాచ్ ముగిసిన తర్వాత సీన్ రివర్స్. డెబ్యూ బౌలర్లు ప్రపుల్ హింగే, సకిబ్ హుస్సేన్ ఒక్కసారిగా హీరోలుగా మారాయి. తమ సూపర్ స్పెల్‌తో హాట్ టాఫిక్ అయ్యారు. వీరు ఎక్కడి నుంచి వచ్చారని సెర్చ్ ఇంజిన్‌లో ఒకటే వెతుకులాట. నిజానికి సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటింగ్‌లో తక్కువేమీ కాదు. ఆడిన అయిదు మ్యాచ్‌ల్లో నాలుగింటిలో 200 ప్లస్ రన్స్ చేసింది. బౌలర్ల వైఫల్యంతోనే మ్యాచ్‌లుచేజార్చుకుంటూ వస్తోంది. ఉప్పల్‌లోనూ 200 ప్లస్ చేసినా ఆరేంజ్ ఆర్మీ సేనలో, అభిమానుల్లో ఓ దిగులు. దీన్ని కాపాడు కుంటారా అని? ఇండియన్ పేసర్ హార్షల్ పటేల్, సీనియర్ పేసర్ జయ్‌దేవవ్ ఉనద్కత్ స్థానంలో జట్టులోకి వచ్చిన ప్రపుల్ ప్రకాష్ హింగే, సాకిబ్ హుస్సేన్ అద్భుతం చేశారు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను ఈ పేస్ ద్వయం గెలుపు ట్రాక్‌లో నిలిపారు.

నాగ్‌పూర్ ఎక్స్‌ప్రెస్

నాగ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ప్రపుల్ ప్రకాష్ హింగే.. రికార్డుతో ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. తొలి ఓవర్లోనే అద్భుత స్పెల్‌తో మెస్మరైజ్ చేశాడు. మూడు వికెట్లు తీసి రాజస్థాన్ రాయల్స్ టాప్ ఆర్డర్ కుప్పకూల్చాడు. తద్వారా 19 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలోనే తొలి ఓవర్‌లోనే మూడు వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా ఘనత సాధించాడు.

సూపర్ పామ్‌లో ఉన్న వైభవ్‌ని రెండో బంతికే బౌన్సర్‌తో చెక్కాయించి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. ఆ తర్వాత నాలుగోబంతికి జురేల్‌ను, ఆరో బంతికి ప్రిటోరియస్‌ను పెవిలియన్‌కు పంపాడు. ముగ్గురూ కూడా గోల్డెన్ డక్ అయ్యారు. తరువాతి ఓవర్ చివరి బంతికి పరాగ్ పనిపట్టాడు. ప్రత్యర్థి జట్ల బౌలర్లను వణికించిన రాయల్స్ టాప్ ఆర్డర్... హింగే బౌలింగ్‌కు వణికిపోయింది.

నాగ్‌పూర్‌లో 2002లో జన్మించిన ప్రఫుల్ హింగే... 2024-25 రంజీ ట్రోఫీ, విజయ్ హజారే ట్రోఫీలను విదర్భ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఎత్తుగా ఉండే ప్రఫుల్, బంతిని వేగంగా వేయడమే కాకుం డా మంచి బౌన్స్‌ను రాబట్టగలడు. ఎంఆర్ఎఫ్ పేస్ ఫౌండేషన్‌లో రాటుదేలిన హింగే... ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో కూడా ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు. తన క్రమశిక్షణతో కూడిన బౌలింగ్‌తో ఐపీఎల్ స్కౌట్స్ దృష్టిని ఆకర్షించాడు.

ఐపీఎల్ మెగా వేలంలో సన్‌రైజర్స్ హైదరాబాద్... ప్రఫుల్ హింగ్‌ను కేవలం 30 లక్షలకు కొనుగోలు చేసింది. గత మ్యాచ్‌లోనే తుది జట్టులోకి వచ్చినా ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ వల్ల చివరి నిమిషంలో బెంచ్‌కే పరిమితం కావాల్సి వచ్చింది. రాజస్థాన్‌పై వచ్చిన అవకాశాన్ని రెండు చేతులా ఒడిసిపట్టుకున్నాడు. సీనియర్ బౌలర్ జయదేవ్ ఉనద్కత్ స్థానంలో జట్టులోకి వచ్చి, తాను ఏంటో ప్రపంచానికి చాటి చెప్పాడు.

భారత్‌లో ఫార్ములా వన్ రేసు?

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది భారత్‌లో ఫార్ములా వన్ రేసు నిర్వహించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. గ్రేటర్ నోయిడాలో 2011, 2012, 2013లలో ఇండియన్ గ్రాండ్‌ప్రి పేరుతో ఎఫ్1 రేసులు జరిగాయి. అనంతరం ట్యాక్స్ చెల్లింపు రాయితీలు ఇవ్వకపోవడం, ఇతరత్రా కారణాలతో 2014 నుంచి ఎఫ్1 రేసులు భారత్‌లో కొనసాగించేందుకు ఫార్ములావన్ నిర్వాహకులు ఆసక్తి చూపలేదు. వచ్చే ఏడాది భారత్‌లో ఎఫ్1 రేసు నిర్వహించేందుకు మూడుసంస్థలు ఆసక్తిగా ఉన్నాయి. విధివిధానాలు ఖరారు చేయడానికి ఆరు నెలలు పడుతుంది. భారత్‌లో ఎఫ్1 పునరాగమనం చేసేందుకు అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయి. పన్ను రాయితీలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని మాండవీయ తెలిపారు.

సంజూకు ఐసిసి ప్లేయర్ ఆఫ్ ది మంత్

ముంబై: భారత్ అతిథ్యమిచ్చిన టీ20 ప్రపంచకప్ నాకౌట్ స్టేజ్‌లో విరుచుకుపడి టీమిండియాకు కప్ అందించిన సంజూ శాంసన్‌కు తగిన గుర్తింపు దక్కింది. సంచలన ఇన్నింగ్స్ ఆడిన సంజూకు ఐసీసీ అవార్డు లభించింది. హ్యాట్రిక్ అర్ధ శతకాలతో దుమ్ములేపిన సంజూ... ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు ఎంపికయ్యాడు. మార్చి నెలకు ఐసీసీ జరిపిన ఓటింగ్‌లో టీమిండియా పేసర్ జస్ప్రీత్ బుమ్రాను వెనక్కి నెట్టేసి శాంసన్ ఈ గౌరవాన్ని అందుకున్నాడు. మహిళల విభాగంలో అమేలియా కేర్ అవార్డుకు ఎంపికైంది. సూపర్8లో వెస్టిండీస్‌పై 97.. సెమీఫైనల్లో ఇంగ్లండ్ మీద 89, ఫైనల్లో న్యూజిలాండ్‌పై 89 పరుగులతో రాణించిన సంజూ ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచాడు. తనకు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు రావడం పట్ల సంజూ సంతోషం వ్యక్తం చేశాడు. ఐసీసీ అవార్డుకు ఎంపికవ్వవడం గొప్ప అనుభూతని, తన క్రికెట్ ప్రయాణంలో మర్చిపోలేని దశ సమయంలో ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందని సంజూ చెప్పాడు.

చెన్నైకి రెండో విజయం

చెన్నై: గెలుపు ట్రాక్‌లో పడ్డ చెన్నై సూపర్ కింగ్స్ వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. సొంతగడ్డపై జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై భారీ తేడాతో నెగ్గింది. సంజూ శాంమ్సన్(48), ఆయుష్ మాత్రే(38), డెవాల్డ్ బ్రేవిస్(41), సర్ఫరాజ్ ఖాన్(23) రాణించడంతో మొదట బ్యాటింగ్ చేసిన చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగుల పటిష్టస్కోరు చేసింది. 32 బంతుల్లో నాలుగు ఫోర్లు, మూడు సిక్స్‌లతో సంజూ వేగంగా 48 రన్స్ చేశాడు. సీఎస్‌కే ఇన్నింగ్స్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 193 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన కోల్‌కతా నైట్‌రైడర్స్ మరోసారి విఫలమైంది. ఫిన్ అలెన్(1)ను అవుట్ చేసి కంబోజ్... కేకేఆర్ వికెట్ల పతనానికి నాంది పలికాడు. నూర్ ఆహ్మద్ మూడు వికెట్లు తీసి కేకేఆర్‌ను స్వల్ప స్కోరుకు కట్టడిచేశాడు. కెప్టెన్ అజింక్యా రహానే (28), సునీల్ నరైన్(24), రఘువంశీ(27), రింకూ సింగ్(6), కామరూన్ గ్రీన్(0) నిరాశపరిచారు. స్లాగ్ ఓవర్లలో రోవ్‌మన్ పావెల్, రమణ్ దీప్ సింగ్ పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. చెన్నై సూపర్ కింగ్స్‌కు ఇది వరుసగా రెండో విజయం కాగా.. కోల్‌కతా నైట్ రైడర్స్ ఇప్పటివరకు గెలుపు బోణీ చేయలేకపోయింది. ఆడిన 5 మ్యాచ్‌ల్లో నాలుగింట పరాజయాలు పొందగా, ఓ మ్యాచ్ వర్షార్పణం అయింది. పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచింది.

జోరుమీదున్న ఆర్సీబీ-లక్నోకు సవాల్

బెంగళూర్: ముంబై ఇండియన్స్‌పై విజయంతో జోరు మీదికొచ్చిన రాయల్‌ఛాలెంజర్స్ బెంగళూర్... సొంత వేదికగా మరో మ్యాచ్‌కు సిద్ధమైంది. నేడు లక్నో సూపర్ జెయింట్స్‌తో తలపడనుంది. నాలుగు మ్యాచ్‌లాడిన ఆర్సీబీ మూడు విజయాలు, ఒక పరాజయంతో మొత్తం ఆరు పాయింట్లతో ఉంది. మొదటి రెండుమ్యాచ్‌ల్లో ఎస్ఆర్‌హెచ్, సీఎస్‌కేలపై గెలుపొందిన ఆర్సీబీ ...రాజస్థాన్ రాయల్స్ చేతిలో పరాజయం పొందింది. గత మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌ను ఓడించి మళ్లీ గెలుపు ట్రాక్‌లోపడింది. ఆర్సీబీ టాప్ ఆర్డర్ సూపర్ ఫామ్‌లో ఉంది. ఫిల్ సాల్ట్, విరాట్ కోహ్లీ, రజత్ పాటిదార్, టిమ్ డేవిడ్... చక్కగా రాణిస్తున్నారు. దీంతో వీరిని కట్టడి చేయడం లక్నో సూపర్ జెయింట్స్‌కు సవాల్‌గా మారింది. రిషబ్ పంత్ నేతృత్వంలోని లక్నో సూపర్ జెయింట్స్ ఈ సీజన్‌లో అనుకున్న స్థాయిలో ఆడలేక నిరాశపరుస్తోంది. నాలుగు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు, రెండు పరాజయాలతో ఉంది. లక్నోకు బ్యాటింగ్ ఆందోళన పరుస్తోంది. అయిడెన్ మార్క్‌రమ్, మిచెల్ మార్ష్ శుభారంభం ఇవ్వడంలో విఫలమవుతున్నారు. రిషబ్ ఒక్క మ్యాచ్‌లో తప్పిస్తే ఆకట్టుకునే ప్రదర్శన లేదు. నికోలస్ పూరన్ గాడిన పడాల్సి ఉంది. మ్యాచ్ ఫినిషర్‌గా మారిన ముకుల్ చౌదరీపై మరోసారి లక్నో ఆశలు పెట్టుకుంది.

ఐపీఎల్‌లో నేటి మ్యాచ్

ఆర్సీ బెంగళూర్ V/S లక్నో సూపర్ జెయింట్	రాత్రి 7.30 గం.లకు

వాణిజ్యం

కరెన్సీ విలువ పెంపు దిశగా సింగపూర్ బ్యాంక్

సింగపూర్ సిటీ, ఏప్రిల్ 14: పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులు ప్రపంచదేశాల్ని అతలాకుతలం చేస్తున్నాయి. దేశాల ఆర్థిక వ్యవస్థల్నే ప్రభావితం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే సింగపూర్ కీలక నిర్ణయం తీసుకుంది. సింగపూర్ కేంద్రబ్యాంక్ అయిన మానిటరీ అథారిటీ ఆఫ్ సింగపూర్ తన మానిటరీ పాలసీ విధానాన్ని ప్రకటించింది. ఇక్కడ పాలసీని మరింత కఠినతరం చేస్తూ అదే సమయంలో వృద్ధిపై కాకుండా ద్రవ్యోల్బణం నియంత్రణపై దృష్టిసారించింది. ఇందుకోసం కరెన్సీ విలువను పెంచుకోవాలని చూస్తోంది. ఒకవైపు ఇంధన ధరలు పెరగడం.. మరోవైపు సప్లై చెయిన్‌లో అంతరాయాలు ఏర్పడటం కారణంగా ద్రవ్యోల్బణం మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించింది. దేశ ఆర్థిక వృద్ధి2026లో మందగించే అవకాశం ఉంది. ఇదే సమయంలో ద్రవ్యోల్బణం పెరుగుతుందని అంచనా వేస్తోంది. ఇక 2026 ఏడాదికి ద్రవ్యోల్బణం అంచనాల్ని 12 శాతం నుంచి 1.52.5 శాతానికి పెంచింది. తమ కరెన్సీ విలువల్ని పెంచడం ద్వారా దిగుమతి చేసుకునే వస్తువుల భారాన్ని తగ్గించుకోవాలని చూస్తోంది. సింగపూర్ వృద్ధి రేటు కిందటి త్రైమాసికంతో పోలిస్తే 0.3 శాతం తగ్గింది. మార్కెట్ అంచనాల కంటే తక్కువగా నమోదైంది.

సాధారణంగా ఏ దేశమైనా ఆర్థిక వృద్ధి మందగిస్తున్నప్పుడు వడ్డీ రేట్లను తగ్గించి మార్కెట్లోకి డబ్బును విడుదల చేస్తుంది. కానీ సింగపూర్ అందుకు భిన్నంగా టైటనింగ్ పాలసీని ఎంచుకుంది. మన దేశంలో ఆర్‌బిఐ.. వడ్డీ రేట్లను మార్చడం (పెంచడం లేదా తగ్గించడం లేదా స్థిరంగా ఉంచడం) ద్వారా ఆర్థిక వ్యవస్థను నియంత్రిస్తుంటుంది. కానీ సింగపూర్ సెంట్రల్ బ్యాంక్ పద్ధతి వేరు. సింగప వడ్డీ రేట్ల కంటే కరెన్సీ విలువపై ఎక్కువగా ఆధారపడతారు. సింగపూర్ తన డాలర్ (ఎస్ఎంబి) విలువను ఇతర ప్రధాన దేశాల కరెన్సీలతో పోల్చినప్పుడు కొంత మేర పెంచుతుంది.

సింగపూర్ డాలర్ బలంగా ఉంటే ఇతర దేశాల నుంచి వస్తువుల్ని కొన్నప్పుడు తక్కువ ధరకే వస్తాయి. అంటే దిగుమతి చేసుకున్న ద్రవ్యోల్బణం తగ్గుతుంది. ప్రస్తుతం సింగపూర్ రెండు విభిన్న సవాళ్లను ఎదుర్కొంటోంది. ఒకటి ద్రవ్యోల్బణం. నిత్యావసర వస్తువులు, విద్యుత్, గ్యాస్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. సామాన్యుడి బడ్జెట్ తలకిందులవుతోంది. రెండోది వృద్ధి మందగమనం..ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి వల్ల సింగపూర్ ఎగుమతులు తగ్గిపోయాయి. దేశ ఆర్థిక వృద్ధి రేటు నెమ్మదించింది. ఆర్థిక వృద్ధి తక్కువగా ఉన్నప్పుడు కరెన్సీని బలోపేతం చేయడం ఒక రకమైన సాహసమే. ఎందుకంటే కరెన్సీ విలువ పెరిగితే సింగపూర్ చేసే ఎగుమతులు ఇతర దేశాలకు ఖరీదైనవిగా మారుతాయి. సింగపూర్ కేంద్ర బ్యాంక్ నిర్ణయంతో నిత్యావసరాల ధరలుతగ్గే అవకాశం ఉంటుంది. విదేశీ ప్రయాణాలు చేసే వారికి సింగపూర్ డాలర్ ఎక్కువ విలువను ఇస్తుంది. ఎగుమతులు చేసే కంపెనీలకు మాత్రం లాభాలు తగ్గొచ్చు. కానీ ముడి సరుకును దిగుమతి చేసుకునే పరిశ్రమలకు ఖర్చులు తగ్గుతాయి. ఆర్థిక పరిస్థితిని గతంలోనూ పలుమార్లు టైటనింగ్ నిర్ణయాలు తీసుకుంది. 2008 ఆర్థిక మాంద్యం సమయంలో వృద్ధి పడిపోవడంతో కరెన్సీ విలువను తగ్గించి ఆర్థిక వ్యవస్థను ఆదుకున్నారు.

భారత్ ఆర్థిక వృద్ధి 6.5శాతం

ఐఎంఎఫ్ తాజా అంచనా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: అంతర్జాతీయ ద్రవ్య నిధి ఐఎంఎఫ్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి భారత ఆర్థిక వృద్ధి అంచనాను స్వల్పంగా పెంచి6.5గా నిర్ధారించింది. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న యుద్ధం వల్ల గ్లోబల్ సవాళ్లున్నప్పటికీ ఈ పెంపు చేసింది. తాజా వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్ / గ్లోబల్ ఫైనాన్షియల్ స్టెబిలిటీ రిపోర్ట్"లో విడుదలైన ఈ వృద్ధి అంచనాలు గత జనవరిలో ప్రకటించిన గత అంచనాతో పోలిస్తే 0.1 శాతం పాయింట్ పెంచింది. ఈ పెంపు భారతదేశం బాహ్య ఆర్థిక సవాళ్ల మధ్య కూడా బలమైన పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా కొనసాగుతోందని సూచిస్తోంది. మధ్యప్రాచ్య యుద్ధం కారణంగా చమురు ధరలు, రవాణా ఖర్చులు మరియు ద్రవ్యోల్బణ అంచనాలు ప్రభావితమయ్యాయి. ఈ పరిస్థితులు సమీప కాలంలో ద్రవ్యోల్బణంపై ఒత్తిడి పెంచి, గ్లోబల్ ఆర్థిక వృద్ధిని మందగింపజేయవచ్చని ఐఎంఎఫ్ పేర్కొంది. గ్లోబల్ స్థాయిలో ఐఎంఎఫ్ అంచనాలు అంత ఆశాజనకంగా లేవు.

2026 సంవత్సరానికి ప్రపంచ ఆర్థిక వృద్ధి అంచనాను 3.3 నుండి 3.1 కి తగ్గించింది. ఈ ఘర్షణ వల్ల ఇంధన మార్కెట్లు మరియు వాణిజ్య మార్గాల్లో అనిశ్చితి పెరిగిందని పేర్కొంది. యుద్ధం ఎక్కువ కాలం కొనసాగితే వృద్ధి మరింత తగ్గి, ద్రవ్యోల్బణం పెరగవచ్చని హెచ్చరించింది. భారత్ వృద్ధి సవరణ దేశం ఆర్థిక స్థిరత్వాన్ని సూచించినప్పటికీ, దిగుమతి చమురుపై అధిక ఆధారపడటం వల్ల పెరుగుతున్న ముడి చమురు ధరల ప్రభావానికి గురయ్యే అవకాశముందని వెల్లడించింది.

టాప్‌గేర్‌లో ఆటోమొబైల్ సేల్స్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 14:భారత ఆటోమొబైల్ రంగం మార్చి నెలలో బలమైన వృద్ధిని నమోదు చేసింది. ప్యాసింజర్ వాహనాల (కార్లు) విక్రయాలు గతేడాదితో పోలిస్తే 16 శాతం పెరిగాయి. ఈ మేరకు సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ (సియామ్) మంగళవారం గణాంకాలను విడుదల చేసింది. గత ఏడాది మార్చిలో 3,81,358 యూనిట్లుగా ఉన్న ప్యాసింజర్ వాహనాల విక్రయాలు, ఈ ఏడాది మార్చిలో 4,42,460 యూనిట్లకు చేరాయి. మార్కెట్లో పెరిగిన డిమాండ్, డీలర్‌షిప్‌ల వద్ద ఇన్వెంటరీ పెరగడం ఇందుకు ప్రధాన కారణమని సియామ్ పేర్కొంది. ఇదే సమయంలో ద్విచక్ర వాహనాల విక్రయాలు కూడా 19.3 శాతం పెరిగి 19,76,128యూనిట్లకు, త్రీవీలర్ల విక్రయాలు 21.4 శాతం పెరిగి 76,273 యూనిట్లకు చేరాయి. ఫిబ్రవరిలో కూడా వాహన విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 10.6 శాతం పెరిగాయి. పండుగల సీజన్, జీఎస్టీ రేట్ల తగ్గింపు, కొత్త మోడళ్ల రాక వంటి కారణాలతో 2026ఆర్థిక సంవత్సరంలో అమ్మకాల వృద్ధి 7 నుంచి 9 శాతం మధ్య ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

దిగ్గజ కంపెనీల షేర్లు పతనం అయినా తాత్కాలికమే!

ఈక్విటీల్లో ఐటి సూచీలకు వార్ ఎఫెక్ట్

ముంబయి, ఏప్రిల్ 14: ఈక్విటీసూచీల్లో ఈవారం ప్రారంభంలోనే ఐటి రంగాలకు భారీ నష్టం వాటిల్లింది. దిగ్గజ కంపెనీల షేర్లు తిరోగమించాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ డిసిఎస్, పర్సిస్టెంట్ సిస్టమ్స్, ఇన్ఫోసిస్ , విప్రో షేర్లు 1 శాతం కంటే ఎక్కువ పతనమయ్యాయి.

లాభాల్లో ఉన్నవి: మార్కెట్ అంతా నష్టాల్లో ఉన్నప్పటికీ, కోఫోర్జ్ ఎంఫసిస్ లు మాత్రమే స్వల్ప లాభాలతో గ్రీన్ జోన్‌లో ట్రేడ్ అయ్యాయి. బెంచ్ మార్క్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ 50 కూడా 1.5 శాతానికి పైగా పడిపోవడంతో ఇన్వెస్టర్లలో ఆందోళన మొదలైంది. మార్కెట్ పతనానికి ప్రధాన కారణాలు ప్రస్తుత స్టాక్ మార్కెట్ క్రాష్ వెనుక కొన్ని కీలక అంతర్జాతీయ పరిణామాలు ఉన్నాయి. భౌగోమిడిల్ ఈస్ట్‌లో కాల్పుల విరమణ జరుగుతుందన్న ఆశలు అడియాశలయ్యాయి. గత వారాంతంలో జరిగిన అమెరికాఇరాన్ చర్చలు విఫలం కావడంతో యుద్ధ మేఘాలు మళ్ళీ కమ్ముకున్నాయి. ఇది మార్కెట్లలో అనిశ్చితిని పెంచింది. గ్లోబల్ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు ఒక్కసారిగా బారెల్‌కు 104 డాలర్ల మార్కును దాటాయి. చమురు ధరలు పెరగడం వల్ల ద్రవ్యోల్బణం పెరుగుతుందనే భయంతో ఇన్వెస్టర్లు రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడటం లేదు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్తతల వల్ల ఇన్వెస్టర్లు తమ షేర్లను విక్రయించి నగదును సురక్షితమైన పెట్టుబడుల వైపు మళ్ళిస్తున్నారు.

ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలు, ముడి చమురు ధరల పెరుగుదల భారతీయ స్టాక్ మార్కెట్ పై తీవ్రమైన ఒత్తిడిని పెంచుతున్నాయి. ముఖ్యంగా అమెరికా, యూరోపియన్ మార్కెట్లపై ఎక్కువగా ఆధారపడే ఐటీ రంగం, గ్లోబల్ సెంటిమెంట్ దెబ్బతినడంతో భారీ నష్టాలను చవిచూస్తోంది. టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ కంపెనీల షేర్లు పతనం కావడం అనేది ఇన్వెస్టర్లలో ఆందోళన కలిగించే అంశమే అయితే ఇది కేవలం తాత్కాలిక భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల వల్ల జరుగుతున్న మార్పుగా నిపుణులు విశ్లేషిస్తున్నారు. క్రూడ్ ఆయిల్ ధరలు బారెల్‌కు 104 దాటడం అనేది ద్రవ్యోల్బణ భయాలను పెంచుతోంది, దీనివల్ల మార్కెట్‌లో అమ్మకాల ఒత్తిడి కొనసాగవచ్చు. బలమైన ఫండమెంటల్స్ ఉన్న ఐటీ షేర్లు ఇలాంటి పతనం సమయంలో ఆకర్షణీయమైన ధరలకు లభించే అవకాశం ఉంది. సాధారణ ఇన్వెస్టర్లు భయాందోళనలతో షేర్లను విక్రయించకుండా, మార్కెట్ స్థిరపడే వరకు వేచి చూడటం లేదా నాణ్యమైన స్టాక్స్‌లో సిప్ పద్ధతిలో పెట్టుబడులు కొనసాగించుకోవచ్చునినిపుణులు సూచిస్తున్నారు.

మళ్లీ పెరిగిన వెండి, బంగారం ధరలు

ముంబయి, ఏప్రిల్ 14: పశ్చిమాసియా ఉద్రిక్తతలు మళ్లీ పెరిగిన వేళ బంగారం, వెండి ధరలు దాదాపు 0.60 శాతం వరకుపెరిగాయి. అంతర్జాతీయంగా కామెక్స్‌లో స్పాట్ పసిడి ధర 0.6 శాతం తగ్గి ఔన్స్‌కు 4,718.98 డాలర్ల వద్ద వద్ద స్థిరపడింది. అస్థిరత నేపథ్యంలో కొనుగోలుదారులు బంగారంలో పెట్టుబడి పెట్టడానికి ఎగబడుతున్నారు. ఇబ్బడి ముబ్బడిగా ఇన్వెస్ట్ చేస్తోన్నారు. దీని ప్రభావం కూడా రేట్ల పెరుగుదలకు కారణమైంది. బంగారం ధరల్లో లాభాల మోత ఎక్స్ఛేంజ్ ఎంసిఎక్స్‌లో బంగారం 0.5 శాతం తగ్గి, 10 గ్రాములకు రూ. 1,51,900 వద్ద ట్రేడ్ అయింది. వెండి ధర 1.97 శాతం పడిపోయి కిలోకు రూ. 2,38,486కి చేరింది. ముంబైలో వెండి స్పాట్ ధర కిలోకు రూ. 2.60 లక్షలుగా నమోదైంది. ముంబైలో 10గ్రాముల 24క్యారెట్ల బంగారం రూ.1,52,830, 22 క్యారెట్లు రూ. 1,40,090 పలుకుతోంది. పుణె, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, కోల్‌కతాలోనూ ఇదే ధరలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్‌లో 24క్యారెట్లు రూ.15,393, 22 క్యారెట్లు రూ.14,110 చొప్పున ధరలు కొనసాగాయి.

ఆ మూడు కంపెనీలపై ఇన్వెస్టర్ల నిరాశ

ముంబయి, ఏప్రిల్ 14: భారతీయ స్టాక్ మార్కెట్‌లో అగ్రగామిగా వెలుగొందుతున్న ఐటీసీ, టీసీఎస్, ట్రెంట్ షేర్లు గత ఏడాది కాలంలో ఇన్వెస్టర్లకు నిరాశనే మిగిల్చాయి. సెన్సెక్స్‌లో టాప్ లూజర్స్‌గా నిలిచిన ఈ షేర్లు స్వల్ప కాలికంగా తీవ్ర ఒడిదొడుకులు ఎదుర్కొన్నాయి. అంతర్జాతీయ పరిణామాలు, యుద్ధ మేఘాలు , ఏఐ ముప్పు వంటి కారణాలతో ఈ దిగ్గజ కంపెనీల మార్కెట్ విలువ గణనీయంగా పడిపోయింది.

సిగరెట్లు , ఎఫ్ఎంసీజీ రంగంలో రారాజుగా వెలుగొందే ఐటిసి షేర్ ఏడాదికాలంలో 29పతనమైంది. ఇది సెన్సెక్స్‌లో అత్యధిక నష్టాన్ని నమోదు చేసిన షేర్‌గా నిలిచింది. మూడేళ్ల కాలపరిమితిలో చూసినా ఈ స్టాక్ 20 నష్టపోయింది. ఐటీసీ వాల్యుయేషన్లు ప్రస్తుతం ఆకర్షణీయంగా ఉన్నాయని షేర్‌ఖాన్ వంటి బ్రోకరేజ్ సంస్థలు భావిస్తున్నాయి. సిగరెట్ వాల్యూమ్స్ 6.5 పెరగడం, ఎఫ్ఎంసీజీ విభాగం 11 వృద్ధి సాధించడం సానుకూల అంశాలు. అందుకే దీనికి రూ. 400 వరకు టార్గెట్ ధరను నిర్ణయించారు. భారత ఐటీ దిగ్గజం టిసిఎస్ షేరు ఏడాదిలో 23.50 మేర క్షీణించింది. ఎఐ ఎఫెక్ట్ ఎక్కువగాఉంది. దీని వల్ల ఐటీ ఉద్యోగాలకు , ప్రాజెక్టులకు ముప్పు వాటిల్లు తుందనే ఆందోళన, ట్రంప్ టారిఫ్ వార్‌లు కూడా తోడయ్యాయి. అమెరికా వాణిజ్య విధానాల్లో మార్పులు వచ్చే అవకాశం ఉండటం. అమెరికా ఇరాన్ ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీస్తున్న ప్రభావంతో టీసీఎస్ షేర్ ఐదేళ్ల కనిష్ట స్థాయికి చేరుకుంది. ప్రస్తుతం ఈ స్టాక్ ధర రూ. 2,700 నుంచి రూ. 3,150 మధ్య ఉండొచ్చని వివిధ బ్రోకరేజ్ సంస్థలు అంచనా వేస్తున్నాయి. టాటా గ్రూప్‌కు చెందిన రిటైల్ విభాగం ట్రెంట్ షేర్ ఏడాదిలో 19 పడిపోయింది. ఆరు నెలల్లోనే 17శాతంనష్టాన్ని చవిచూసింది. లాంగ్ టర్మ్ ఇన్వెస్టర్లకు ఇది కాసుల వర్షం కురిపించింది. గత ఐదేళ్లలో ఈ షేర్ ఏకంగా 431 పెరగడం విశేషం. యాంటిక్ బ్రోకింగ్ సంస్థ రూ. 4,856 టార్గెట్ ధరను ఇస్తూ కొనవచ్చని రేటింగ్ ఇచ్చింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Plot No. B-11, B-12, Industrial Estate, Anantapur.-515004. Phone:9848996402 Mail. vaartthaatp@gmail.com, RNI No.70088/97. Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.No. HSD/337/18-20 Air Surcharge: Delhi: 40 Ps.